ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 08.11.2026 | సంపుటి:13 సంచిక:109 | పేజీలు:12 వెల:రూ.4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



యూసంగిలో ఆరుతడి పంటలు వేయండి



ధాన్యం నిల్వకు రాష్ట్రవ్యాప్తంగా
ఆధునిక సైలోలు

- తేమ పరీక్ష, శుభ్రపరచడం, ఆరబెట్టడం, నిల్వకు ఒకే ప్రాంగణంలో సదుపాయాలు
- పౌర సరఫరాల సంస్థ ద్వారా నేరుగా, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు రెండు నమూనాలు
- ప్రతిపాదనలను సమీక్షించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):
వరి ధాన్యాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో ఆరబెట్టి, నాణ్యతను కాపాడుతూ ఎక్కువ కాలం భద్రపరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోల వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తోంది. శనివారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి సైలోల నిర్మాణం, నిర్వహణ, నిధుల సమీకరణపై సమీక్షించారు. పంట కోత తర్వాత నిల్వ నష్టాలను తగ్గించడం, మార్కెట్‌లో ధర అనుకూలించే వరకు రైతులు ధాన్యాన్ని భద్రపరచుకునే వీలు కల్పించడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు.ధాన్యం సైలోలోకి ఎలా చేరుతుంది? ధాన్యాన్ని పెద్ద మొత్తంలో నేరుగా నిల్వ చేయగల భారీ ఉక్కు గిడ్డంగులే సైలోలు. ప్రతిపాదిత సైలో కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసేందుకు తూకం వంతెనలు, తేమ, నాణ్యతను పరీక్షించేందుకు ప్రయోగ శాల ఏర్పాటు చేయనున్నారు. కేంద్రానికి వచ్చిన ధాన్యంలో మట్టి, చెత్త వంటి మలినాలను శుభ్రపరిచే యంత్రాలతో తొలగిస్తారు. తేమ ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని డ్రయ

మిగతా 2లో..



'సర్'ను రద్దు చేయండి

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి: సీజేపీ

తిరువనంతపురం(జనంసాక్షి):ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా కొచ్చిలో తలపెట్టనున్న 'జంతర్ మంతర్ ఎట్ కొచ్చి' నిరసనలో పాల్గొనడానికి శనివారం అభిజీత్ దీప్కే కేరళకు చేరుకున్నారు. దేశంలో స్వతంత్ర, నిష్పక్షపాత ఎన్నికల వ్యవస్థ ఏర్పడే వరకు, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా

మిగతా 2లో..



కేసీఆర్ పదేళ్లలో కొడంగల్‌కు ఏమైనా ఇచ్చారా?.. పదేళ్లపాటు కొడంగల్‌కు నీళ్లు, నిధులు, ప్రాజెక్టులు ఏమీ ఇవ్వలేదు. ప్రాజెక్టులకు భూములు కోల్పోతున్న వారికి ఎకరాకు రూ.20 లక్షలు ఇస్తున్నాం. ఆనాడు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్‌కు మనసొప్పలేదు. కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై తమ పత్రికల్లో విషం చిమ్ముతున్నారు. మూడేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పనిచేస్తున్నా.. వేషాలు మార్చినంత మాత్రాన కేటీఆర్ ఎప్పుడూ రేవంత్‌రెడ్డి కాలేరు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ క్షమించరాని తప్పులు కేసీఆర్ కుటుంబం చేసింది. ఇసుక వ్యాపారానికి అడ్డువస్తున్నారని నేరెళ్ల దళితులను వేధించింది ఎవరూ మర్చిపోలేదు. గిట్టుబాటు ధర అడిగినందుకు ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన విషయాన్ని మర్చిపోలేదు"

- సీఎం రేవంత్ రెడ్డి

కాళేశ్వరం నుంచి నీరివ్వలేం
ఇందుకు బీఆర్ఎస్ పాపాలే కారణం

- పదేళ్లలో పాలమూరు జిల్లాలో ఏ ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు
- మేడిగడ్డ తామే కట్టామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ అది కూలిపోతే మాత్రం బాధ్యత తీసుకోవడం లేదు
- లగచర్లను నొయిడా తరహాలో అభివృద్ధి చేస్తాం
- హకీంపేటలో బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వికారాబాద్ జిల్లా బ్యూరో/ కొడంగల్ (జనంసాక్షి):
మేడిగడ్డ తామే కట్టామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నేతలు, అది కూలిపోతే మా త్రం బాధ్యత తీసుకోవడం లేదని ముఖ్యమంత్రి విమర్శించారు. పదేళ్లలో పాలమూరు జిల్లాలో ఏ ప్రాజెక్టును కేసీఆర్ పూర్తి చేయలేదని, పదే ళ్లలో రూ.20 లక్షల కోట్ల బడ్జెట్ చేతికి వచ్చినా ప్రాజెక్టులు పూర్తి చేయలేదని రేవంత్ రెడ్డి ఆరో పించారు. తెలంగాణ వరప్రదాయనిగా మారే ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టార ని, ప్రాజెక్టు పేరు మార్చి, స్థలం మార్చి, అంచ నాలు పెంచి కాళేశ్వరం కట్టారని, కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్

మిగతా 2లో..





'జనంసాక్షి' పాఠకులకు, ప్రకటనకర్తలకు
దీపావళి శుభాకాంక్షలు

సెలవు

పండుగ సందర్భంగా కార్యాలయానికి నేడు సెలవు. కాబట్టి రేపటి సంచిక వెలువడదు. పునర్దర్శనం మంగళవారం.



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు
దరఖాస్తుల వెల్లువ

వార్త 2లో

మోదీ, మాకు చెప్పండి. దేశపు ట్యాంకులో ఏమి పోస్తున్నారు? పెట్రోల్‌లో అసలు ఎంత ఇథనాల్ ఉంది? 20 శాతం కంటే ఎక్కువగా కలుపుతున్న కంపెనీలపై ఎప్పుడు చర్య తీసుకుంటారు? మనం చర్చించాలనే సవాలు ఇంకా మిగిలే ఉంది. ఆ చర్చల్లో మేము ఈ విషయాన్ని కూడా జోడిస్తాం. మీ విధానాల వల్ల నిజంగా ఎవరు ప్రయోజనం పొందుతున్నారు? - రాహుల్ గాంధీ

ఈ20 కాదది.. 420

నిర్దేశించిన బ్లెండింగ్ పరిమితిని మించి ఇంధనాన్ని విక్రయిస్తున్నారు
ఈథనాల్ పెట్రోల్‌పైమండిపడ్డ రాహుల్ గాంధీ





న్యూఢిల్లీ(జనంసాక్షి):కర్ణాటకలోని పలు పెట్రోల్ బంకుల్లో విక్రయిస్తున్న పెట్రోల్‌లో 20శాతం కంటే ఎక్కువగా ఇథనాల్ ఉన్నట్లు వచ్చిన వార్తలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ20 కార్యక్రమం కాస్తా 420గా మారిందంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగలించడమేనని మండిపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ చమురు కంపెనీలు.. నిర్దేశించిన బ్లెండింగ్ పరిమితిని మించి ఇంధనాన్ని విక్రయిస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు కర్ణాటక లోని పలు జిల్లాల నుంచి సేకరించిన ఇంధన నమూనాల ప్రయోగశాల పరీక్షలను ఆయన ఉటంకించారు.బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణం, రామనగర, మంగళూరు, తుమకూరుతో సహా పలు ప్రాంతాల నుంచి ఈ నమూనాలను సేకరించినట్లు రాహుల్ వెల్లడించారు. వీటిల్లో ఇథనాల్ గాఢతలు 31.2శాతం– 30.5 శాతంగా నమోదయ్యాయని తెలి పారు. గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించిన మొత్తం 14 నమూ నాలలోని

మిగతా 2లో..

ఆంధ్రాలో 90 జడ్పీటీసీ, ఎంపీటీసీలు
కూటమి కైవసం



అమరావతి(జనంసాక్షి):ఏపీ వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి రాష్ట్రంలోని ఆయా జిల్లాలో కూటమి పార్టీల అభ్యర్థులు ఘన విజయం సాధించారు. దీంతో తెదేపా, జనసేన, భాజపా పార్టీ శ్రేణులు గెలుపు సంబరాలను నిర్వహించుకుంటున్నారు. ఏపీలో పరిషత్ ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. ఇప్పటి వరకూ వెలువడిన ఫలితాల్లో కూటమి అభ్యర్థుల జోరు కనిపిస్తోంది.

మిగతా 2లో..

భూసమస్యలు పరిష్కరిస్తాం


అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం

- పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది
- 'ఈ దీపావళి మా దీపావళి' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు గృహప్రవేశాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



నందిగామ (జనంసాక్షి):రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం షాద్‌నగర్ నియోజక వర్గం నందిగామ మండలంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందిగామ గ్రామంలో ఇద్దరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని నూతన గృహాలను ప్రారంభించారు.అనంతరం మహిళా సమాఖ్య భవనం, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని, నందిగామ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నందిగామ గ్రామంలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. పాత జాతీయ రహదారి-7 నుంచి నర్సప్పగూడ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల ఆర్థిక సాయం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సన్నధాన్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని పేర్కొన్నారు.గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు ఆశలు

మిగతా 2లో..



వాయుసేన అద్భుత రికార్డు

13,629 అడుగుల ఎత్తులో భారీ సైనిక విమానం 'ఎల్-76ఎండీ' ల్యాండింగ్..

లెహ్(జనంసాక్షి):విమానయాన చరిత్రలో భారత వైమానిక దళం అరుదైన రికార్డు సృష్టించింది. వాయుసేనకు చెందిన, రష్యన్ తయారీ భారీ రవాణా విమానం 'ఐఎల్-76ఎండీ' లద్దాఖ్‌లోని 13,629 అడుగుల ఎత్తయిన న్యోమా వైమానిక స్థావరంలో విజయవంతంగా ల్యాండ్ అయింది. ప్రపంచంలో ఈ విమానం సాధించిన అత్యంత ఎత్తయిన ల్యాండింగ్ ఇదేనని వాయుసేన 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. విమాన అసాధారణ సామర్థ్యానికి ఇదొక నిదర్శనమని.. సిబ్బంది అత్యుత్తమ నైపుణ్యాలు, కచ్చితత్వం దీనికి తోడయ్యాయని తెలిపింది. ఈ ల్యాండింగ్‌ను దేశ వ్యూహాత్మక వాయు రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే చారిత్రక ఘట్టంగా పేర్కొంది.చైనాతో

మిగతా 2లో..

మరో 4 కార్పొరేషన్లలోనూ
ఇందిరమ్మ టవర్స్


త్వరలోనే నోటిఫికేషన్
వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ మున్సి పల్ కార్పొరేషన్లలో నిర్మాణానికి ఏర్పాట్లు

హైదరాబాద్(జనంసాక్షి):నాలుగు కార్పొరేషన్లలో 480 ఫ్లాట్ల చొప్పున నిర్మించే విధంగా అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. అల్పాదాయ వర్గాల (ఎల్ఐజీ)కు అందించే ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ పథకాన్ని రాష్ట్రంలోని ప్రధాన నగరాలకూ విస్తరించాలని సర్కారు నిర్ణయించింది. హైదరాబాద్ కోర్ పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల నిర్మాణం మాదిరిగానే వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ మున్సి పల్ కార్పొరేషన్లలో కూడా టవర్స్ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 480 ప్లాట్ల చొప్పున నిర్మించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అనువైన స్థలాల గుర్తింపుపై వరంగల్, హనుమకొండ జిల్లాల రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు.హైదరాబాద్ క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో టవర్స్ నిర్మాణం చేపట్టారు. గ్రేటర్ వరంగల్‌లో మాత్రం జీ+5 అంతస్తుల్లో నిర్మించనున్నారు. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలతో పాటు 42 విలీన

మిగతా 2లో..

బీజేపీ మన ప్రజాస్వామ్యాన్ని
తీవ్రంగా దెబ్బతీసింది

గత 12 ఏళ్ల పాలనలో ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడ్డాయి
సోనియా గాంధీ విమర్శలు



న్యూఢిల్లీ(జనంసాక్షి): గత 12 ఏళ్ల బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడ్డాయని సోనియా గాంధీ ఆరోపించారు. వ్యవస్థలను పునరుద్ధరిం చడానికి రాజకీయ పార్టీలు కృషి చేయాలని సోనియా అన్నారు.దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థలు గత 12 ఏళ్లలో తీవ్రంగా దెబ్బతిన్నా యని కాంగ్రెస్

మిగతా 2లో..

క్షిపణుల పరిధిపై పరిమితి
ఎత్తేశాం: ఇరాన్

టెహ్రాన్(జనంసాక్షి):బాలిస్టిక్ క్షిపణుల పరిధిపై విధించుకున్న 2,000 కిలోమీటర్ల స్వీయ పరిమితిని ఎత్తేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. దీంతో మరింత దూరంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణులను అభివృద్ధి చేసే దిశగా ఇరాన్ అడుగులు వేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్, అమెరికాల దాడులకు.. హదుల్లేని ప్రతిదాడులు చేద్దామని ఇరాన్ సేనలకు సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పిలుపు నిచ్చిన వారం రోజుల వ్యవధిలోనే

మిగతా 2లో..

ప్రతి విషయాన్ని విచారించే
అధికారం ఈడీకి లేదు

కర్ణాటక హైకోర్టు కీలక వ్యాఖ్యలు

2లో

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
08.11.2026

బీజేపీ మన ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది

అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఆరోపించారు. అధికార బీజేపీ ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించారు. దేశ మౌలిక స్వరూపానికి, ప్రజాస్వామ్యానికి జరిగిన నష్టాన్ని ప్రజలు క్రమంగా గుర్తిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో ప్రజాస్వామ్య వ్యవస్థలను పునరుద్ధరించడానికి రాజకీయ పార్టీలు సమష్టిగా కృషి చేయాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. మీా ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.గత పన్నెండేళ్లలో దేశ మౌలిక స్వరూపం, ప్రజాస్వామ్యం, సంస్థలకు తీవ్ర నష్టం జరిగిందని సోనియా గాంధీ అన్నారు. ఈ పరిణామాలను ప్రజలు ఇప్పుడు అర్థం చేసుకోవడం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, సుపరిపాలనను తిరిగి తీసుకురాగల సామర్థ్యం భారత ఓటర్లకు ఉందని తనకు విశ్వాసం ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో నుంచి వెళ్లిపోయిన తర్వాత కూడా వ్యవస్థలను పునరుద్ధరించడం అంత సులభం కాదని అభిప్రాయపడ్డారు. ఇందుకు కొంత సమయం పడుతుందని, రాజకీయ పార్టీల నుంచి గట్టి ప్రయత్నం అవసరమని చెప్పారు. ప్రజలు ప్రస్తుతం అసహనానికి గురవుతున్నారని, దేశంలో జరుగుతున్న పరిణామాలను గుర్తిస్తున్నారని అన్నారు. అయినప్పటికీ తాను ఆశావాదంతో ఉన్నానని, దేశంలో మళ్లీ మంచి పాలన రావడాన్ని ప్రజలు స్వాగతిస్తారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎమర్జెన్సీపై ఇందిరా గాంధీ నిర్ణయం

1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీపై కూడా సోనియా గాంధీ తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆ 21 నెలల కాలంలో ప్రజాస్వామ్య హక్కులపై ఆంక్షలు విధించినప్పటికీ, ఆ తర్వాత ఇందిరా గాంధీ పరిస్థితిని గుర్తించి ప్రజాస్వామ్య మార్గంలోనే ముందుకెళ్లారని చెప్పారు. ఎమర్జెన్సీ ముగిసిన తర్వాతే, ఆ సమయంలో జరిగిన పరిణామాల తీవ్రత తనకు పూర్తిగా అర్థమైందని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడంతో పాటు హెబియస్ కార్పస్ హక్కును కూడా నిలిపివేశారని గుర్తుచేశారు. అయితే అప్పటి చర్యలన్నీ రాజ్యాంగబద్ధంగానే జరిగాయని ఆమె వ్యాఖ్యానించారు.ఆ కాలం నాటి పరిస్థితులను ఇందిరా గాంధీ కోణంలో పరిశీలిస్తే, ఆమె ఎదుర్కొన్న సవాళ్లు అర్థమవుతాయని సోనియా అన్నారు. హింసాత్మక నిరసనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థలకు నిప్పు పెట్టడం, విస్తృత స్థాయిలో అశాంతి నెలకొనడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని వివరించారు. అంతేకాకుండా అధికార యంత్రాంగం, సాయుధ దళాలు ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించాలనే పిలుపులు కూడా వచ్చాయని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ విధించినప్పటికీ, ఆ తర్వాత ఇందిరా గాంధీ ప్రజాస్వామ్య ప్రక్రియకు తిరిగి వచ్చారని సోనియా గుర్తుచేశారు. పరిస్థితులను స్వయంగా సమీక్షించి 1977 మార్చిలో సార్వత్రిక ఎన్నికలకు పిలుపునిచ్చారని చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన అరాచకాలు, దురాగతాలపై అనంతరం బహిరంగంగా విచారం వ్యక్తం చేసి క్షమాపణలు చెప్పారని తెలిపారు. గతంలో జరిగిన పరిణామాలను, ఆ తర్వాతే సరైన దృక్పథంతో విశ్లేషించగలమని సోనియా అభిప్రాయపడ్డారు. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన తప్పులను గుర్తించి ఎన్నికలకు వెళ్లిన విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటలు వేయండి



నీటిని పొదుపుగా వాడుకోవాలి

హయాంలోనే కట్టారని, అప్పు డే కుప్పకూలిందని విమర్శలు చేశారు. కొడంగ ల్ నియోజకవర్గం హకీంపేటలో సీఎం పర్య టించారు. హకీంపేటలో అగ్రి ఎక్స్‌పో స్టాళ్లను పరిశీలించారు. రైతుమేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను సీఎం ప్రారంభించారు. బహిరంగ సభలో మట్లాడుతూ గత ప్రభుత్వంపై నిప్పులు కురిపించారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఎల్‌నినో విషయంలోనూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దానివల్ల ప్రపంచవ్యా ప్తంగా కరవు వస్తే తెలంగాణలోనే వచ్చినట్లు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పక్క నుండి కట్టించానని హరీశ్‌రావు గొప్పగా చెప్పుకున్నారని, తన పేరు హరీశ్‌రావు కాదని, కాళేశ్వరరావు అని నాటి గవర్నర్‌తో భజన చేయించుకున్నారని ఎద్దేవా చేశారు. తామే కట్టామని గొప్పలు చెప్పుకున్న వాళ్లు ఇప్పుడు మేడిగడ్డ కూలిపోతే ఎందుకు బాధ్యత వహించట్లేదని నిలదీశారు.

తాండూరు కందిపప్పుకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

లగచర్ల విషయంలోనూ అబద్ధాలు చెప్పి రైతులను భయపెట్టారని సీఎం ఆరోపించారు. దిల్లీ- నొయిడా తరహాలో హైదరాబాద్- లగచర్ల అభివృద్ధి చెందుతుందని, లగచర్లలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్దపెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఉన్నత విద్యా సంస్థలన్నీ ఒకేచోట ఉండేలా హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. తాండూరు కందిపప్పు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని కొనియాడారు. ఇప్పుడు తాండూరు కందిపప్పు చాలా దేశాలకు ఎగుమతి అవుతోందని ఆనందం వ్యక్తం చేశారు.

రాబోయే రోజుల్లో ఎండలు మరింత తీవ్రం అవుతాయని, యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేయాలని, విపక్ష నేతల తప్పుడు మాటలు నమ్మి మోసపోవద్దని రైతులకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జులై వరకు వర్షాలు వచ్చే అవకాశాలు లేవని ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అందరం కలిసికట్టుగా ఉండి ఎల్‌నినోను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. తమను గెలిపించలేదని ప్రజలపై కేసీఆర్ కుటుంబం పగబట్టిందని, ఓటు వేయలేదనే కక్షతో అబద్ధాలు చెప్పి ఆగం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు.“ ఈ నెల 9న కొడంగల్‌లో రూ.10 వేల కోట్ల పనులను ప్రారంభించనున్నాం. వేషాలు మార్చినంత మాత్రాన కేటీఆర్ ఎప్పుడూ రేవంత్‌రెడ్డి కాలేరు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ క్షమించరాని తప్పులు కేసీఆర్ కుటుంబం చేసింది. ఇసుక వ్యాపారానికి అడ్డువస్తున్నారని నేరెళ్ల దళితులను వేధించింది ఎవరూ మర్చిపోలేదు. గిట్టుబాటు ధర అడిగినందుకు ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన విషయాన్ని మర్చిపోలేదు” అని అన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు కమిషన్ల కోసం కక్కుర్తి పడటం వల్లే కరవు కాలంలో కాళేశ్వరం నుంచి చుక్కనీరు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద నీళ్లు లిఫ్ట్ చేయకుండా.. ఏపీకి నీళ్లు వదులుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎల్‌నినో నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. తొందరపడి వరి, చెరకు లాంటి పంటలు వేసుకోవద్దని కోరారు. కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను సీఎం ప్రారంభించారు. వర్చువల్‌గా కొడంగల్ ఇండస్ట్రియల్ హబ్, నెట్‌వర్క్ ఆఫ్ అపారెల్ రెడీనెస్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌ను సీఎం ప్రారంభించారు. దిల్లీ-నొయిడా తరహాలో లగచర్లను అభివృద్ధి చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

పాలమూరు జిల్లాను పట్టించుకున్నవాళ్లే లేరు

మేడిగడ్డ వద్ద వాళ్లను పాతిపెట్టడమే వాళ్లకు సరైన శిక్ష అని సీఎం నిప్పులు చెరిగారు. మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు నిల్వ లేకపోతే కన్నెపల్లి పంపులు పనిచేయవని, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల్లోనూ నీళ్లు నిల్వ చేయలేని దుస్థితి అని పేర్కొన్నారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా నీళ్లు ఎత్తిపోసేది ఉంటే మరి అది ఎందుకు కట్టినట్లు? అని నిలదీశారు. పదేళ్లపాటు పాలమూరు జిల్లాను పట్టించుకున్నవాళ్లే లేరని వెల్లడించారు.

ఈ20 కాదది.. 420

11నమూనాల్లో 20శాతానికి పైగా ఇథనాల్ ఉన్నట్లు తేలిందని చెప్పారు. ఇంధన ట్యాంకులలో ఏమి నింపుతున్నారనే విషయాన్ని ఇప్పటికైనా తెలియజేయాలని ప్రధాని మోదీ (ఖఓ ఓనీటతి)ని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 20శాతం కంటే ఎక్కువ ఇథనాల్ కలుపుతున్న కంపెనీలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. ఇటువంటి విధానాల వల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత నిలదీశారు.

ఇథనాల్‌లో ముంచేస్తున్నారు

కర్ణాటకలో ఈ-20 పేరిట 30శాతం ఇథనాల్ కలిసిన ఇంధనాన్ని విక్రయిస్తున్నారని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ శుక్రవారం ఆరోపించారు. దీంతో ఈ విషయంపై రాజకీయ దుమారం రేగింది. అయితే పెట్రోల్‌లో ఇథనాల్ పరిమాణం ఎక్కువగా ఉందని కర్ణాటక ప్రభుత్వం వాదించడాన్ని కేంద్ర పెట్రోలియం సంస్థలు- ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా తోసిపుచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ పరీక్ష ప్రామాణికత సరికాదని తేల్చిచెప్పాయి. కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల సంస్థ నిబంధనల మేరకు ఇథనాల్ 19- 21శాతం మధ్య ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించాయి.

మరో 4 కార్పొరేషన్లలోనూ ఇందిరమ్మ టవర్స్

గ్రామాలకు వర్తించనుంది. ఎంపికైన లబ్ధిదారులకు ఉచితంగా స్థలాన్ని కేటాయించడంతో పాటు నిర్మాణానికి అయ్యే ఖర్చులో రూ.5 లక్షలను ప్రభుత్వం రాయితీపై అందిస్తుంది. మిగతా ఖర్చును లబ్ధిదారులే భరించాల్సి ఉంటుంది.

మొత్తం 30 వేలకు పైగా దరఖాస్తులు

వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలో రెండు పడకగదుల ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు 30 వేలకు పైగానే ఉంటారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎల్-2 కోసం వీరు వేచి చూస్తున్నారు.వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా 20 వేల మంది ఇందిరమ్మ ఎల్-2 లో ఉన్నారు. వీరిలో నిబంధనల ప్రకారం ఇంటింటి సర్వే చేపడితే 10 నుంచి 12 వేల మంది ఎంపికయ్యే అవకాశాలున్నాయి. దూపకుంటలో 2 వేలు, తిమ్మాపూర్‌లో 320, దేశాయిపేటలో 200, పైడిపల్లిలో 70 ఇళ్ల సిద్ధంగా ఉన్నాయి. గతేడాది నుంచి లబ్ధిదారులు వేచి చూస్తున్నారు.తూర్పులో ఇళ్ల కేటాయింపు తరచూ వాయిదా పడుతోంది. లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటి సర్వే కూడా పూర్తైంది.

వాయుసేన అద్భుత రికార్డు

వాస్తవ నియంత్రణ రేఖకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న న్యోమా వ్యూహాత్మక వైమానిక స్థావరం.. గత ఏడాది నవంబర్‌లో అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లనూ ల్యాండ్ చేయొచ్చు. లద్దాఖ్‌లో ఈ తరహా నాలుగో వైమానిక స్థావరం ఇది. మిగతా మూడు లేహ్, కార్గిల్, థోయిస్‌లలో ఉన్నాయి. సైనిక అవసరాలకు అనుగుణంగా ఎల్‌ఏసీ వెంబడి అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్స్ సహా దాదాపు అన్ని ఎయిర్‌ఫీల్డ్‌లలో రక్షణశాఖ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎయిర్‌ఫీల్డ్‌గా పేరుపొందిన దౌలత్ బేగ్ ఓల్డీ ఏఎల్‌జీ లో కూడా సౌకర్యాలను మెరుగు పరుస్తున్నారు.

ధైర్యముంటే నాపైకి బుల్డోజర్లు పంపండి

భాజపాకు మమత సవాల్

కోల్‌కతా(జనంసాక్షి):తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఇంటిపై భాజపా కార్యకర్తలు దాడి చేయడాన్ని బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. తమకు ఎదురు తిరిగిన వారిపైకి బుల్డోజర్లు పంపడం భాజపాకు అలవాటని దుయ్యబట్టారు. వారి దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉంటే అన్నీ తనపైకి పంపాలని సవాల్ చేశారు. ‘మీా దగ్గర ఎన్ని బుల్డోజర్లు ఉన్నాయి? రండి, నేను మీా ముందే నిల్చొని ఉన్నాను. నాపై బుల్డోజర్లను నడపండి. మీారెంత ధైర్యవంతులో చూడాలనుకుంటున్నాను’ అని భాజపాపై విమర్శలు గుప్పించారు. అభిషేక్‌ను ఆయన నివాసంలో పరామర్శించిన అనంతరం మమత ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా.. తృణమూల్ నేతలపై దాడులు చేయడమే కాకుండా కాళీఘాట్ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జరుగుతోన్న కాళీ పూజలకు అంతరాయం కలిగిస్తోందని మమత ఆరోపించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు దరఖాస్తుల వెల్లువ

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజరవర్గాల్లో ఓటు నమోదు కోసం మొత్తం 12,69,761 దరఖాస్తులు వచ్చాయి. 2021 ఎన్నికలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల్లో వచ్చిన దరఖాస్తులతో పోలిస్తే ఈసారి సంఖ్య పెరిగింది. గ్రాడ్యుయేట్ ఓటర్ల దరఖాస్తుల గడువు నిన్నటితో ముగిసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో 5,99,394 దరఖాస్తులు రాగా వరంగల్-ఖమ్మం-నల్గొండలో 6,70,367 ఫామ్ 18లు అందాయి.గత గ్రాడ్యుయేట్ ఎన్నికలప్పుడు మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో 5,76,462 దరఖాస్తులు రాగా వరంగల్-ఖమ్మం-నల్గొండలో 5,63,282 అప్లికేషన్లు వచ్చాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గంలో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 1,51,596 దరఖాస్తులు రాగా అతితక్కువగా నారాయణ పేట జిల్లాలో 20,087 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.ఇక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 1,41,808, హైదరాబాద్‌లో 1,04,349, వికారాబాద్ జిల్లాలో 40,147, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 45,611, నాగర్‌కర్నూలులో 43,667, వనపర్తి జిల్లాలో 29,155, జోగులాంబ గద్వాల జిల్లా నుంచి 22,974 పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేశారు.

సిద్దిపేట జిల్లాలో అత్యల్ప దరఖాస్తులు

వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గంలో అత్యధికంగా నల్గొండ జిల్లాలో 1,14,525 దరఖాస్తులు రాగా సిద్దిపేట జిల్లా నుంచి కేవలం 7,329 అప్లికేషన్లు మాత్రమే అందాయి. సూర్యాపేట జిల్లాలో 73,990, యాదాద్రి భువనగిరిలో 49,789, జనగామ జిల్లాలో 35,418, మహబూబాబాద్‌లో 53,718, వరంగల్ జిల్లాలో 66,957, హనుమకొండలో 68,056, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 17,907, ములుగు జిల్లాలో 15,337, భద్రాద్రి కొత్తగూడెంలో 57,370 దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రాలో 90 జడ్పీటీసీ, ఎంపీటీసీలు కూటమి కైవసం

మొత్తం 659 జడ్పీటీసీ స్థానాల్లో 170కిపైగా స్థానాల్లో.. మొత్తం 9,821 ఎంపీటీసీ స్థానాల్లో రెండు వేలకుపైగా చోట్ల కూటమి హవా కొనసాగుతోంది. గుంటూరు జిల్లా జడవల్లి ఎంపీటీసీ స్థానంలో తెదేపా అభ్యర్థి విజయం సాధించారు. 74 ఓట్ల తేడాతో గెలుపొందారు. మన్యం జిల్లా సాలూరు మండలం గంజాయిభద్ర ఎంపీటీసీ స్థానంలో తెదేపా అభ్యర్థి చిరంజీవి విజయం సాధించారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం హాఫ్‌పేట ఎంపీటీసీ స్థానాన్ని తెదేపా దక్కించుకుంది. కడప జిల్లా పెద్దముడియం మండలం సుద్దపల్లె ఎంపీటీసీ స్థానంలో తెదేపా గెలుపొందింది. కడప జిల్లా పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని తెదేపా కైవసం చేసుకుంది. ఇక్కడ తెదేపా అభ్యర్థి భారతి 1463 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

వరి ధాన్యం నిల్వకు రాష్ట్రవ్యాప్తంగా ఆధునిక సైలోలు

ర్లతో ఆరబెట్టి, సురక్షిత నిల్వకు అనువైన స్థాయికి తేమను తగ్గిస్తారు.ఆరబెట్టిన ధాన్యా న్ని యాంత్రిక పరికరాల సాయంతో నేరుగా ఉక్కు సైలోల్లోకి తరలించి నిల్వ చేస్తారు. ఈ పద్ధతిలో గోనె సంచుల వినియోగం తగ్గుతుంది. నిల్వ సమయంలో ధాన్యం నా ణ్యతను పరీక్షించేందుకు, పురుగుల బెడద ను నియంత్రించేందుకు అవసరమైన ఏర్పా ట్లనూ ప్రతిపాదించారు.సైలోల ఏర్పాటుకు రెండు నమూనాలుమొదటి నమూనాలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థల నుంచి రుణాలు సమీకరించి నేరుగా సైలోలను ఏర్పాటు చేయనుంది. రెండో నమూనాలో తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించనున్న సుమారు 20 ప్రదేశాల్లో ప్రైవేటు పారిశ్రామికవేత్తలు సైలోలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తారు. పెట్టుబడులు ఆర్థికంగా ఆచరణీయమయ్యేందుకు పౌర సరఫరాల సంస్థ నిర్ణీత కాలానికి అద్దె చెల్లింపుల హామీ ఇచ్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు.సైలోల నిర్మాణ, నిర్వహణ వ్యయాలు, నిధుల సమీకరణ, అద్దె చెల్లింపు బాధ్యతలను అంచనా వేయాలని మంత్రి అధికారులను కోరారు. తక్కువ వడ్డీకి ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అనువైన ప్రదేశాలను గుర్తించి, ఆర్థిక, సాంకేతిక నిపుణులతో సంప్రదించి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేయాలన్నారు.మార్కెట్ ధర అనుకూలించినప్పుడు అమ్ముకునే వీలుతాజాగా కోసిన వరి ధాన్యంలో సాధారణంగా సుమారు 25 శాతం తేమ ఉంటుందని మంత్రి వివరించారు. ఆరబెట్టి, భద్రంగా నిల్వ చేసే సదుపాయాలు లేక చాలామంది రైతులు అప్పటి మార్కెట్ ధరకే, కొన్నిసార్లు కోత ముగిసిన 24 గంటల్లోనే, ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. సైలో కేంద్రాల్లో శాస్త్రీయంగా ఆరబెట్టి నిల్వ చేసే వీలు కలిగితే రైతులు ధర అనుకూలించినప్పుడు ధాన్యాన్ని అమ్ముకోగలుగుతారని చెప్పారు.ప్రీమియం వరి రకాల ధాన్యంలో తేమ సుమారు 25 శాతం ఉన్నప్పుడు క్వింటాలుకు రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. అదే ధాన్యాన్ని శాస్త్రీయంగా ఆరబెట్టి తేమను సుమారు 12 శాతానికి తగ్గిస్తే క్వింటాలుకు రూ.5,000 నుంచి రూ.5,500 వరకు ధర పలికే అవకాశం ఉందని వివరించారు.జేఎస్ఆర్, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ వంటి తెలంగాణ వరి రకాలకు దేశీయ, విదేశీ మార్కెట్లలో ఆదరణ పెరుగుతోందని, కొన్ని మార్కెట్లలో జేఎస్ఆర్ బియ్యం బాస్మతి కంటే అధిక ధర పలుకుతోందని మంత్రి పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ రాష్ట్రంలో ప్రధాన పంట అయిన వరికి మెరుగైన నిల్వ సదుపాయాలు కల్పించడం వ్యవసాయ రంగ వృద్ధికి, రాష్ట్ర జీడీపీ పెరుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న తెలంగాణ లక్ష్యానికీ ఇది తోడ్పడుతుందన్నారు.సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరిస్తాం

కల్పించినప్పటికీ, ఆచరణలో వారికి ఇళ్లు అందలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లు మంజూరు చేయడంతో పాటు హైదరాబాద్ నగరానికి లక్ష ఇళ్లు కేటాయించినట్లు వివరించారు. మొత్తం 8 లక్షల ఇళ్ల నిర్మాణానికి సుమారు రూ.40 వేల కోట్లు వెచ్చించనున్నట్లు మంత్రి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఆర్థిక సహాయాన్ని ఎలాంటి అవినీతి, లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు ‘ఈ దీపావళి మా దీపావళి’ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజులపాటు గృహప్రవేశాలు, నూతన గృహాల ఫొటోల అప్‌లోడ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 2,25,100 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు.మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇప్పటివరకు సుమారు రూ.73 వేల కోట్ల రుణాలను సున్నా వడ్డీపై అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన మంచి సంక్షేమ పథకాలైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా కొనసాగిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ప్రతి భూమి పార్సిల్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని, రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని మొత్తం 10,456 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సర్వే అనంతరం ప్రతి భూమికి క్యూఆర్ కోడ్‌తో కూడిన మ్యాప్, భూధార్ నంబర్‌తో పాస్‌బుక్ అందజేస్తామని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.షాద్‌నగర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో వెంకిరాల గ్రామంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన వారికి పట్టాదారు పాస్‌బుక్కులు అందించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్తూరు మండలం సిద్దాపురం ప్రాంతంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. ప్రజల అభిప్రాయాలను, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని సిద్దాపురంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోదని, ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని పేర్కొన్నారు.షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. నియోజకవర్గం లోని సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల మంజూరు విషయంలో ఎమ్మెల్యే పట్టుదలతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆయన విజ్ఞప్తి మేరకు చౌదరిగూడ ప్రాంత ప్రజల సౌకర్యార్థం మండలంలో తహసీల్దార్ కార్యాలయం, షాద్నగర్లో ఆర్డీఓ కార్యాలయాల ఏర్పాటుకు ఈ సందర్భంగా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.ప్రజల అవసరాలు, సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రతి నిర్ణయం తీసుకుంటుందని, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్రమంగా మెరుగుపరుస్తూ, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓ సరిత, పీడీ హౌసింగ్ చంప్లా నాయక్, పిడి డిఆర్డిఏ శ్రీలత, ఇతర జిల్లా, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి,మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి విశాల,మాజీ ఎంపీపీలు ప్రియాంక శివశంకర్ గౌడ్,స్థానిక సర్పంచ్ కొమ్ము కృష్ణ,మండల పార్టీ అధ్యక్షులు కుమార్ పిఏసిఎస్ చైర్మన్లు ప్రభాకర్ చంద్రపాల్ రెడ్డి బుచ్చయ్య, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

క్షిపణుల పరిధిపై పరిమితి ఎత్తేశాం

ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.క్షిపణుల పరిధికి సంబంధించిన పరిమితులు తొలగిపోయాయని, ఈ సామర్థ్యాలను తాము ఆచరణలో ప్రదర్శిస్తామని జనరల్ హ్వస్సేన్ మొహెబ్బి మీడియా సమావేశంలో వెల్లడించారు. 2,000 కిలోమీటర్లకుపైగా దూరం వెళ్లగల బాలిస్టిక్ క్షిపణులు ఇరాన్ వద్ద ఉన్నట్లు అధికారిక సమాచారమేమీ లేదు. ఈ రెండు వేల కిలోమీటర్ల పరిధి కింద మొత్తం అరేబియా ద్వీపకల్పంతోపాటు ఈజిప్టులోని చాలావరకు భూభాగం, గ్రీస్, బాల్కన్‌లోని కొన్ని ప్రాంతాలు వస్తాయి. అయితే.. ఇరాన్ తన అంతరిక్ష కార్యక్రమానికి సంబంధించిన సాంకేతికతను ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల రూపకల్పనకు ఉపయోగించుకునే అవకాశాలు లేకపోలేవని అమెరికా చెబుతోంది.

యెమెన్‌లో 22 మంది మృతి..

యెమెన్ రాజధాని సనా సమీపంలోని అల్-షరియా ప్రాంతంలో జరిగిన వైమానిక దాడిలో 22 మంది మృతి చెందారని హూతీ తిరుగుబాటుదారుల ఆధ్వర్యంలోని ఆరోగ్యశాఖ ప్రకటించింది. మరో 30 మంది గాయపడ్డారని తెలిపింది. వారిలో చాలావరకు మహిళలు, చిన్నారులే ఉన్నారని పేర్కొంది. సౌదీ అరేబియానే ఈ దాడులకు పాల్పడిందని ఆరోపించింది. దక్షిణ యెమెన్‌లోని ఓ మార్కెట్‌పై జరిగిన దాడుల్లో 30 మంది ప్రాణాలు కోల్పోయారని హూతీలు ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ దాడులు జరిగాయి.

‘సర్’ను రద్దు చేయండి

తమ పోరాటం ఆగదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మరోసారి స్పష్టం చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా కొచ్చిలో తలపెట్టనున్న ‘జంతర్ మంతర్ ఎట్ కొచ్చి’ నిరసనలో పాల్గొనడానికి శనివారం ఆయన కేరళకు చేరుకున్నారు. నిరసనలో పాల్గొనాల్సిందిగా స్థానిక నిర్వాహకులతో పాటు ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ తనను ఆహ్వానించారని చెప్పారు. వారి పిలుపు మేరకే తాను కొచ్చికి వచ్చినట్లు దీప్కే స్పష్టం చేశారు. విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.“ఇది ప్రజల నిరసన, నిర్వాహకులు, ప్రకాశ్ రాజ్ ఆహ్వానం మేరకు నేను ఇక్కడికి వచ్చాను. ముందుగానే చెప్పినట్లుగా భారతదేశంలో స్వతంత్ర, నిష్పక్షపాత ఎన్నికల వ్యవస్థ ఏర్పడే వరకు జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుంది. వీరు తలపెట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా సుమారు 13 కోట్లకు పైగా ఓటర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించారు. ఓటర్లను తొలగించని రాష్ట్రం ఒక్కటి కూడా లేదు” అని అన్నారు.

ప్రతి విషయాన్ని విచారించే అధికారం ఈడీకి లేదు

బెంగుళూరు(జనంసాక్షి):కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారాలపై కర్ణాటక హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తన దృష్టికి వచ్చిన ప్రతీ విషయాన్ని విచారించే అధికారం ఆ సంస్థకు లేదని పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు చేపట్టడానికి చట్టబద్ధమైన నిబంధనలను దాటవేసే అధికారం దానికి లేదని స్పష్టం చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద.. ఈడీకి ఉన్న అధికారాల పరిధిలో లేని నేరాలపై ఆ చట్టం కింద విచారణ చేపట్టవద్దని ఆదేశించింది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజగౌడ, ఆయనతో సంబంధం ఉన్న ఇతరులతో సహా పలువురు పిటిషనర్లపై దర్యాప్తు సంస్థ చేపట్టిన విచారణలను జస్టిస్ ఎంఐ అరుణ్ కొట్టేశారు. ఆస్తుల జప్తును ధ్రువీకరిస్తూ పీఎంఎల్ఏ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వును హైకోర్టు కొట్టివేసింది. అలాగే, పిటిషనర్లలో ఒకరి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. కోలారు, చిక్కబళ్లాపుర జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల యూనియన్ లిమిటెడ్ (కోముల్)లోని ఉద్యోగుల నియామకాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఇటీవల ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే దర్యాప్తును సవాల్ చేస్తూ..నమోదైన పిటిషన్‌లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

క్రమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది:రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటం వల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు. ‘ఆపరేషన్ సిందూర్’తో మన వాయుసేన శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు.‘ సైనికులలో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా అది నిష్ప్రయోజనమే. మన సాయుధ దళాలు క్రమశిక్షణకు మారుపేరు. అదే ఒక సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా మారుస్తుంది. అదే సమయంలో డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో సాయుధ దళాలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి మన సైనికులు డ్రోన్లను ప్రయోగించడం, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త యుద్ధ పద్ధతులను నేర్చుకుంటున్నారు.



మత ప్రచారం చేస్తున్నారని ఆరోపణతో
యువతులపై దాడిని ఖండిద్దాం

- చైతన్య మహిళా సంఘం

గద్వాల నడిగడ్డ, నవంబర్ 7 (జనం సాక్షి) : రంగారెడ్డి జిల్లా అల్వాస్ గూడ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో లక్ష్మీనారాయణ, శశి వర్ధన్ ఇద్దరు యువతులపై దాడి చేసిన ఘటన అత్యంత అమానుషం అని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ బన్నూరు జ్యోతి, కో కన్వీనర్ శ్రీదేవి తెలిపారు. మతమార్పిడి చేస్తున్నారంటూ యువతుల ను ఇద్దరినీ కొట్టి వారిని బూతులు తిట్టి భయభ్రాంతులకు గురి చేశారు.ఆ యువతులు ఇద్దరూ తమ అత్తను కలిసేందుకు అక్కడికి వచ్చామని చెప్పినా వినకుండా దాడికి పాల్పడ్డారనీ,భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి వ్యక్తికి తమ మనస్ఫూర్తిగా స్వేచ్ఛతో తనకు నచ్చిన మతాన్ని స్వీకరించే ఆచరించే మరియు ప్రచారం చేసే హక్కు ఉందనీ, మత స్వాతంత్రపు హక్కును ఉల్లంఘిస్తూ మహిళలపై దాడులు చేయడం రాజ్యాంగ హక్కులకు విరుద్ధం. ఇలాంటి దాడులకు పాల్పడడం అంటే రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే అని,అసలు అక్కడ మతమార్పిడి ఆరోపణల పై ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదనీ, యువతులపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠినమైన చర్యలు తీసుకోవాలని చైతన్య మహిళా సంఘం డిమాండ్ చేస్తుందనీ, సురక్షితమైన సమాజాన్ని ప్రభుత్వాలు అందించ లేనప్పుడు అది ఎంత అభివృద్ధి చెందిన దేశమైనా వృధా అని ,మనువాద భావజాలంతో ఆడపిల్లలను చంపటం అత్యాచారాలు చేయడం బహిరంగంగా వారిని కొట్టడం అత్యంత దుర్మార్గం మహిళల భద్రత కాపాడటంతో పాటు మతసామరస్యాన్ని దెబ్బ తీసే ఘటనలు అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల కమిటీ సభ్యులు బి .రేవతి ,జయమ్మ, రాణి, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో సీతక్క దీపావళి పండుగ

- పేదల ఇంట్లో వెలుగులు.. ఏజెన్సీ అభివృద్ధికి ఊతం...
- ఇందిరమ్మ ఇండ్లు,నూతన రహదారులు మంజూరు...



కొత్తగూడ, నవంబర్ 7 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, గంగారం మండలాల్లో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పర్యటన అట్టహాసంగా సాగింది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగిన ఈ పర్యటనలో స్థానిక లబ్ధిదారులతో కలసి పండుగలు జరుపుకోవడంతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, ఆరోగ్య పరిరక్షణకు మంత్రి కీలక ప్రకటనలు చేశారు. ఇందిరమ్మ ఇంట్లో దివ్వెల కాంతులు స్థానిక సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని, కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇంట్లో లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకలను అత్యంత వేడుకగా జరుపుకున్నారు.పేదల ఇళ్లలో నిరంతరం వెలుగులు నింపడమే తమ ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. గిరిజన ప్రాంతాల (ఏజెన్సీ) సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు నూతన రహదారుల నిర్మాణాన్ని, అలాగే అర్హులైన పేదల కోసం నూతనంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని, రక్తహీనతను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంపై అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలు, గుడ్లు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని సూచించారు. రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో నీటి పొదుపును దృష్టిలో ఉంచుకుని రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు చిరుధాన్యాలు సాగు చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు అవసరమైన చిరుధాన్యాల విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

అధికారులకు ఘన సన్మానం

అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను మంత్రి స్వయంగా పంపిణీ చేశారు. గంగారం మండలంలో ప్రజా సేవలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు.

రామప్ప పరిరక్షణకు ఎన్‌జీటీ ముందడుగు

- ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులపై సుమోటో
- ఎన్‌జీటీకి కృతజ్ఞతలు తెలిపిన రామప్ప పరిరక్షణ కమిటీ
- చారిత్రక సంపదను కాపాడుకుందాం
- రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ రామ్మోహన్ రావు





వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 07(జనం సాక్షి): ప్రపంచ వారసత్వ సంపద గల రామప్ప దేవాలయంతోపాటు రామప్ప చెరువుకు సమీపంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల తవ్వకాలపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) సుమోటోగా విచారణకు స్వీకరించడాన్ని రామప్ప పరిరక్షణ కమిటీ హర్షం వ్యక్తం చేయడంతో పాటు కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా రామప్ప పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి రామ్మోహన్ రావు శనివారం మీడియా మాట్లాడారు. ఎన్‌జీటీకి కమిటీ తరఫున, ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రామప్పను కాపాడేందుకు న్యాయస్థానం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రక సంపద పరిరక్షణకు పెద్ద ముందడుగు అని అభివర్ణించారు. 800 ఏళ్ల నాటి కాకతీయ శిల్పకళా వైభవానికి ప్రతీక అయిన రామప్ప ఆలయం ఇసుక పునాది (శాండ్‌బాక్స్) సాంకేతికతతో నిర్మితమైందని, గనుల తవ్వకాల్లో జరిపే భారీ బ్లాస్టింగ్‌ల వల్ల వచ్చే ప్రకంపనలకు ఈ అపురూప కట్టడం తీవ్రంగా దెబ్బతింటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు, ఈ ప్రాంత జీవనాడి అయిన 3 టీఎంసీల చారిత్రక రామప్ప చెరువుకు కూడా ముప్పు పొంచి ఉందన్నారు. గనుల తవ్వకాల వల్ల భూగర్భ జలాలు, పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్‌జీటీ జోక్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా యంత్రాంగం మేల్కొని రామప్ప చుట్టూ ఉన్న ప్రాంతాన్ని పర్యావరణ రక్షిత బఫర్ జోన్‌గా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రామప్ప ఆలయం కేవలం ఒక కట్టడం కాదు, మన జాతి ఆత్మగౌరవం. భవిష్యత్ తరాల కోసం దీనిని కాపాడుకోవడానికి ప్రజలు, పర్యావరణ ప్రేమికులు, మేధావులు అందరూ ఐక్యంగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. రామప్పను కాపాడుకోవడం కేవలం పాలంపేట, వెంకటాపూర్ మండల ప్రజల బాధ్యత మాత్రమే కాదు, యావత్ తెలంగాణ ప్రజల బాధ్యత అని రామప్ప పరిరక్షణ కమిటీ తరుపున ఆయన స్పష్టం చేశారు.



రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో మేడ్చల్ విద్యార్థినికి కాంస్య పతకం

మేడ్చల్ (జనంసాక్షి) : ఖమ్మంలో నవంబర్ 3 నుంచి 5 వరకు నిర్వహించిన 70వ ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్ జిల్లాకు చెందిన విద్యార్థిని సత్తా చాటింది. అండర్-17 బాలికల హామర్ త్రో విభాగంలో 17.30 మీటర్ల దూరం విసిరి కాంస్య పతకాన్ని సాధించింది. ఈ పోటీల్లో మేడ్చల్ జిల్లాకు లభించిన తొలి పతకం కావడం విశేషం. ఎన్ఐఎస్ కోచ్ ఓ. రాజ్‌కుమార్ పర్యవేక్షణలో కఠిన శిక్షణ పొందిన క్రీడాకారిణి ఈ ఘనత సాధించింది. ఆమెను కోచ్, తల్లిదండ్రులు గోపాల్, హేమలతో పాటు పలువురు క్రీడా ప్రముఖులు అభినందించారు.

అండాల అక్రమ సేకరణపై ఆసుపత్రుల నిర్లక్ష్యం

- ప్రధాన సూత్రధారులపై కేసులేవీ?
- విచారణలో జాప్యంపై మహిళా కమిషన్ ఆగ్రహం



హైదరాబాద్, నవంబర్ 7 (జనంసాక్షి) : నిరుపేద మహిళల నుంచి అక్రమంగా అండాలు సేకరిస్తున్న వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆసుపత్రులు, ఐవీఎఫ్ కేంద్రాలు, ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుండటంపై మహిళా కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కేవలం కొంతమంది ఏజెంట్లపైనే కేసులు నమోదు చేసి, ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆసుపత్రులు, ల్యాబ్‌లను వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద బాధిత మహిళలను పరామర్శించిన సందర్భంగా ఇందిరా ఐవీఎఫ్, నర్మద ఫెర్టిలిటీ, ఓయాసిస్ ఫెర్టిలిటీ, సద్గురు ఏఆర్‌టీ, పద్మజ ఫెర్టిలిటీ కేంద్రాలతో పాటు డాక్టర్ హుస్సేన్ పేరును బాధితులు ప్రస్తావించి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ డాక్టర్ హుస్సేన్ ఆచూకీ కనిపెట్టకపోవడం, కనీసం కేసు కూడా నమోదు చేయకపోవడంపై కమిషన్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆసుపత్రులు, ఐవీఎఫ్ కేంద్రాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులను గతంలోనే ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు విచారణ ప్రారంభించకపోవడాన్ని తప్పుబట్టింది.

మహిళల శారీరక స్వేచ్ఛ, గౌరవం, ఆరోగ్యానికి భంగం కలిగించే అక్రమాలకు పాల్పడినవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కేసుల నమోదులో జాప్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మహిళా కమిషన్ హెచ్చరించింది.

నిఖార్సైన జర్నలిస్టుగా రఘు సేవలు చిరస్మరణీయం

- సంస్మరణ సభలో సీనియర్ జర్నలిస్టుల నివాళి





హైదరాబాద్, నవంబర్ 7 (జనంసాక్షి) : అనారోగ్యంతో ఇటీవల కన్నుమూసిన సీనియర్ జర్నలిస్టు, జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జేహెచ్ఎస్) సభ్యుడు అవ్వారి రఘుకు పలువురు సీనియర్ జర్నలిస్టులు ఘనంగా నివాళులర్పించారు. అందరితో ఆత్మీయంగా మెలిగిన వ్యక్తిగా, విలువలతో కూడిన జర్నలిజానికి జీవితాంతం కట్టుబడిన నిఖార్సైన జర్నలిస్టుగా రఘు సేవలను కొనియాడారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్, ఉదయం ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రఘు సంస్మరణ సభలో పలువురు జర్నలిస్టులు పాల్గొని ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మీడియా సంస్థల్లో ఇమడలేక సొంతంగా ఆర్ఎన్ఏ వార్తా సంస్థను ప్రారంభించి, పలు పత్రికలకు వార్తల రూపంలో అండగా నిలిచారని పేర్కొన్నారు. జీవితాంతం జర్నలిజం కోసం పనిచేసిన రఘుకు జర్నలిస్టు సంఘాలు అండగా నిలవకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రఘు కుటుంబానికి అండగా నిలిచిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, సీనియర్ జర్నలిస్టులు మాడభూషి శ్రీధర్, పాశం యాదగిరి, హేమసుందర్, సైదారెడ్డి, బాల భాస్కర్, జేఎన్‌జేహెచ్ఎస్ డైరెక్టర్లు రమణారావు, అశోక్ రెడ్డి, ట్యాంక్‌బండ్ రాములు, కే.ఎన్. భాస్కర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బట్టిపాటి రాజశేఖర్, మహిళా జర్నలిస్టులు అరుణ, యశోద, ఉమతో పాటు రఘు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బతికున్న వారికి మరణ ధృవీకరణ పత్రాలు

- పంచాయతీ కార్యదర్శి నిర్వాకం

చేర్యాల, నవంబర్ 07 (జనంసాక్షి) : చేర్యాల ఎంపీఓ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి భూక్య మధు తన వద్ద ఉండాల్సిన ఈ-సైన్ డాంగిల్ కీని అదే గ్రామానికి చెందిన శెవల్ల రమేష్ అనే ప్రైవేట్ వ్యక్తికి ఇచ్చాడు. రమేష్ హైదరాబాద్ లో ఇంటర్నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆ డాంగిల్ కీని ఉపయోగించి బతికున్న వ్యక్తుల పేరిట మరణ ధృవీకరణ పత్రాలను జారీ చేశాడు.ఫిబ్రవరి 2026 నుండి సెప్టెంబర్ 2026 మధ్య కాలంలో మొత్తం 22 నకిలీ మరణ ధృవీకరణ పత్రాలను జారీ చేసినట్లు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీఓ ఇచ్చిన ఫిర్యాదుతో పంచాయతీ కార్యదర్శి భూక్యా మధు, ప్రైవేట్ వ్యక్తి శెవల్ల రమేష్ పై కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవో 14ను వెంటనే రద్దు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల వ్యతిరేకి
- 10 ఏళ్ల బిఆర్ఎస్ కాలంలో బీసీలకు న్యాయం జరిగింది
- కెసిఆర్ బీసీల పక్షపాతి
- మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో బీసీలు అన్ని రంగాలలో అభివృద్ధి పొందాలని కేసీఆర్ నాడు బీసీల కొరకు ఆత్మగౌరవ భవనాలను మంజూరు చేస్తే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నదని దానిలో భాగంగా ఈరోజు జీవో 14 తెచ్చి బీసీలపై కర్ర పెత్తనం చేయాలని చూస్తున్నదని దీనిని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ఆయన అన్నారు కెసిఆర్ గారు పెద్ద మనసుతో నగరం నడిబొడ్డున వేలాది కోట్ల రూపాయలు విలువ చేసే భూములను కుల సంఘాలకు ఇచ్చి భవనాలు నిర్మించుకోవాలని కోట్ల రూపాయల కేటాయించారని ఇది జీర్ణించుకోలేని ఫ్యూడల్ కాంగ్రెస్ పెద్దలు బీసీలకు సంతోషం లేకుండా జీవో 14 ద్వారా హరిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఆత్మ గౌరవ భవనాలకు సంబంధించిన ట్రస్టులను రద్దుచేసి రాత్రికి రాత్రే 14 జీవో దేవడం అప్రజా స్వామికమని అన్నారు రాబోయే కాలంలో బీసీ సంఘాల కుల సంఘాల నాయకులు అందరితో సమీక్ష నిర్వహించి జీవో 14 రద్దు చేసే వరకు కెసిఆర్ మార్గ దర్శనంలో బిఆర్ఎస్ పోరాటం చేస్తుందని అన్నారు. దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్తామని గురుకుల పాఠశాల నిర్వీర్యం చేస్తున్న ఈ కాంగ్రెస్ సర్కార్ని పాతాళానికి రాజకీయంగా తొక్కి పెట్టడానికి తెలంగాణలో ఉన్న బీసీ ప్రజలందరూ కూడా ఏకం అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

కళాశాలలో టాయిలెట్స్ లేక విద్యార్థుల అవస్థలు



కొల్చారం, నవంబర్ 07 (జనం సాక్షి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాయిలెట్స్ సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత మూడు నెలలుగా మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి సుమారు అర కిలోమీటరు దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా కళాశాల విరామ సమయంలో బయటకు వెళ్లిన విద్యార్థులు తిరిగి తరగతులకు చేరుకోవడంలో ఆలస్యం అవుతుండటంతో చదువుపై ప్రభావం పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు చేపట్టినప్పటికీ మధ్యలోనే నిలిచిపోవడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయంపై ప్రిన్సిపాల్ నవీన్‌ను సంప్రదించగా, కళాశాల అభివృద్ధి పనుల కోసం ఇంటర్మీడియట్ బోర్డు నుంచి రూ.24 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో భాగంగా ఇనుప గ్రిల్స్, డోర్లు, విద్యుత్ బల్బుల పనులు పూర్తయ్యాయని, టాయిలెట్స్ మరమ్మతు పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్ చేపట్టారని వివరించారు. అయితే పనులు పూర్తికావడానికి మరికొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ కొంతమేర పనులు చేపట్టి మధ్యలోనే నిలిపివేయడంతో మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులోకి రావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

గొల్లబుద్ధారం హత్య కేసులో భార్య, ప్రియుడు అరెస్ట్

24 గంటల్లోనే కేసును ఛేదించిన భూపాలపల్లి పోలీసులు..

- అక్రమ సంబంధమే హత్యకు కారణమని డీఎస్పీ వెల్లడి..
- గొడ్డలితో దాడి.. ఊపిరాడకుండా చేసి హతమార్చిన వైనం..
- ఎడ్లబండిపై మృతదేహాన్ని తరలించిన నిందితులు..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారం గ్రామంలో సంచలనం సృష్టించిన అజ్మీర చందునాయక్ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ కేసులో మృతుడి భార్య పావని, ఆమె ప్రియుడు ధరావత్ సంతోష్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించి నిందితులను పట్టుకున్నట్లు డీఎస్పీ ఏ. సంపత్‌రావు వెల్లడించారు. శనివారం భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను ఆయన వివరించారు.

గొల్లబుద్ధారం గ్రామానికి చెందిన అజ్మీర చందునాయక్ (36) భార్య పావని, ఇద్దరు కుమారులతో కలిసి జీవిస్తున్నాడు. సుమారు ఆరు నెలల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో పావని తనకు మేనమామ వరుసయ్యే ధరావత్ సంతోష్‌తో వ్యక్తిగత విషయాలను పంచుకునేది. ఈ పరిచయం క్రమంగా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం తెలుసుకున్న చందునాయక్ భార్యను నిలదీయడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో చందునాయక్ చేతిలో దెబ్బలు తిన్న సంతోష్.. తన కారణంగా తాను దెబ్బలు తినాల్సి వస్తోందని పావనిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు డీఎస్పీ తెలిపారు. దీంతో చందునాయక్‌ను హతమార్చాలని ఇద్దరూ పథకం రచించినట్లు వెల్లడించారు. పథకం ప్రకారం గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో సంతోష్ గొడ్డలితో చందునాయక్ ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంటి ముందు గదిలో నిద్రిస్తున్న చందునాయక్‌ను చూసి పావనిని నిద్రలేపి హత్య చేయాలని చెప్పాడు. అనంతరం గొడ్డలితో చందునాయక్ తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి కిందపడిపోయాడు. అదే సమయంలో అక్కడే ఉన్న పావని గుడ్డతో అతడి ముక్కు, నోరు మూసి ఊపిరాడకుండా చేయడంతో చందునాయక్ మృతి చెందినట్లు డీఎస్పీ వివరించారు. హత్య అనంతరం ఆధారాలు బయటపడకుండా ఉండేందుకు నిందితులు ప్రయత్నించారు. సంతోష్ తన ఇంటికి వెళ్లి సంచులు తీసుకొచ్చి మృతదేహాన్ని వాటిలో ఉంచాడు. అనంతరం ఎడ్లబండిపై మృతదేహాన్ని తీసుకెళ్లి చికెనేపల్లి శివారు ప్రాంతంలో పడేశారు. తిరిగి ఇంటికి వచ్చి రక్తపు మరకలను శుభ్రం చేశారు. ఆ తర్వాత ఇద్దరూ మోటార్ సైకిల్‌పై అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. శుక్రవారం ఉదయం మృతుడి సోదరుడు రాజునాయక్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. భూపాలపల్లి సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగించారు. ఈ క్రమంలో భూపాలపల్లి పట్టణంలో మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న పావని, సంతోష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించినట్లు డీఎస్పీ వెల్లడించారు. దీంతో ఇద్దరినీ అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు చిన్నారులకు తీరని శోకం..

ఈ ఘటనలో అత్యంత విషాదకరమైన విషయం ఏమిటంటే.. చందునాయక్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధం చివరకు ఒక నిండు ప్రాణాన్ని బలిగొనడంతో పాటు ఇద్దరు చిన్నారులను తండ్రికి దూరం చేసింది. తండ్రి హత్యకు గురికావడం, తల్లి నిందితురాలిగా జైలుకు వెళ్లడంతో ఆ చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. 24 గంటల్లోనే హత్య కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన భూపాలపల్లి పోలీసులను డీఎస్పీ సంపత్‌రావు అభినందించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు పవన్, గీత తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అయోధ్య రాముడు ఏ ఒక్కరి సొత్తు కాదు!

అయోధ్య రామమందిరం రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు, ప్రభుత్వాలకు చెందిన ఆస్తి కాదు. అది కోట్లాది మంది హిందువుల విశ్వాసానికి ప్రతీక. రాముడు ఒక మతానికి ఆరాధ్య దైవం కావచ్చు. కానీ భారతీయ సంస్కృతిలో ఆయనకు ఉన్న స్థానం అంతకంటే విస్తృతమైనది. అలాంటి రాముడిని రాజకీయ వివాదాలకు, పార్టీల ఆధిపత్య పోరుకు పరిమితం చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

అయోధ్య రామమందిరాన్ని సందర్శించాలన్న అఖిలేష్ యాదవ్ ఆకాంక్షను రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం ఏముంది? ఆయన సమాజ్‌వాదీ పార్టీ అధినేత కావచ్చు. రాజకీయంగా బీజేపీకి ప్రత్యర్థి కావచ్చు. కానీ అందుకు ఆయనకు రాముడిని దర్శించుకునే హక్కు లేదని చెప్పగలమా? ఒక రాజకీయ నాయకుడి విశ్వాసాన్ని ఆయన పార్టీ సిద్ధాంతాలతో ముడిపెట్టి ప్రశ్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. రాముడిపై భక్తిని నిరూపించుకోవడానికి రాజకీయ పార్టీల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాల్సిన అవసరం ఎవరికీ లేదు.

రామమందిర నిర్మాణం వెనుక సుదీర్ఘ న్యాయపోరాటం, సామాజిక సంఘర్షణ, కోట్లాది మంది ప్రజల విశ్వాసం ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఆలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది. 2024 జనవరి 22న బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఈ పరిణామం ఒక చారిత్రక ఘట్టం. అయితే ఆలయ నిర్మాణం పూర్తయిందని, ప్రాణప్రతిష్ఠ జరిగిందని చెప్పి ఆ క్షేత్రాన్ని ఒక రాజకీయ పార్టీకి చెందినదిగా భావించడం తగదు.

రాముడు మర్యాదాపురుషోత్తముడు. ధర్మానికి, సత్యానికి, న్యాయానికి ప్రతీక. ఆయన పేరుతో రాజకీయాలు చేసేవారు సైతం ఆయన ఆదర్శాలను ఆచరణలో చూపించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. రాజకీయ ప్రత్యర్థి ఆలయానికి వస్తే అభ్యంతరం చెప్పడం, ఆయన భక్తిని శంకించడం ఏ విధమైన ధార్మిక విలువలకు ప్రతిబింబం? ఒకవైపు రాముడి ఆదర్శాలను ప్రస్తావిస్తూ, మరోవైపు రాజకీయ ప్రత్యర్థుల విశ్వాసాన్ని ప్రశ్నించడం పరస్పర విరుద్ధమైన వైఖరి.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను కల్పించింది. తన విశ్వాసాన్ని అనుసరించే, ఆచరించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఈ హక్కు అధికారంలో ఉన్నవారికే కాదు, ప్రతిపక్షంలో ఉన్నవారికీ సమానంగా వర్తిస్తుంది. ముఖ్యమంత్రికి ఉన్న హక్కే సామాన్య పౌరుడికీ ఉంటుంది. ప్రధాన ప్రతిపక్ష నేతకు ఉన్న హక్కే రాజకీయంగా భిన్నాభిప్రాయం కలిగిన వ్యక్తికీ ఉంటుంది. దేవాలయ దర్శనాన్ని రాజకీయ విధేయతకు పరీక్షగా మార్చడం రాజ్యాంగ విలువలకు విరుద్ధం.

అయోధ్య రాముడు ఎవరి రాజకీయ ఆస్తి కాదు. ఆయనను దర్శించుకునే హక్కు భక్తులందరికీ ఉంది. రాముడి పేరుతో ఓట్లు అడిగేవారికి ఎంత హక్కు ఉందో, రాముడిని దర్శించుకోవాలనుకునే అఖిలేష్ యాదవ్ వంటి రాజకీయ ప్రత్యర్థులకూ అంతే హక్కు ఉంది. భక్తికి పార్టీ రంగులు పులమడం, ఆధ్యాత్మికతకు రాజకీయ సరిహద్దులు గీయడం మానుకోవాలి.

రాముడి గొప్పతనం ఆయనను ఎవరు దర్శించుకున్నారనే దానిలో లేదు. ఆయన చూపిన ధర్మమార్గాన్ని సమాజం ఎంతవరకు అనుసరిస్తుందన్నదే అసలైన ప్రశ్న. అయోధ్య ఆలయం విశ్వాసానికి నిలయంగా ఉండాలి తప్ప రాజకీయ ఆధిపత్య ప్రదర్శనకు వేదిక కాకూడదు. రాముడు అందరివాడు. ఆయనను దర్శించుకునే హక్కు కూడా అందరిదే.

కమ్యూనిస్టు ఐక్యతకు ఇదే సరైన సమయం!

నిన్నటి తరువాయి భాగం

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కులపై దాడులు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతాంగ సంక్షోభం, విద్యా వైద్య రంగాల్లో అసమానతలు పెరుగుతున్నాయి.
మరోవైపు కుల వివక్ష, మతతత్వ రాజకీయాలు, ప్రజాస్వామ్య హక్కులపై ఆంక్షలు కూడా ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి.
ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీలు విడివిడిగా కార్యక్రమాలు నిర్వహించడం కంటే ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకోవాలి.
ఒకే దేశంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టులు వేర్వేరు స్వరాలతో కాకుండా ఒకే బలమైన స్వరంతో మాట్లాడాలి.
ఐక్య పోరాటాల ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలి. ఆ విశ్వాసమే భవిష్యత్తులో రాజకీయ ఐక్యతకు పునాది అవుతుంది.

8. విలీనమే అంతిమ లక్ష్యమా? ముందుగా ఉమ్మడి పోరాటం అవసరమా?

కమ్యూనిస్టు ఐక్యతపై చర్చించేటప్పుడు ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తించాలి. ఐక్యత అంటే వెంటనే అన్ని పార్టీలు తమ పేర్లు, నిర్మాణాలు రద్దు చేసుకొని ఒకే పార్టీలో విలీనం కావాలని తొందరపెట్టడం కాదు. అలాంటి విలీనం సాధ్యమవ్వాలంటే సిద్ధాంతపరమైన, రాజకీయపరమైన, సంస్థాగతపరమైన అవగాహన అవసరం. అందుకోసం దశలవారీగా ముందుకు వెళ్లాలి.
మొదటి దశ: అన్ని కమ్యూనిస్టు పార్టీల మధ్య బహిరంగ చర్చలు.
రెండో దశ: ఉమ్మడి కనీస రాజకీయ కార్యక్రమం రూపొందించడం.
మూడో దశ: కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, సామాజిక న్యాయ ఉద్యమాల్లో ఉమ్మడి పోరాటాలు.
నాలుగో దశ: సిద్ధాంత, రాజకీయ, సంస్థాగత విభేదాలపై సమగ్ర చర్చలు.
ఐదో దశ: పరస్పర అంగీకారంతో సమైక్య కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి మార్గం అన్వేషించడం.
ఈ ప్రక్రియలో ఎంసీపీఐ(యు) తన ఐక్యతా ఆకాంక్షను స్పష్టంగా ముందుకు తీసుకురావాలి. మిగతా పార్టీలు కూడా తమ అభిప్రాయాలను బహిరంగంగా తెలియజేయాలి.

9. ఐక్యతకు అడ్డంకులు ఏమిటి? ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం

ఐక్యతను కోరుకోవడం సులభం. కానీ ఆచరణలోకి తీసుకురావడం కష్టం. ఎందుకంటే ఐక్యతకు సిద్ధాంతపరమైన విభేదాలతోపాటు సంస్థాగత, నాయకత్వ, రాజకీయ సమస్యలు కూడా అడ్డంకిగా ఉండవచ్చు. కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను ప్రతి కమ్యూనిస్టు పార్టీ తనను తాను వేసుకోవాలి. మన పార్టీ ప్రయోజనమా? కమ్యూనిస్టు ఉద్యమ ప్రయోజనమా? వ్యక్తిగత నాయకత్వ ప్రాధాన్యత ముఖ్య



మా? సమిష్టి నాయకత్వ నిర్మాణం ముఖ్యమా? గత విభేదాలను కొనసాగించడమే ముఖ్యమా? కొత్త తరానికి బలమైన ఉద్యమాన్ని అందించడమే ముఖ్యమా? ఇతర పార్టీలను విమర్శించడం ముఖ్యమా? వాటితో కలిసి పనిచేయడం ముఖ్యమా? సిద్ధాంత చర్చలకు సిద్ధమా? లేక మన అభిప్రాయమే అంతిమ సత్యమనే ధోరణిలో ఉన్నామా? ఈ ప్రశ్నలు ఒక్క ఎంసీపీఐ(యు)కే కాదు. ప్రతి కమ్యూనిస్టు పార్టీకి వర్తిస్తాయి.
ఐక్యత కోసం ప్రతి పార్టీ తనలోని లోపాలను కూడా సమీక్షించుకోవాలి. ఆత్మవిమర్శ లేని ఐక్యతా చర్చలు ఫలితాన్ని ఇవ్వవు.

10. ఎంసీపీఐ(యు) ముందుకు తేవాల్సిన ఐక్యతా ప్రతిపాదన

ఎంసీపీఐ(యు) కమ్యూనిస్టు ఐక్యతపై తన రాజకీయ వైఖరిని మరింత స్పష్టంగా ప్రజల ముందుకు తీసుకురావాలి.
అందులో భాగంగా: దేశంలోని అన్ని కమ్యూనిస్టు పార్టీలకు ఐక్యతా చర్చల కోసం అధికారిక ఆహ్వానం పంపాలి. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్)లోని వివిధ విప్లవ కమ్యూనిస్టు శక్తులు, ఇతర మార్క్సిస్టు సంస్థలతో చర్చలకు సిద్ధపడాలి. మార్క్సిజం–లెనినిజం, వర్గ పోరాటం, కుల నిర్మూలన, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఉమ్మడి చర్చలు నిర్వహించాలి. ఐక్యతకు అడ్డంకిగా ఉన్న అంశాలపై నిష్పక్షపాత కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాలి. జాతీయ స్థాయిలో కమ్యూనిస్టు ఐక్యతా సదస్సు నిర్వహించాలి. ఉమ్మడి ప్రజా ఉద్యమాల ద్వారా ఐక్యతను ఆచరణలో నిరూపించాలి.

ఇది ఏ ఒక్క పార్టీని విమర్శించడానికి రూపొందించిన కార్యక్రమం కాదు. భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని పునర్నిర్మించడానికి ఒక ఆచరణాత్మక ప్రయత్నం కావాలి. చరిత్ర మనల్ని క్షమించదు – ఐక్యత కోసం ముందడుగు వేయాలి! నేడు భారత కమ్యూనిస్టు ఉద్యమం ఒక కీలకమైన చారిత్రక మలుపులో ఉంది. ప్రజలు మనల్ని అడుగుతున్నారు. కార్మికులు తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. రైతులు తమ భవిష్యత్తు కోసం ఉద్యమిస్తున్నారు. బీసీలు, దళితులు, ఆదివాసీలు తమ వాటా కోసం ప్రశ్నిస్తున్నారు. యువత ఉపాధి కోసం ఎదురుచూస్తోంది. మహిళలు సమానత్వం కోసం పోరాడుతున్నారు. వీరందరికీ ఒక బలమైన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరం. కానీ కమ్యూనిస్టు పార్టీలు తమ మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకోలేకపోతే ఆ ప్రత్యామ్నాయం ఎలా సాధ్యమవుతుంది?

ఎంసీపీఐ(యు) తరపున మనం అడుగుతున్న ప్రశ్న ఇదే:

కమ్యూనిస్టు ఐక్యతకు సిద్ధంగా ఉన్నప్పుడు ఇతర పార్టీలు చర్చలకు ఎందుకు ముందుకు రావడం లేదు? సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్)లోని వివిధ విప్లవ కమ్యూనిస్టు శక్తులు, ఇతర మార్క్సిస్టు పార్టీలు ఈ ప్రశ్నకు రాజకీయంగా సమాధానం చెప్పాలి. ఐక్యతకు ఉన్న అడ్డంకులను బహిరంగంగా చర్చించాలి. ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించాలి. ఎవరూ ఎవరిపై ఆధిపత్యం చెలాయించకూడదు. ఎవరూ తమ చారిత్రక పాత్రను తక్కువ చేసుకోవాల్సిన అవసరం లేదు. కానీ అందరూ ఒక గొప్ప లక్ష్యం కోసం ముందుకు రావాలి. మార్క్స్, ఎంగెల్స్ అందించిన ఐక్యతా స్ఫూర్తిని, లెనిన్ ప్రతిపాదించిన పార్టీ నిర్మాణ సూత్రాలను భారతదేశ సామాజిక వాస్తవికతకు అనుగుణంగా ఆచరణలో పెట్టాలి. విభజనల వల్ల బలహీనపడిన ఉద్యమాన్ని ఐక్యత ద్వారా బలోపేతం చేయాలి.
ఇది పదవుల కోసం ఐక్యత కాదు. ఇది వ్యక్తుల కోసం ఐక్యత కాదు. ఇది ప్రజల కోసం, కార్మికవర్గం కోసం, రైతాంగం కోసం, అణగారిన వర్గాల విముక్తి కోసం ఐక్యత.
భవిష్యత్తు తరాలకు మనం అందించాల్సింది మరిన్ని కమ్యూనిస్టు పార్టీలు కాదు. బలమైన, ప్రజాస్వామిక, సమష్టి నాయకత్వంతో కూడిన ఐక్య కమ్యూనిస్టు ఉద్యమం.
ఇప్పటికైనా ముందుకు రండి! చర్చలకు సిద్ధపడండి! విభేదాలను పరిష్కరించుకోండి! ఐక్య ఉద్యమాన్ని నిర్మించండి!
మన చారిత్రక పిలుపు ఎంసీపీఐ(యు) ఐక్యతకు సిద్ధం – ఇతర కమ్యూనిస్టు పార్టీలు ముందుకు రావాలి!
విభజనలు వద్దు – ఐక్యత ముద్దు!
మార్క్సిజం–లెనినిజం వర్ధిల్లాలి!
కార్మిక, కర్షక, బహుజన ఐక్యత వర్ధిల్లాలి!
భారత కమ్యూనిస్టుల ఐక్యత వర్ధిల్లాలి!
ఇదే సరైన సమయం – ఐక్యతే మన లక్ష్యం...



మాలోతు సాగర్
ఎంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు. సెల్ నెంబర్ 7013805411

స్వర్గం -నరకం

జేబులో గాంధీ
మనసుకు శాంతి
చేతిలో బ్రాందీ
పోతుంది అశాంతి...
గాంధీ
బ్రాందీ
ఉంటే
బతుకు జిగేల్
బాధలు పరార్...
నేడు రెండు రాజ్యం చేస్తున్నాయి
నేడు రెండు సంఘ మూలాలను
నాశనం చేస్తున్నాయి...
హద్దులు దాటితే నరకం
హద్దుల్లో ఉంటేనే స్వర్గం

రేడియమ్
9291527757

నిష్కర్ష అధ్యయనానికి..!!

కుతికెల్దాకా దిగబడిన
ఇవ్వాల్టి ఈ దైన్యాలకి
అలనాటి పరిష్కారాల
అప్రమత్త అన్వయానికీ..
నిష్కర్ష అధ్యయనానికీ...
చదువుదాం మనసుపెట్టి
బోల్షివిక్ పార్టీ చరిత్రను...
మళ్ళీ...మళ్ళీ...మళ్ళీ...!!

డా.ఇక్బాల్ పాషా
9440775732



పోలీసు, సైన్యంతో ప్రజా ఆకాంక్షలను చంపలేరు!

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు అధికారం ప్రజల నుంచి వస్తుంది. ఆ అధికారం ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగపడాలి తప్ప, వారి గొంతులను నొక్కివేయడానికి కాదు. ప్రజల నిరసనలను పోలీసు బలగాలతో అణచివేయవచ్చు, ఉద్యమకారులను అరెస్టు చేయవచ్చు, రహదారులపై ఆంక్షలు విధించవచ్చు. కానీ ప్రజల్లో పేరుకుపోయిన ఆర్థిక అసంతృప్తిని, సామాజిక ఆగ్రహాన్ని, మెరుగైన జీవితం పట్ల ఉన్న ఆకాంక్షలను బలప్రయోగంతో అంతం చేయడం సాధ్యం కాదు. ప్రస్తుతం ఐరోపాలోని అనేక దేశాల్లో వ్యక్తమవుతున్న ప్రజా ఉద్యమాలు పాలకులకు ఇస్తున్న ప్రధాన సందేశం ఇదే.



ఒకప్పుడు ప్రపంచానికి సంక్షేమ రాజ్య భావనను పరిచయం చేసిన ఐరోపా దేశాలు నేడు అనేక సామాజిక, ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. అధునాతన పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానం, విస్తృతమైన వాణిజ్యం, అధిక తలసరి ఆదాయాలు ఉన్నప్పటికీ సాధారణ ప్రజల జీవితాలు మాత్రం ఆశించిన స్థాయిలో మెరుగుపడటం లేదు. విద్యార్థులు, కార్మికులు, ఉపాధ్యాయులు, రైతులు, నిరుద్యోగ యువత, పెన్షనర్లు వేర్వేరు సమస్యలతో వీధుల్లోకి వస్తున్నారు. ఫ్రాన్స్, గ్రీస్, ఇటలీ, స్పెయిన్, బెల్జియం, పోర్చుగల్ వంటి దేశాల్లో నిరసనలు, సమ్మెలు, ప్రదర్శనలు విస్తరించడం యాదృచ్ఛిక పరిణామం కాదు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందడం లేదనే అసంతృప్తికి అది ప్రతిబింబం.
ఫ్రాన్స్‌లో విద్యా రంగ సమస్యలతో మొదలైన ఆందోళనలు క్రమంగా ప్రభుత్వ సేవలు, జీవన వ్యయం, వేతనాలు, పెన్షన్లపై అసంతృప్తితో ముడిపడ్డాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, తరగతి గదుల్లో విద్యార్థుల రద్దీ, మౌలిక సదుపాయాల లోపం వంటి సమస్యలు విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మరోవైపు ధరల పెరుగుదలతో కుటుంబాల బడ్జెట్లు దెబ్బతింటున్నాయి. కార్మిక సంఘాలు సమ్మెలకు పిలుపునివ్వడం, వివిధ వర్గాలు ఉద్యమాల్లో భాగస్వాములు కావడం వెనుక ఈ సమస్యల సమ్మేళనమే ఉంది. ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చినంత మాత్రాన ప్రజల అసంతృప్తి తొలగిపోదని ఈ పరిణామాలు తెలియజేస్తున్నాయి.
స్పెయిన్‌లో సమస్య కొంత భిన్నంగా కనిపించినా దాని మూలాలు ఆర్థిక అసమానతల్లోనే ఉన్నాయి. పర్యాటక రంగం విస్తరించడం వల్ల దేశానికి ఆదాయం పెరుగుతున్నప్పటికీ, అదే సమయంలో ప్రధాన నగరాల్లో ఇళ్ల అద్దెలు సామాన్యులకు అందనంతగా పెరుగుతున్నాయి. పర్యాటక అవసరాల కోసం నివాస గృహాలను వాణిజ్య ప్రయోజనాలకు మళ్లించడం, గృహాల కొరత, తాత్కాలిక ఉద్యోగాలు, తక్కువ వేతనాలు యువతను ఆర్థిక స్వాతంత్ర్యానికి దూరం చేస్తున్నాయి. ఉద్యోగం ఉన్నా సొంతంగా ఇల్లు అద్దెకు తీసుకొని గౌరవప్రదంగా జీవించలేని పరిస్థితి ఏర్పడితే ఆర్థికాభివృద్ధి ఎవరి కోసం అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.
ఇటలీలోనూ ఇదే వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తోంది. ధరలు పెరుగుతున్న వేగానికి అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తోంది. వైద్యం, విద్య, గృహవసతి ఖర్చులు పెరుగుతుండగా ప్రభుత్వ సేవల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. గ్రీస్‌లో గత రుణ సంక్షోభం అనంతరం అమలైన పొదుపు విధానాల ప్రభావం ఇంకా సామాన్య కుటుంబాలను వెంటాడుతోంది. బెల్జియంలో విద్యా ఖర్చులు, జీవన వ్యయం, ప్రభుత్వ సేవలపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దేశాలు వేరు, సమస్యల తీవ్రత వేరు అయినప్పటికీ ప్రజలు కోరుతున్నది మాత్రం ఒక్కటే. పనిచేసే వారికి సరైన వేతనం, యువతకు స్థిరమైన ఉపాధి, అందుబాటులో ఇళ్లు, నాణ్యమైన విద్య, వైద్యం, వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత.
ఈ ఉద్యమాల్లో యువత భాగస్వామ్యం ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం. చదువు పూర్తిచేసుకున్నా స్థిరమైన ఉద్యోగం లభించకపోవడం, ఉద్యోగం దొరికినా తగిన ఆదాయం లేకపోవడం, ఇళ్ల అద్దెలు చెల్లించలేక కుటుంబాలపై ఆధారపడాల్సి రావడం వారి భవిష్యత్తుపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. యూరోస్టాట్ గణాంకాల ప్రకారం, 2025లో ఐరోపా సమాఖ్యలో 15–29 సంవత్సరాల వయసున్న యువతలో సుమారు 9 శాతం మంది తమ కుటుంబ ఆదాయంలో 40 శాతానికి మించి గృహ ఖర్చులకే వెచ్చించాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. గ్రీస్, డెన్మార్క్ వంటి దేశాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. ఇది కేవలం పేద దేశాల సమస్య కాదని, సంపన్న ఆర్థిక వ్యవస్థల్లోనూ యువతకు స్వతంత్ర జీవితం ఒక అందని కలగా మారుతోందని స్పష్టం చేస్తోంది.
ఈ పరిస్థితులకు మరో ముఖ్యమైన కారణం ప్రభుత్వాల ఆర్థిక ప్రాధాన్యతల్లో కనిపిస్తున్న వైరుధ్యం. ఒకవైపు ప్రజా విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సామాజిక భద్రతకు నిధుల కొరత ఉందని చెబుతున్న ప్రభుత్వాలు, మరోవైపు రక్షణ రంగానికి భారీగా ఖర్చు చేస్తున్నాయి. స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ (ఎస్ఐపీఆర్ఐ) 2025 గణాంకాల ప్రకారం, ఐరోపా దేశాల మొత్తం సైనిక వ్యయం 864 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 14 శాతం అధికం. రష్యా--ఉక్రెయిన్ యుద్ధం, భద్రతాపరమైన ఆందోళనలు, ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థ (నాటో) సభ్య దేశాల రక్షణ లక్ష్యాలు ఈ పెరుగుదలకు కారణాలుగా ఉన్నాయి. దేశ భద్రతకు రక్షణ వ్యయం అవసరమే. అయితే ప్రజల ఆర్థిక భద్రత కూడా జాతీయ భద్రతలో భాగమేనని పాలకులు గుర్తించాలి. ఆయుధ సంపత్తి పెరిగినా ఆకలితో అలమటించే కుటుంబాలు, ఇల్లు లేని యువత, వైద్యం అందని పేదలు ఉన్నప్పుడు అభివృద్ధి నమూనాను ప్రశ్నించాల్సిందే.
కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు, పెట్టుబడి ప్రోత్సాహకాలు ఇవ్వడం ఆర్థిక విధానాల్లో భాగం కావచ్చు. కానీ వాటి వల్ల ఏర్పడే సంపద సమాజానికి తిరిగి చేరుతున్నదా ?లేదా ?అన్నది అసలు ప్రశ్న. ఉత్పత్తి పెరుగుతున్నా ఉద్యోగాలు పెరగకపోతే, కంపెనీల లాభాలు పెరుగుతున్నా కార్మికుల వేతనాలు పెరగకపోతే, ఆర్థిక వృద్ధి గణాంకాలు సామాన్యుడికి ప్రయోజనం కలిగించవు. మార్కెట్ అభివృద్ధి చెందడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడం రెండూ ఒకటి కావు. సంపద సృష్టించడం ఎంత ముఖ్యమో, ఆ సంపదలో న్యాయమైన వాటా ప్రజలకు అందేలా చూడడం కూడా అంతే ముఖ్యం.
ప్రజల అసంతృప్తి ఎన్నికల రాజకీయాల్లోనూ ప్రతిఫలిస్తోంది. జర్మనీలో సంప్రదాయ పార్టీలపై అసంతృప్తి, వలసలు, ఆర్థిక భద్రత, జాతీయవాదం వంటి అంశాలు రాజకీయ సమీకరణాలను మార్చుతున్నాయి. 2025 పార్లమెంటు ఎన్నికల్లో ప్రత్యామ్నాయ జర్మనీ (ఏఎఫ్‌డీ) పార్టీకి 20.8 శాతం ఓట్లు రావడం, గత ఎన్నికలతో పోలిస్తే దాని బలం గణనీయంగా పెరిగిందని సూచించింది. బ్రిటన్‌లో 2024 ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ భారీగా స్థానాలు కోల్పోయి లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఫ్రాన్స్‌లోనూ 2024 ముందస్తు ఎన్నికల్లో ఏ కూటమికీ స్పష్టమైన మెజారిటీ రాలేదు. ఈ ఫలితాలు సంప్రదాయ రాజకీయ పార్టీలపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని తెలియజేస్తున్నాయి.
అయితే ఈ అసంతృప్తి అంతా వామపక్ష ఉద్యమాలకే అనుకూలంగా మారడం లేదు. కొన్ని దేశాల్లో కార్మిక, ప్రజా సంక్షేమ సమస్యలను ముందుకు తెచ్చే వామపక్షాలు బలం పుంజుకుంటుంటే, మరికొన్ని దేశాల్లో వలస వ్యతిరేకత, జాతీయవాదం, భద్రత వంటి అంశాలను ప్రధానంగా ప్రచారం చేసే తీవ్ర కుడిపక్ష (బూర్జువా) శక్తులు ఎదుగుతున్నాయి. 2024 యూరోపియన్ పార్లమెంటు ఎన్నికల్లో యూరోపియన్ పీపుల్స్ పార్టీ 188 స్థానాలతో అతిపెద్ద కూటమిగా నిలవగా, సామాజిక ప్రజాస్వామ్యవాదులు 136 స్థానాలు సాధించారు. ఐరోపా సమాఖ్యలో ఓటింగ్ శాతం 50.74గా నమోదైంది. ఈ ఫలితాలు రాజకీయ అసంతృప్తి ఒకే దిశలో ప్రయాణించడం లేదని, ప్రజల ఆగ్రహాన్ని ఏ రాజకీయ శక్తి విశ్వసనీయమైన పరిష్కారాలతో ఆకర్షించగలదో దానిపై భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని సూచిస్తున్నాయి.
ఇక్కడ పాలకులు మరో ప్రమాదాన్ని గుర్తించాలి. ప్రజల నిజమైన సమస్యలకు పరిష్కారం చూపకుండా వారి అసంతృప్తిని వలసదారులపై, మైనారిటీలపై, ఇతర సామాజిక వర్గాలపైకి మళ్లించడం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాన్ని పొందవచ్చు. కానీ అది ఆర్థిక సమస్యలను పరిష్కరించదు. నిరుద్యోగానికి కారణమైన విధానాలను మార్చకుండా నిరుద్యోగుల ఆగ్రహాన్ని ఇతరులపైకి మళ్లించడం, గృహాల కొరతను పరిష్కరించకుండా వలసదారులనే నిందించడం పాలకుల బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నమే అవుతుంది. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన రాజకీయ వ్యవస్థల్లో తీవ్రవాద ధోరణులు పెరిగే ప్రమాదం కూడా ఉంది.
అయితే ఉద్యమాల సందర్భంగా దుకాణాలు ధ్వంసం చేయడం, ప్రజా ఆస్తులను తగలబెట్టడం, వ్యక్తులపై దాడులకు దిగడం అనే హింసాత్మక, దౌర్జన్య చర్యలకు దిగటం కూడా ఎంత మాత్రం సమర్థనీయం కాదు. హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠినంగా చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఒకరో, ఇద్దరో,లేదా ఏ కొందరి హింసను మాత్రమే సాకుగా చూపించి మొత్తం ఉద్యమాన్ని తీవ్రంగా అణచివేయడం, నిరసనకారులందరినీ నేరస్థులుగా చిత్రించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.
2026 అక్టోబరు 19న వెలువడిన యూరోపియన్ నిరసనలపై అంతర్జాతీయ వార్తా విశ్లేషణలు కూడా ఈ ఉద్యమాల్లో శాంతియుత ప్రదర్శనలతో పాటు కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నాయి. అందువల్ల నిరసనల కారణాలను, పోలీసుల ప్రతిస్పందనను, హింసకు పాల్పడిన వ్యక్తుల చర్యలను విడివిడిగా పరిశీలించాలి. ప్రభుత్వాలు ప్రజలతో చర్చించకుండా పోలీసు బలగాలనే ప్రధాన పరిష్కారంగా భావిస్తే సమస్య మరింత జటిలమవుతుంది.
సెర్బియాలో 2024 నవంబరులో నోవిసాద్ రైల్వే స్టేషన్ పైకప్పు కూలి 16 మంది మరణించిన ఘటన అనంతరం విద్యార్థులు ప్రారంభించిన నిరసనలు ప్రభుత్వ అవినీతి, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య సంస్థల పనితీరుపై విస్తృత చర్చకు దారితీశాయి. ఒక నిర్మాణ ప్రమాదం వెనుక ఉన్న పరిపాలనా వైఫల్యాన్ని ప్రశ్నిస్తూ ప్రారంభమైన ఆందోళన క్రమంగా రాజకీయ ఉద్యమంగా విస్తరించింది. ఇలాంటి పరిణామాలు ప్రజా ఉద్యమాల స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. ప్రజలు ఎప్పుడూ కేవలం ధరల తగ్గింపు కోసమే వీధుల్లోకి రారు. తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల్లో తమకు భాగస్వామ్యం ఉండాలని, ప్రభుత్వాలు జవాబుదారీగా వ్యవహరించాలని, అవినీతికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని కూడా కోరుకుంటారు. ఐరోపాలో జరుగుతున్న పరిణామాలకు భారతదేశ పరిస్థితులకు మధ్య కొన్ని పోలికలు కనిపిస్తున్నాయి. ఇక్కడ కూడా నిరుద్యోగం, ధరల పెరుగుదల, కాంట్రాక్టు ఉద్యోగాలు, రైతుల ఆదాయ సమస్యలు, కార్మికుల హక్కులు, పెన్షన్లు, విద్యా వైద్య రంగాల్లో పెరుగుతున్న ప్రైవేటీకరణ సామాన్య ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పట్టణాల్లో ఇళ్ల అద్దెలు, వైద్య ఖర్చులు మధ్యతరగతి కుటుంబాలకే భారంగా మారుతు న్నాయి. ఉన్నత విద్య కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నా రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య తగ్గుతూ, భారత సైనిక రిక్రూట్మెంట్ కూడా తాత్కాలిక ఉద్యోగంగా మారింది. ఈ విధానం దేశ భద్రతకు ముప్పు తెస్తుంది. ఇలా భారత దేశంలో అస్థిర ఉపాధి పెరుగుతు న్నది. ఈ సమస్యలు ఐరోపా దేశాల్లోని సమస్యలతో పూర్తిగా సమానం కాకపోయినా వాటి వెనుక ఉన్న ఆర్థిక అసమానతలు, సంక్షేమ బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పించుకోవడం వంటి అంశాల్లో సారూప్యత ఉంది. భారతదేశంలో ప్రజా నిరసనలను ఎదుర్కొనే విషయంలోనూ పాలకుల వైఖరి ప్రజాస్వామ్య ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. రైతుల ఉద్యమాలు, కార్మిక సమ్మెలు, విద్యార్థుల ఆందోళనలు, ప్రజా సమస్యలపై జరిగే ప్రదర్శ నలను రాజకీయ వ్యతిరేకతగా మాత్రమే చూడకూడదు. ప్రజల సమస్యలను వినడం, చర్చించడం, సాధ్యమైన పరిష్కారాలను చూపడం ప్రభుత్వ బాధ్యత. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రభుత్వం అంటే ఎక్కువ పోలీసు బలగాలను , దేశ సరిహద్దులను రక్షణ కోసం ఉపయోగించే సైన్యాన్ని స్వదేశీ పౌరులపై, యువతీ, యువకులపై దేశ ద్రోహులుగా కేంద్ర ప్రభుత్వం తన అనుకూల మీడియా సంస్థలతో, సోషల్ మీడియా సంస్థలతో ప్రచారం చేయించటం, కేంద్ర ప్రభుత్వానికి తగదు. ప్రజల విశ్వాసాన్ని పొందే ప్రభుత్వం ఇలాంటి ప్రచారాలు చేయటం తగదు.
ఐరోపాలోని తాజా ఉద్యమాలు మరో విషయాన్ని కూడా గుర్తుచేస్తున్నాయి. ఎన్నికల్లో గెలవడం ద్వారా ప్రభుత్వాలకు ఐదేళ్ల పాలనా అధికారం లభించవచ్చు. కానీ ప్రజల సమస్యలను విస్మరించే హక్కు మాత్రం లభించదు. ప్రజాభిప్రాయాన్ని ఎన్నికల రోజున మాత్రమే పరిగణనలోకి తీసుకుని, మిగిలిన కాలమంతా కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం క్రమంగా తగ్గుతుంది. ఎన్నికల్లో అధికార మార్పిడి జరిగినా ఆర్థిక విధానాల్లో మౌలిక మార్పులు రాకపోతే అసంతృప్తి మళ్లీ పెల్లుబుకుతుంది. అందుకే రాజకీయ పార్టీల మార్పు కంటే ప్రజల జీవితాల్లో వచ్చే మార్పే అసలైన కొలమానం కావాలి. ఒక యువకుడు చదువు పూర్తిచేసుకుని ఉద్యోగం పొందగలు గుతున్నాడా? ఆ ఉద్యోగంతో సొంతంగా జీవించగలుగుతున్నాడా? ఒక కార్మికుడు తన కుటుంబ అవసరాలను తీర్చగల వేతనం పొందుతున్నాడా? ఒక రైతు అప్పుల ఊబి నుంచి బయటపడగలుగుతున్నాడా? ఒక వృద్ధుడు గౌరవప్రదమైన జీవితాన్ని గడపగలుగుతున్నాడా? ఒక సామాన్య కుటుంబా నికి నాణ్యమైన, విద్యా, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా? ఈ ప్రశ్నలకు లభించే సమాధానాలే అభివృద్ధికి నిజమైన గీటురాళ్లు కావాలి.
ప్రజల ఆర్థిక కష్టాలను పట్టించుకోకుండా అధికారాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా పాలన సాగించే ప్రభుత్వాలకు చరిత్రలో ఎక్కువ కాలం మనుగడ ఉండదు. నిరసనలను అణచివేయడానికి పోలీసు బలగాలను ఉపయోగించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో సైనిక బలగాల సహాయం కూడా తీసుకోవచ్చు. కానీ ప్రజల ఆకాంక్షలకు పరిష్కారం చూపకు ండా బలప్రయోగంతో పాలన కొనసాగి ంచాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. పోలీసు కవాతులతో నిరసనల శబ్దాన్ని కొంతకాలం తగ్గించవచ్చేమో కానీ, ఆకలి, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలతో పుట్టిన ఆగ్రహాన్ని అంతం చేయలేరు. ప్రజల గొంతుకను వినడం, వారి సమస్యలకు న్యాయమైన పరిష్కారాలు చూపడం, ప్రభుత్వ విధానాలను ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా మార్చడం మాత్రమే పాలకులకు శాశ్వతమైన విశ్వసనీయతను అందిస్తాయి. ఐరోపా వీధుల్లో వినిపిస్తున్న ప్రజా స్వరం ప్రపంచంలోని పాలకులందరికీ ఇస్తున్న హెచ్చరిక ఇదే.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.



మిల్లర్ల సిండికేట్.. ధరలకు కళ్లెం

ఈ సీజన్ ప్రారంభంలో క్వింటాల్ ధాన్యానికి రూ.4,300 నుంచి రూ.4,500 వరకు ధర చెల్లించి కొనుగోలు చేసిన మిల్లర్లు, ప్రస్తుతం అదే ధాన్యానికి ధర భారీగా తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. దసరా పండుగకు ముందు క్వింటాల్‌కు రూ.4,300 వరకు చెల్లించిన మిల్లర్లు.. తుపాను కారణంగా పంటలు నేలకొరగడం, ధాన్యంలో పచ్చి గింజలు, తేమ శాతం ఎక్కువగా ఉందనే కారణాలు చూపుతూ రూ.3,500 నుంచి రూ.3,700 కే కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇక తాజాగా ధాన్యం రాక పెరగడంతో మిల్లర్లు ఒక్కసారిగా ధరలు మరింత తగ్గించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం తుపాను తగ్గుముఖం పట్టడంతో తిరిగి కోతలు ప్రారంభమయ్యాయి. దీంతో మిర్యాలగూడ డివిజన్‌లోని రైస్‌మిల్లులకు ధాన్యం లోడ్లు భారీగా చేరుతున్నాయి. ఇదే అదనుగా భావించిన మిల్లర్లు శుక్రవారం ఒక్కరోజే క్వింటాల్‌కు మరో రూ.300 నుంచి రూ.400 వరకు ధర తగ్గించినట్లు రైతులు చెబుతున్నారు.

ధాన్యం ధర ధమాల్..
రైతు గుండె గుబేల్

మిల్లర్ల సిండికేట్ దెబ్బకు అన్నదాత విలవిల

- వారం రోజుల్లోనే క్వింటాల్‌కు రూ.800 నుంచి రూ.1,000 వరకు పతనం
- తేమ, పచ్చి గింజల పేరుతో దోపిడీ



మిర్యాలగూడ (జనంసాక్షి) : అప్పులు చేసి సాగు చేసిన పంటను కాపాడుకోవడానికి రైతులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎండిన పొలాలకు నీరందించేందుకు నానా అవస్థలు పడ్డారు. విద్యుత్ కోతల మధ్య రాత్రింబవళ్లు పొలాల వద్దే గడిపారు. ఎలినో ప్రభావం, నీటి కొరత, కరెంట్ సమస్యలు, చివరకు తుపాను ప్రభావంతో అకాల వర్షాలు.. ఇలా ప్రకృతి ప్రకోపానికి ఎదురొడ్డి పంటను చేతికి తెచ్చుకున్నారు. తీరా ధాన్యం అమ్ముకునేందుకు మిల్లుల వద్దకు వస్తే అక్కడ మరో రూపంలో దోపిడీ ఎదురవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారం రోజుల్లో రూ.1,000 వరకు పతనం

వారం రోజుల వ్యవధిలోనే క్వింటాల్ ధాన్యం ధర రూ.800 నుంచి రూ.1,000 వరకు పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ డివిజన్‌లోని మిల్లులకు నల్లగొండ జిల్లాతో పాటు పొరుగున ఉన్న సూర్యాపేట జిల్లా నుంచి కూడా భారీగా ధాన్యం తరలివస్తోంది. మిల్లుల రోజువారీ కొనుగోలు సామర్థ్యానికి మించి ధాన్యం వస్తుండటంతో మిల్లర్లు ధరలు తగ్గిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ధరల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సాయంత్రమైతే ధర మరింత పతనం

రైతులు ఉదయం ధాన్యం ధర తెలుసుకుని ట్రాక్టర్లలో లోడ్ చేసుకుని మిల్లులకు బయలుదేరుతున్నారు. పొలం నుంచి కోసిన వెంటనే సుమారు 25 శాతం తేమతో కూడిన ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. అయితే రవాణా ఆలస్యమై సాయంత్రానికి మిల్లుకు చేరితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని రైతులు చెబుతున్నారు. ఉదయం చెప్పిన ధరకు సాయంత్రానికి రూ.200 నుంచి రూ.300 వరకు కోత పెడుతున్నారని వాపోతున్నారు. తిరిగి పొలానికి తీసుకెళ్లలేక, పచ్చి ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం లేక, మిల్లర్లు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి

ధాన్యం తీసుకుని మిల్లుల వద్దకు వస్తున్న రైతులకు కనీస గౌరవం కూడా దక్కడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మిల్లుల వద్ద రైతులను ఈసడించుకోవడం, కసురుకోవడం, గంటల తరబడి వేచి ఉండేలా చేయడం వంటి ఘటనలతో అన్నదాతలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరో వైపు మార్కెట్‌లో ధరల పతనం, ఇంకోవైపు మిల్లుల వద్ద అవమానాలు.. ఇలా రైతుకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి.

అధికార యంత్రాంగం ఏం చేస్తున్నట్లు?

వారం రోజుల్లోనే ధాన్యం ధరలు ఇంతలా పడిపోతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మిల్లుల కొనుగోళ్లపై పర్యవేక్షణ, తేమ శాతం పేరుతో జరుగుతున్న ధరల కోతలపై తనిఖీలు, రైతులకు పారదర్శకమైన ధరల సమాచారం అందించే చర్యలు ఎక్కడా కనిపించడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.



దీపావళి వేళ స్మశాన వాటికల్లో అపరిశుభ్రత

జీహెచ్ఎంసీ తీరుపై సేవా సంఘం ఆగ్రహం

ఖైరతాబాద్, నవంబర్ 07 (జనం సాక్షి) : దీపావళి పండుగను పురస్కరించుకుని స్మశాన వాటికల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనుల విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్మశాన వాటికల సేవా సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం పండుగకు మూడు రోజుల ముందుగానే పిచ్చి మొక్కలు, పొదలను తొలగించి పరిసరాలను శుభ్రం చేసేవారని, ఈ ఏడాది మాత్రం పండుగకు ఒక్కరోజు ముందు పనులు ప్రారంభించడంతో పూర్తిస్థాయిలో శుభ్రత సాధ్యం కావడం లేదని విమర్శించారు. దీపావళి సందర్భంగా అనేక కుటుంబాలు తమ పూర్వీకులు, మరణించిన బంధువుల సమాధులను శుభ్రం చేసి, రంగులు వేసి, వారికి ఇష్టమైన ఆహార పదార్థాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12, 13తో పాటు రోడ్ నంబర్ 3 లోని హిందూ స్మశాన వాటికలకు వందలాది మంది సందర్శకులు వస్తుంటారు. అయితే స్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలు, దట్టమైన పొదలు పెరిగిపోవడంతో విషసర్పాలు, క్రిమికీటకాల సంచారం పెరిగే ప్రమాదం ఉందని సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పండుగ రోజున పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనులను తక్షణమే పూర్తిచేసి సందర్శకుల భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రోడ్ నంబర్ 12, 13 బంజారాహిల్స్ స్మశాన వాటికల సేవా సంఘం అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ పండుగల సమయంలో స్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులపై ఉందన్నారు. ఇకపై దీపావళి వంటి పండుగలకు కనీసం వారం రోజుల ముందుగానే శుభ్రత పనులు ప్రారంభించి పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు వచ్చిన జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్ రావుకు సంఘం నాయకులు విజయ్ కృష్ణ, కొండ భగవాన్ దాస్, కె.ఆర్.నర్సింగ్ రావు తదితరులు సమస్యలను వివరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్మశాన వాటికల్లో పారిశుద్ధ్య పనులను పూర్తిస్థాయిలో చేపట్టాలని వారు అధికారులను కోరారు.

బాధితుడికి రూ.6 లక్షల ఎల్ఓసీ మంజూరు

కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 07 (జనంసాక్షి): శంకరపట్నం మండలం కన్నాపూర్‌కు చెందిన తాళ్లపల్లి కుమార్ తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు.
బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలువేలి సమ్మిరెడ్డి ఈ విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కనకం సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, గద్దపాక గ్రామ ఉపసర్పంచ్ జంగా జైపాల్, ముత్తారం బూత్ అధ్యక్షుడు కనకం రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఆపద సమయంలో అండగా నిలిచిన బండి సంజయ్‌కుమార్‌కు, సహకరించిన నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో తమ్మిడికుంట చెరువును పరిశీలించిన పిపసి చైర్మన్ గాంధీ

శేరిలింగంపల్లి, నవంబర్ 07 (జనంసాక్షి) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈనెల 11న శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధి తమ్మిడి కుంట చెరువుకు విచ్చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం రాష్ట్ర ప్రజాపద్దులకమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ సందర్శించి స్థానికంగా ఏర్పాట్లను పరిశీలించారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్ లో గల తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ మరియు అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్, కూకట్పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ తదితరులతో కలిసి ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పిపసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ తమ్మిడికుంట చెరువు సుందరీకరణ మరియు అభివృద్ధి పనులలో వేగం పెంచాలని, పనులు తుది దశలో ఉన్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం రోజున ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతున్నందున ప్రతి ఒక్కరు అప్రమత్తతతో వ్యవహరిస్తూ అనుకున్న పనులను సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యతను ఎత్తిచూపారు. ప్రభుత్వ కార్యదక్షత, హైడ్రా అధికారుల జవాబుదారితనం పుణ్యామని తుమ్మిడి కుంట చెరువువద్ద ఆక్రమణలను తొలగించి చెరువును పూర్వ వైభవానికి తెచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. చెరువు పరిధిలో జరిగిన కబ్జాలు, నిర్మాణాలను తొలగించి పూర్తి స్థాయిలో రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని, ముఖ్యమంత్రి రాకతో తుమ్మిడికుంట చెరువుకు మరింత సార్ధకత చేకూరనుందని అరికెపూడి భరోసాని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు , నాయకులు కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని వేధిస్తున్న కుమారుడిని హతమార్చిన తండ్రి

బిచ్కుందలో ఘటన.. నిందితుడి అరెస్టు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): మద్యం మత్తులో డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధిస్తున్న కుమారుడిని తండ్రి హత్య చేసిన ఘటన బిచ్కుంద పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడైన తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బిచ్కుందకు చెందిన సురేష్ మద్యానికి బానిసై తరచూ డబ్బుల కోసం తల్లిదండ్రులు గంగమణి, శివరాములుతో గొడవపడేవాడు. ఈ క్రమంలో నవంబర్ 4న రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన సురేష్ డబ్బులు ఇవ్వాలని వేధిస్తూ తల్లిపై చేయి చేసుకున్నాడు. ఆమె గొంతు పిసుకుతుండటంతో అడ్డుకున్న తండ్రి శివరాములు ఆగ్రహంతో ఎరుపు రంగు తువ్వాలును కుమారుడి మెడకు బిగించి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.
మృతుడి సోదరి చాకలి విజయ ఫిర్యాదు మేరకు బిచ్కుంద పోలీసులు కేసు నమోదు చేశారు. బాన్సువాడ డీఎస్పీ పి.విట్టల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ రవికుమార్, ఎస్సై రాజు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన తువ్వాలును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

అంబర్‌పేటలో ఎండీఎంఏ ముఠా గుట్టురట్టు!

- డెల్టా జూనియర్ కళాశాల వద్ద ఐదుగురు అరెస్టు
- 25 గ్రాముల మాదకద్రవ్యం స్వాధీనం
- గ్రాముకు రూ.5 వేలకే కొనుగోలు.. రూ.10 వేలకు విక్రయం
- ప్రధాన సరఫరాదారుడి కోసం పోలీసుల గాలింపు

అంబర్‌పేట, నవంబర్ 07 (జనంసాక్షి): హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎండీఎంఏ మాదకద్రవ్యాల విక్రయ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. 6వ నంబర్ జంక్షన్ సమీపంలోని డెల్టా జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం నిర్వహించిన దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి, 25 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్ఐ ఎం.సంధ్య, సిబ్బంది, మధ్యవర్తులు, కూస్ బృందంతో కలిసి నవంబర్ 6న మధ్యాహ్నం 3.20 గంటలకు ఈ దాడి నిర్వహించారు. ప్రధాన నిందితుడు చెట్టబోయిన వేణుగోపాల్ అలియాస్ వేణు యాదవ్ అలియాస్ గోపాల్.. హయత్‌నగర్‌కు చెందిన పరారీలో ఉన్న మహమ్మద్ ఖాసిముద్దీన్ నుంచి గ్రాముకు రూ.5 వేల చొప్పున ఎండీఎంఏ కొనుగోలు చేసి, రూ.10 వేలకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. అవుతు మోహన్ సాయి మణిదీప్ రెడ్డి, యాద అనంత కృష్ణ సబ్ పెడ్లర్లుగా వ్యవహరిస్తూ గ్రాముకు రూ.1,500 చొప్పున కమీషన్ తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

మహమ్మద్ తౌహీద్ అలియాస్ తౌహీద్, మహమ్మద్ అబ్దుల్ ఇర్ఫాన్ వ్యక్తిగత వినియోగం కోసం డ్రగ్స్ కొనుగోలు చేసేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు.నిందితుల నుంచి మొత్తం 25 గ్రాముల ఎండీఎంఏ, ఐదు సెల్‌ఫోన్లు, ఓలా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం, బజాజ్ అవెంజర్ మోటార్‌సైకిల్, మారుతి బ్రెజ్జా కారును స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.6.40 లక్షలుగా అంచనా వేశారు. స్వాధీన ప్రక్రియను మధ్యవర్తుల సమక్షంలో నిర్వహించి, ఈ-సాక్ష్య యాప్‌లో వీడియో చిత్రీకరించారు. అరెస్టు చేసిన ఐదుగురిని స్వాధీనం చేసుకున్న వస్తువులతో సహా న్యాయస్థానంలో హాజరుపరిచారు. ప్రధాన సరఫరాదారు మహమ్మద్ ఖాసిముద్దీన్ పరారీలో ఉండటంతో అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి విక్రయాల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని అంబర్‌పేట్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థిని సాహితి

శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 07 (జనం సాక్షి) : శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థిని మాదిరె సాహితి (ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం. ఎంపీసీ) జాతీయ స్థాయి రగ్బీ క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి అకాడమీకి, జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చింది. న్యూఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో జరిగిన ఎస్ జి ఎఫ్ అండర్ -19 జాతీయ స్థాయి రగ్బీ క్రీడా పోటీలకు ఎంపికై, జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న క్రీడాకారులతో పోటీపడి ఉత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడం విశేషం. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి సాహితిని అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి అకాడమీకి గుర్తింపు తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల సెక్రటరీ సాయి చైతన్య రెడ్డి, శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్ రెడ్డి, ఫిజికల్ అడ్వైజర్ లెంకల మహిపాల్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, కోచ్ దీకొండ శివరామకృష్ణ పాల్గొని సాహితిని అభినందించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి జాతీయ స్థాయికి తీర్చిదిద్దడంలో శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ చేస్తున్న కృషిని ఈ విజయం మరోసారి చాటిచెప్పింది.



ఖోఖోలో నాగసముందర్ విద్యార్థిని సత్తా!

- రాష్ట్రస్థాయి అండర్-17 జట్టుకు సయ్యద్ సనా ఎంపిక
- పదో తరగతి చదువుతూనే క్రీడల్లో ప్రతిభ
- విద్యార్థినికి ఉపాధ్యాయులు, గ్రామస్తుల అభినందనలు

ధారూర్, నవంబర్ 07 (జనంసాక్షి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం క్రీడల్లో ప్రతిభ చాటగలరని నాగసముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సయ్యద్ సనా నిరూపించింది. ఖోఖోలో అద్భుత ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-17 జట్టుకు ఎంపికైంది. క్రీడలపై ఆసక్తి, పట్టుదలతో సాధన చేస్తూ రాష్ట్రస్థాయి జట్టులో చోటు సంపాదించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ రాష్ట్రస్థాయికి ఎదగడం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ విజయం వెనుక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.రమేష్, పీఈటీ రవి, ఉపాధ్యాయ బృందం కృషి ఉందన్నారు. సనాను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



అరుణాచలం, శబరిమలై క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కరీంనగర్ టౌన్, (జన సాక్షి) : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం అరుణాచలం, శబరిమలై పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ తెలిపారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి తమిళనాడులోని అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా అయ్యప్ప భక్తుల కోసం శబరిమలై క్షేత్రానికి కూడా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ బస్సు సర్వీసులకు సంబంధించిన ప్రయాణ వివరాలు, ఇతర సమాచారం కోసం భక్తులు తమ సమీపంలోని ఆర్టీసీ డిపో మేనేజర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రీనర్ సైబరాబాద్ గా సిఎంసి... 300 కొత్త పార్కుల ఏర్పాటుకు కృషి





శేరిలింగంపల్లి, నవంబర్ 07 (జనంసాక్షి) : హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను గ్రీనర్ సైబరాబాద్ గా మార్చడానికి ఒక పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 300 కొత్త పార్కులు, అందులో కొన్నిట్లో వర్క్ ఫ్రమ్ పార్క్ అనే కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టబోతున్నట్లు శనివారం జరిగిన ప్రత్యేక మీడియా సమావేశంలో కమిషనర్ వెల్లడించారు. శేరిలింగంపల్లి పరిధి మసీద్ బండలో 1.5 ఎకరాల పార్క్ ని అభివృద్ధి చేసి ఇందులో కూర్చుని పని చేసుకోవడానికి సీట్లు, కరెంట్ పాయింట్లు, ఫ్రీ వైఫై, సిసి టివి, కాఫీ షాప్, వాకింగ్ ట్రాక్ వంటి వసతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏ పని జరుగుతున్నా అక్కడ బోర్డు పెట్టాలని, దానిమీద పని పేరు, ఎంత ఖర్చు, ఎవరు చేస్తున్నారు, ఎప్పుడు మొదలైంది, ఎప్పుడు అయిపోతుంది, ఫిర్యాదు కోసం క్యూఆర్ కోడ్ ను ఉంచడం జరుగుతుందని, తద్వారా పనుల్లో పారదర్శకత, జవాబు దారి తనం పెరుగుతాయన్నారు. 74 ముఖ్యమైన జంక్షన్లను పునరుద్ధరించడంతోపాటు నడిచే వాళ్లకు సౌకర్యంగా, సురక్షితంగా ఉండేలా ఏర్పాట్లను చేయనున్నట్లు సిఎంసి కమిషనర్ వివరించారు. ఇండియా రేటింగ్స్ సంస్థ సిఎంసి కి ఏ ప్లస్ రేటింగ్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ ఆదాయం బాగుండడంతోపాటు పన్నుల వసూలు కూడా సంతృప్తికరంగా ఉందన్నారు. పిల్లలను జూనియర్ సిటిజన్లుగా గుర్తించడం జరుగుతుందని, యునిసెఫ్ తోకలిసి పని చేయడంతో పాటు స్కూళ్ల దగ్గర సురక్షితమైన దారులు, పార్కులు, బాల సభలు ఏర్పాటు కానున్నాయన్నారు. కొబ్బరి బోండాం చెత్తను డంప్ యార్డ్ కి పంపకుండా రీసైక్లింగ్ కి పంపుతున్నామని, ఈ వ్యవస్థలోకి 644 మంది వ్యాపారులు ఉత్సాహంగా చేరడం జరిగిందని ఇందులో శేరిలింగంపల్లి లో 249, కూకట్ పల్లి లో 235, కుత్బుల్లాపూర్ లో 160 మంది ఔత్సాహికులు ఉన్నారన్నారు. ఇప్పటివరకు నవంబర్ 1వ తేదీనుంచి 6 వరకు 3235 యూనిట్లు సేకరించారని, తిరిగి 8 నవంబర్ నుంచి మళ్ళీ మొదలవుతుందన్నారు.

ఒంటరి వృద్ధురాళ్లే లక్ష్యంగా వరుస హత్యలు!

- తిమ్మాపూర్ జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు
- నలుగురు అరెస్ట్.. మరొకరి కోసం గాలింపు
- ఆభరణాల కోసం ఊపిరాడకుండా చేసి హత్యలు
- నిందితుల నుంచి వాహనాలు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 07 (జనంసాక్షి): ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాళ్లను లక్ష్యంగా చేసుకుని బంగారు, వెండి ఆభరణాల కోసం హత్యలకు పాల్పడిన ముఠా గుట్టును కరీంనగర్ పోలీసులు రట్టు చేశారు. తిమ్మాపూర్ మండలం వచ్చనూర్‌లో జరిగిన రెండు హత్యల కేసులో నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.వచ్చనూర్‌కు చెందిన ఉప్పులేటి భూదమ్మ (103)ను ఆగస్టు 16న ఇంట్లో ఊపిరాడకుండా చేసి హత్య చేసిన నిందితులు ఆమె ఒంటిపై ఉన్న వెండి కడియాలు, బంగారు ముక్కుపుడకను అపహరించారు. వృద్ధాప్యంతో సహజ మరణం సంభవించిందని కుటుంబ సభ్యులు భావించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనలో అనుమానం రాకపోవడంతో అక్టోబర్ 31న అదే గ్రామానికి చెందిన ఉప్పులేటి లక్ష్మి అలియాస్ లచ్చవ్వ (80)ను కూడా ఇదే తరహాలో హత్య చేసి వెండి కడియాలు, బంగారు నల్లపూసల గొలుసు, చెవికమ్మలు దోచుకున్నారు. అపహరించిన ఆభరణాలను కరీంనగర్, హైదరాబాద్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు.
అనుమానాస్పద మృతులపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు అలుగునూరు చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. తిమ్మాపూర్ వైపు నుంచి వస్తున్న స్కూటీపై ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా రెండు హత్యల వివరాలు వెల్లడయ్యాయి. అనంతరం ఎల్కతుర్తి రాజును హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని క్యాన్సర్ ఆసుపత్రి వద్ద అరెస్టు చేశారు.అరెస్టయిన వారిలో వచ్చనూర్‌కు చెందిన మద్దూరి సాయి (24), పోరండ్లకు చెందిన మానుకోల పవన్‌కుమార్ అలియాస్ జాక్ (28), కొత్తపల్లికి చెందిన ఎల్కతుర్తి రాజు (25) ఉన్నారు. మరో నిందితుడు గన్నేరువరం మండలం గుండ్లపల్లికి చెందిన కనపర్తి మణికంఠ (28) పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి టీవీఎస్ జూపిటర్ స్కూటీ, బజాజ్ పల్సర్ బైక్, వెండి కడియాలు, ఐదు సెల్‌ఫోన్లు, ఇనుప గొట్టం, స్టీల్ పట్టుకారు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన రూరల్ ఏసీపీ, తిమ్మాపూర్ సీఐ, ఎల్ఎండీ కాలనీ, గన్నేరువరం, చిగురుమామిడి ఎస్సైలు, పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.



జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
08 నవంబర్ 2026

ముదిరాజ్‌లకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి


- బీసీ-ఏలో చేర్చొద్దు
- 57 అత్యంత వెనుకబడిన కులాల హక్కులకు భంగం కలిగించవద్దు
- బీసీ-ఏ కులాల సమాఖ్య ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన
- ఎమ్మెల్యే మేఘారెడ్డికి వినతిపత్రం



వనపర్తి, నవంబర్ 7 (జనం సాక్షి) : బీసీ-డీ జాబితాలో ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-ఏ జాబితాలో చేర్చే ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని బీసీ-ఏ గ్రూపు కులాల సమాఖ్య వనపర్తి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదన వల్ల ఇప్పటికే అత్యంత వెనుకబడిన బీసీ-ఏలోని 57 కులాల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అవకాశాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం సమాఖ్య ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ ప్రతిపాదనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చకుండా తమ అభ్యంతరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ అనంత రామన్ కమిషన్ సిఫారసులు, వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితుల అధ్యయనం ఆధారంగానే బీసీ కులాలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించారని గుర్తుచేశారు. డీ-నోటిఫైడ్, సంచార, అర్ధ సంచార తెగలతో పాటు రజక, నాయి బ్రాహ్మణ, గంగపుత్ర, బెస్త, వడ్డెర, వాల్మీకి, బోయ తదితర అత్యంత వెనుకబడిన సేవా వృత్తి కులాలు బీసీ-ఏ జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం బీసీ-ఏలోని 57 కులాలకు చెందిన సుమారు 36 లక్షల మంది ప్రజలు ఇప్పటికీ పేదరికం, నిరక్షరాస్యత, ఉపాధి సమస్యలతో సతమతమవుతున్నారని, సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు పొందుతున్న ఈ వర్గాలకు రిజర్వేషన్లే ప్రధాన ఆధారమని వివరించారు. తెలంగాణలో ముదిరాజ్ సామాజిక వర్గానికి 26,39,271 జనాభా, అంటే రాష్ట్ర జనాభాలో 7.43 శాతం ఉన్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారని తెలిపారు. ఇప్పటికే బీసీ-డీ జాబితాలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చడం వల్ల జనాభాపరంగా తక్కువగా ఉన్న, అత్యంత వెనుకబడిన 57 కులాల రిజర్వేషన్ అవకాశాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక సామాజిక వర్గానికి న్యాయం చేసే క్రమంలో మరో 57 కులాల హక్కులకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని, అవసరమైతే చట్టబద్ధమైన విధానంలో రిజర్వేషన్ల పెంపుపై పరిశీలన చేయాలని సూచించారు. అంతేకానీ ఇప్పటికే వెనుకబడిన బీసీ-ఏ కులాల అవకాశాలను దెబ్బతీసేలా నిర్ణయం తీసుకోవద్దని కోరారు. ప్రభుత్వం బీసీ-ఏ కులాల వాస్తవ సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ-ఏ గ్రూపులోని వివిధ కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు, యువకులు, మహిళలు, బీసీ సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంగారెడ్డి పట్టణ అభివృద్ధే లక్ష్యం..

- మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్



సంగారెడ్డి, నవంబర్ 7 (జనం సాక్షి) : సంగారెడ్డి పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని 9వ వార్డు సప్తగిరి కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను, 35వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ మాట్లాడుతూ రూ.55 లక్షల నిధులతో చేపట్టనున్న ఈ పనులతో ఆయా ప్రాంతాల ప్రజలకు మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయి. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దిష్ట సమయంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీలత శ్రీశైలం, నర్సమ్మ ప్రసాద్, సంగీత మహేష్, సతీష్ రెడ్డి, వంశీ, శైలేష్ రెడ్డి, రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు సురేష్, కిరణ్, రమేష్, ఆయా వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై డీఎంహెచ్ఓ సమీక్ష



బెజ్జంకి, నవంబర్ 7 (జనం సాక్షి) : మండలంలోని తొటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. హెచ్. ధనరాజ్ శనివారం తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, ల్యాబొరేటరీ, మందుల నిల్వలను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమై జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ ధనరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందించాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను వందశాతం పూర్తి చేసేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ తేజ, హెచ్ఈఓ శ్రీనివాస్, మధు, వాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి వాకిటి శ్రీహరి



కృష్ణ, నవంబర్ 7 (జనం సాక్షి) : రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి విష యంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ డమే ప్రజాప్రతినిధుల బాధ్యతని స్పష్టం చేశారు. మక్తల్ నియోజకవర్గంలోని గురజాల గ్రామంలో కృష్ణ నుంచి గురజాల వరకు సుమారు రూ. 2.40 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన బీటీ రోడ్డును మంత్రి వాకిటి శ్రీహరి శనివారం ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రజాప్ర తినిధులు, నాయకులు, గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో గురజాల గ్రామానికి రోడ్డు నిర్మాణం పూర్తి చేసిన తర్వాతే గ్రామంలో అడుగుపెడతానని హామీ ఇచ్చానని, ఆ మాట ప్రకారం కేవలం 14 నెలల్లో నే రోడ్డు పనులను పూర్తి చేయించి ప్రజలకు అందు బాటులోకి తీసుకువచ్చా మని మంత్రి తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిలో గురజాల రోడ్డు పనులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. మక్తల్ నియోజకవర్గం చిన్న ప్రాంతమైనప్పటికీ రోడ్లు, ఇతర మౌలిక వస తుల అభివృద్ధికి సుమారు రూ. 35 కోట్ల నుంచి రూ. 40 కోట్ల వరకు నిధులు కేటా యించి పనులను వేగ వంతం చేస్తున్నామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యా లు మెరుగుపడితేనే ప్రజలకు మెరుగైన జీవన ప్రమా ణాలు అందుతాయని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి రాజకీయ వివక్షకు తావులే దని మంత్రి స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అనే తేడా లేకుండా పేదరికమే ప్రామాణికంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లను మంజూరు చేశామ ని తెలిపారు. ప్రజా ప్రభు త్వం ప్రజలందరి ప్రభుత్వ మని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించే నిధులు కూడా ప్రజలు చెల్లించే పన్నుల నుంచే వస్తాయని వివరించారు. రాష్ట్రాల హక్కులు, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ వంటి మహనీయుల విగ్రహాల ఆవిష్కరణలు, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలు చేయడం సమంజసం కాదని మంత్రి అన్నారు. మహనీయుల ఆశయాలను గౌరవిస్తూ, గ్రామాల అభివృద్ధి కోసం వ్యక్తిగత విభేదాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, అభి వృద్ధి, సంక్షేమాన్ని సమాన ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాకి టి శ్రీహరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, స్థానిక నాయకు లు, సంబంధిత అధికారు లు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బైక్ దొంగల ముఠా గుట్టురట్టు

- ముగ్గురు నిందితుల అరెస్టు
- రూ.3 లక్షల విలువైన ఆరు వాహనాలు స్వాధీనం
- హ్యాండిల్ లాక్ వేయని వాహనాలే లక్ష్యంగా చోరీలు



రామచంద్రపురం, నవంబరు 7 (జనం సాక్షి) : ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను రామచంద్రపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3 లక్షల విలువైన ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ సీహెచ్.వై. శ్రీనివాస్‌కుమార్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హసన్‌నగర్, శివరాంపల్లి ప్రాంతాలకు చెందిన సర్ఫరాజ్ (25), మహమ్మద్ గౌస్ (20), సయ్యద్ ముస్తఫా (18) ఒకే కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇంటిముందర మరియు వివిధ ప్రాంతాల్లో హ్యాండిల్ లాక్ వేయకుండా వదిలేసిన ద్విచక్ర వాహనాలను గుర్తించి, మరో బైక్ సాయంతో లాక్కెళ్లేవారు. అనంతరం వాటిని నిర్మానుష్య ప్రాంతాల్లో దాచిపెట్టి విక్రయించేందుకు ప్రయత్నించేవారు. ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో రామచంద్రాపురం పోలీస్ స్టేషన్లో కేసు నంబరు 660/2026 కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. రామచంద్రపురం క్రైమ్ టీమ్ ప్రత్యేక నిఘా పెట్టి నిందితులను పట్టుకున్నారు. చెడు అలవాట్లు, విలాసవంతమైన జీవనశైలికి డబ్బు సమకూర్చుకునేందుకే చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాలు రామచంద్రపురం, పటాన్‌చెరు, సంగారెడ్డి రూరల్, రాజేంద్రనగర్, ఆర్జీఐ విమానాశ్రయ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన చోరీ కేసులకు సంబంధించినవిగా గుర్తించారు. అనంతరం పట్టుబడిన నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించనున్నట్లు తెలిపారు. నిందితులను చాక చక్యంగా పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ జి. లాలూ నాయక్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీకర్‌బాబు, క్రైమ్ సిబ్బందిని అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సమస్య పరిష్కరించాలి

- కరువు మండలాలకు నిధులు కేటాయించాలి
- పేదలకు 14రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డి, నవంబర్ 7 (జనం సాక్షి) : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్ లు కేటాయించాలని,సమస్య పరిష్కరించాలి సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డి సుందరయ్య భవన్ లో సమావేశంలో ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి క్వింటాల్ కు 9500/ రూపాయలు ఇవ్వాలని, కౌలు రైతులను తక్షణమే ఆదుకోవాలని గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. ఎల్లినో కరువు ప్రభావంతోటి పత్తి, వరి, మొక్క జొన్న పంట తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. ఎకరాకు మూడు క్వింటాళ్ళ పత్తి కూడా సరిగా రావడం లేదని అన్నారు. రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి క్వింటాల్ కు 9500 ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కౌలు రైతులు పంట రాక అప్పుల పాలవుతున్నారని అన్నారు తక్షణమే కౌలు రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు సంగారెడ్డి జిల్లాలోని 28 మండలాలకు కరువు నిధులను వెంటనే కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు 14రకాల నిత్యావసర సరుకులు రేషన్ షాప్ ల ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మంచినీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు నర్సిములు, యాదగిరి రాజయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



11న కవయిత్రి మొల్ల విగ్రహ భూమి పూజకు శ్రీకారం

- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి చేతుల మీదుగా భూమి పూజకు కార్యాచరణ సిద్ధం
- భూమి పూజకు కుమ్మరులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలి



వనపర్తి బ్యూరో, నవంబర్ 7 (జనంసాక్షి) : ఈ నెల (నవంబర్) 11వ తేదీన వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే మన కుమ్మర ఇంటి ఆడపడుచు, మహాకవయిత్రి మొల్లమాంబ విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా భూమి పూజకు కుమ్మరులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ కార్యక్రమానికి కార్యాచరణ సిద్ధం చేశారు. 11న జరిగే మొల్ల విగ్రహ భూమి పూజకు జిల్లాలోని కుమ్మరులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరుతూ...శనివారం కొత్తకోట,మదనపురం, ఆత్మకూర్ మండల కేంద్రంలో మండల అధ్యక్షులు సత్యం,మండల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, యువజన సంఘం అధ్యక్షులు మేఘశ్యామ్, మండల అధ్యక్షులు శ్రీనివాసులు, యువజన సంఘం అధ్యక్షులు ఈశ్వర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మన కుల ఐక్యతకు సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నారు.ఈ సందర్భంగా ఈ నెల 11న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే కవయిత్రి మొల్ల మాంబ విగ్రహ భూమి పూజకు జిల్లాలోని కుమ్మరులు,బంధుమిత్రులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై, మన కుల ఐక్యతను, సంఘటిత శక్తిని చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పరుశురాం, సంఘం పట్టణ గౌరవ అధ్యక్షులు బొంబాయి మన్యం కొండన్న, మన్యం, తిరుపయ్య, రవి, నర్సింహా, వాసు, శ్రీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



జడ్చర్ల, నవంబర్ 7 (జనంసాక్షి) : తెలంగాణలో వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. జడ్చర్ల మండలం నాగసాల గ్రామంలో ఎల్ నినో, భూగర్భ జలాలు తగ్గడంతో ఎండిపోయిన పంటలను సీపీఎం బృందం శనివారం పరిశీలించారు. రైతులు ఎకరాకు రూ.30 వేల నుండి రూ.50 వేల అప్పు చేసి పంటలు వేస్తే నీరందక తీవ్రంగా నష్టపోయారని, ఆత్మహత్యలు, వలసలు పెరగకముందే ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఎండిన వరి పంటకు ఎకరానికి రూ.30 వేల ప్రత్తి, కందులు, వేరుశనగ పంటలకు రూ.50వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జిల్, నవాబ్‌పేట, మహమ్మదాబాద్, భూత్పూర్‌తో పాటు మిగిలిన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలన్నారు. స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏ. రాములు, కిల్లె గోపాల్, కురుమూర్తి, దీప్లానాయక్, జగన్, యాదయ్య, సత్తయ్య, సాయిలు, నాగరాజు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 7 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో ఈ నెల 8 న నిర్మించిన సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవానికి ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి విచ్చేయనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీ గా చేపట్టాలని జిల్లా రెవె న్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అధికారులను ఆదేశించా రు.ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా శని వారం కోస్గి పట్టణంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్‌లో ఏఎస్ఎల్ (అడ్వా న్స్‌డ్ సెక్యూరిటీ లైజన్) సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ కొడం గల్ నుంచి కోస్గి పట్టణానికి ముఖ్యమంత్రి ప్రయాణించే రహదారి మార్గంలో ఎలాం టి ఇబ్బందులు తలెత్త కుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించా రు.ముఖ్యంగా ఇరుకైన రహదారులు, కీలక కూడ ళ్లు, రద్దీ ప్రాంతాలను గుర్తిం చి అవసరమైన చోట్ల రహ దారి మరమ్మతులు, పారి శుద్ధ్య పనులు, బ్యారికే డింగ్ తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబం ధిత అధికారులను ఆదే శించారు.ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో రహదారులకు ఇరువైపులా ఎలాంటి అవరోధాలు లేకుండా చూడాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తమకు కేటాయించిన బాధ్యతలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి కొడంగల్ నుంచి కోస్గి పట్టణానికి వచ్చే రహదారి మార్గంలో పటి ష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇరుకైన రోడ్లు, మలుపులు, కూడళ్ల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గంలో ప్రజలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతిని ధులు అనధికారికంగా భద్రతా పరిధిలోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవా లని తెలిపారు. అవసర మైన ప్రాంతాల్లో సెక్యూరిటీ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, ప్రవేశ మార్గాల వద్ద పటిష్ట మైన నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని, అత్య వసర వాహనాల రాకపోక లకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, విజయవం తంగా జరిగేలా అన్ని శాఖ ల అధికారులు పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రియా జ్ హుల్ హక్, ఏ ఎస్ ఎల్ (ఐఎస్ డబ్ల్యు) ఎస్పీ రామచందర్, డీఎస్పీ నర్సిరెడ్డి, నారాయణపేట డీఎస్పీలు నల్లపు లింగ య్య, మహేశ్, కోస్గి తహ సీల్దార్ కల్యాణి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎంపీ డీవో శ్రీధర్, సంబంధిత పోలీసు, రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖల అధికా రులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ ఆరోగ్య లక్ష్యాలను సాధించి
రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలి



- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య

హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (జనంసాక్షి) : హనుమకొండ జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో ఐడిఓసి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ, జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా మాతా శిశు ఆరోగ్య సేవలు ఎం సి హెచ్ పై దృష్టి సారించి, గర్భిణీల ముందస్తు నమోదు, హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం, సాధారణ ప్రసవాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. , చిన్నారులకు అందించే సాధారణ టీకాల వివరాలను యు డబ్ల్యు ఐ ఎన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు తప్పనిసరిగా నమోదు చేయాలని, ఏ ఒక్క అర్హత కలిగిన చిన్నారికి కూడా టీకాలు అందకుండా మిగిలిపోకూడదని సూచించారు. ఎయిడ్స్ నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడం, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మదన్ మోహన్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రజిత, డాక్టర్ కృష్ణా రావు, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ మురళి,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కోలా రాజేష్ కుమార్, వైద్యాధికారులు, సూపర్వైజర్లు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ తాగునీరు అందించేందుకు పటిష్ఠ చర్యలు

- రామప్ప జలాశయంలో ఏడాదికి సరిపడా నీటి నిల్వలు
- రూ.18 కోట్లతో 97 గ్రామాల్లో తాగునీటి సరఫరా బలోపేతానికి ప్రతిపాదనలు
- జిల్లా స్థాయి కమిటీతో తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ
- నవంబర్ 15 నుంచి డిసెంబర్ 30 వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యక్రమం
- తాగునీటిని పొదుపుగా వినియోగించి వృథాను అరికట్టాలి
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు ప్రతినిధి, నవంబర్ 7 (జనంసాక్షి) : ములుగు జిల్లాలో ప్రతి గ్రామానికి తాగునీటిని అందించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాతోపాటు స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితుల వల్ల వర్షపాతం, భూగర్భ జలాలు, ఉపరితల నీటి వనరులపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ ద్వారా గ్రామీణ ఆవాసాలు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి లేదా అవసరమైనప్పుడు సమావేశమై నీటి నిల్వలు, భూగర్భ జలాల లభ్యత, సరఫరా పరిస్థితిని సమీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నీటి కొరత తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. జిల్లాకు ప్రధానంగా రామప్ప జలాశయం, గోదావరి నది నుంచి తాగునీరు అందుతోందని తెలిపారు. రామప్ప జలాశయం ద్వారా ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాల్లోని 152 గ్రామాలకు, ములుగు మున్సిపాలిటీకి మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతోందని వివరించారు. ప్రస్తుతం రామప్ప జలాశయంలో ఒక సంవత్సరానికి సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. గోదావరి నదిపై ఉన్న రెండు ఇంటేక్ వెల్స్, మూడు నీటి శుద్ధి కేంద్రాల ద్వారా తాడ్వాయి, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాలకు తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరాకు ప్రత్యామ్నాయంగా స్థానిక నీటి వనరులను వినియోగిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని 171 గ్రామ పంచాయతీల పరిధిలో 477 ఆవాసాలకు సంబంధించి 1,639 చేతిపంపులు, 810 సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లు, 335 బావులు ఉన్నాయని వివరించారు. 53 గుత్తికోయ గ్రామాల్లో 48 గ్రామాలకు చేతిపంపుల ద్వారా నీటిని అందిస్తున్నామని, మిగిలిన ఐదు గ్రామాల్లో అవసరాన్ని బట్టి ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేసేందుకు రూ.18 కోట్లతో 97 గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల విస్తరణ, కొత్త బోర్లు, పంపుసెట్ల ఏర్పాటు తదితర పనులకు ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల సహకారంతో పంచాయతీ నిధుల ద్వారా ఇప్పటికే 261 చేతిపంపులు, 62 పంపుసెట్లకు మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించామని వివరించారు. భూగర్భ జలమట్టం తగ్గడం, మరమ్మతులు తదితర కారణాలతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన చోట సమీప వ్యవసాయ బావులు, బోర్లను అద్దెకు తీసుకోవడం, బోర్లను ఫ్లషింగ్ చేయించడం, బావుల్లో పూడిక తొలగించడం, ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో మరమ్మతులు, నీటి వనరుల పునరుద్ధరణ పనులు చేపట్టి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 30 వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ రెండో వారంలోగా ఎంపీడీఓల ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత ఏఈఈలు, ఏఈలు, ఎంపీఓలతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించి గ్రామాలవారీగా నీటి సరఫరా పరిస్థితిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఏఈఈలు, ఏఈలు, ఎంపీఓలు, సంబంధిత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో మండల బృందాలను ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యక్రమానికి రోజువారీ కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ అధికారుల పర్యవేక్షణలో సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో గుర్తించిన సమస్యలను రోజువారీగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

ప్రతి పల్లెనూ అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ
- రేగొండ మండలంలో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రేగొండ,నవంబర్ 07(జనం సాక్షి) : భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండల పరిధిలో వివిధ గ్రామాల్లో సుమారు రూ.50 లక్షల విలువైన అభివృద్ధి పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శనివారం శంకుస్థాపనలు చేయడంతో పాటు పలు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి (బి) గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, దుంపిలపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ భవనం, మహిళా సమాఖ్య భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే గుడేప్పల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, గ్రామాల సమగ్ర అభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు పున్నం రవి, ఎంపీడీఓ వేంకటేశ్వర రావు,సర్పంచ్ రాజేందర్ నాయక్,నాయకులు బిక్షపతి,గుండబోయిన రమేష్, భద్రయ్య,వినోద్,రవీందర్ రావు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రిటైల్ రైస్ డిపోలలో తనిఖీలు

వరంగల్ ఎంజీఎం, నవంబర్ 7 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు, వరంగల్ మండల పరిధిలోని ఓల్డ్ బీట్ బజార్ ప్రాంతంలో ఉన్న హోల్‌సేల్ మరియు రిటైల్ రైస్ డిపోలలో జిల్లా పౌర సరఫరాల అధికారి, లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు మరియు ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహశీల్దార్ వరంగల్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా, అన్నీదుకాణాల ముందు ప్రభుత్వం నిర్ణయించిన ధరల వివరాలతో కూడిన ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చెయ్యవలసినదిగా ఆదేశించినారు. మొత్తం (3) దుకాణాలను తనిఖీ చేసి, సంబంధిత రికార్డులు మరియు పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే బియ్యాన్ని విక్రయించాలని, ధరల విషయంలో వినియోగదారుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని దుకాణ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల సందర్భంగా నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి లీగల్ మెట్రాలజీ శాఖ పరిధి లో అధికారులు ఒక కేసు నమోదు చేశారు.

హనుమకొండలో నవచేతన పుస్తక ప్రదర్శన

- ప్రారంభించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (జనంసాక్షి) : పుస్తక పఠనమే మనిషి జీవితాన్ని మారుస్తుందని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య తెలిపారు. కనీసం రోజుకు ఒక పేజీ అయినా చదవడం అలవాటు చేసుకోవాలని, తద్వారా మనిషి జీవన విధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయని పేర్కొన్నారు. హనుమకొండ అశోక కాంప్లెక్స్ లో నవచేతన(విశాలాంధ్ర) బుక్ హౌస్ లో నెలరోజుల పాటు నిర్వహించనున్న పుస్తక ప్రదర్శనను ఎంపీ కడియం కావ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ జాతీయ పుస్తక వారోత్సవాలు, గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా ఈ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. తాను విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి నిరంతరం పుస్తకాలు చదువుతానని, అనేక సార్లు నవచేతన బుక్ హౌస్ ను సందర్శించి పుస్తకాలు సేకరించానని తెలిపారు. ప్రస్తుత కాలంలో పిల్లలు, పెద్దలు టెక్నాలజీ ద్వారా జ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నం చేస్తున్నారని, కానీ హార్డ్ కాపీ ద్వారా చదవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. పుస్తకాలు మనిషి జీవితాన్ని సంపూర్ణంగా మార్చివేస్తాయని, ప్రతి ఒక్కరినీ విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్ది ఉన్నతంగా నిలబెడుతాయని తెలిపారు. మనిషి నిత్య జీవితంలో పుస్తకాలను చదువుకోవడం వల్ల మన పూర్వీకుల జీవితాలను, వారి అనుభవాలను మన జీవితంలో పాటించే అవకాశం ఉందని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య తెలిపారు. నవచేతన ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఏర్పాటు చేసిన ఈ పుస్తక ప్రదర్శనను విద్యార్థులు, పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న ఎంపీ కావ్య నిర్వహకులు ఏర్పాటు చేసిన అనేక పుస్తకాలను పరిశీలించి పలు పుస్తకాలను స్వయంగా కొని తన మిత్రుల చేత కేశవరెడ్డి రాసిన అన్ని పుస్తకాలను కొనాలని కోరడంతో వారు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో నవచేతన గవర్నింగ్ బాడీ సభ్యురాలు నేదునూరి జ్యోతి, బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, రచయిత ఎలుగటి తిరుపతి రెడ్డి, న్యాయవాది బండి మొగిలి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి,మద్దెల ఎల్లేష్, టీయూడబ్ల్యూజె (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్,రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడి పెళ్ళి మధు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. వేణుమాధవ్, సిపిఐ జిల్లా నాయకులు నేదునూరి రాజమౌళి, ఎన్. అశోక్ స్టాలిన్, మునిగాల బిక్షపతి, మాజీ కార్పొరేటర్ మాధవి, రచయితలు విద్యా దేవి, కాసర్ల రంగారావు, పాత్రికేయులు మంచాల రాజు, ఎండి ఉస్మాన్ పాషా, తాండూరి గోపి,కుక్కల రాజు, ఉస్నగిరి శ్రీకాంత్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రసాయన శాస్త్ర జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 7 (జనం సాక్షి) : హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 29, 30 తేదీలలో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సు బ్రోచర్‌ను శనివారం కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య వెంకట్రామారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, ప్రొఫెసర్లు వాసుదేవరెడ్డి, హనుమంతు, మల్లికార్జున్ రెడ్డి, డాక్టర్లు శ్రీదేవి, ఫిరోజ్, మమత, ఉష, వాణిదేవి, సబిత జోష్న, డాక్టర్ దేవేందర్, సతీష్, ఆచార్య రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్లూ కోల్ట్ సిబ్బందికి ఎస్పీ రివార్డ్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): డయల్ 112కు వచ్చిన సమాచారంతో సత్వరం స్పందించి అపస్మారక వ్యక్తికి ప్రథమ చికిత్స అందించిన గణపురం బ్లూ కోల్ట్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించి క్యాష్ రివార్డ్ ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం గణపురం మండలం నగరంపల్లికి చెందిన గుట్టం శ్రీను మూర్ఛతో అపస్మారక స్థితిలో ఉన్నాడని సమాచారం రాగా, బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ పి.సి. మోహన్, హెచ్.జి. రాకేష్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఆపదలో ప్రజలకు అండగా నిలిచే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు.

డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాలి..
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 7 (జనం సాక్షి): వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా కాలేజియేట్ విద్యా అభివృద్ధి, సమీక్ష కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యా ప్రగతి, విద్యార్థుల ప్రవేశాలు, పరీక్ష ఫలితాలు, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఉద్యోగ అవకాశాలు ఉన్నత విద్యలో ప్రవేశాలకు అవసరమైన మార్గదర్శకత్వం కల్పించాలని కోరారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేలా నైపుణ్యాభివృద్ధి కోర్సులు నిర్వహించడం, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ, ఉన్నత విద్యపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లో స్ఫూర్తి కార్యక్రమాలు నిర్వహించి, క్యాంపస్ ప్లేస్‌మెంట్లను ప్రోత్సహించడం వంటి అంశాలపై సమీక్షించారు. అలాగే జిగ్నాసా విద్యార్థి పరిశోధన ప్రాజెక్టులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఎన్‌పీటీఈఎల్, స్వయం వంటి కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం అవ్వాలని, కళాశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, బాలికల వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, భవనాల మరమ్మతుల అవసరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ కాలేజీ లో పిల్లల హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలని అందుకు ఫేస్ రికగ్నైజ్ అటెండెన్స్ అమలు చేయాలను సంబంధిత ప్రిన్సిపల్స్ ను ఆదేశించారు. వరంగల్ సీకేఎం, వర్ధన్నపేట డిగ్రీ కళాశాల, రంగసాయిపేట్, నర్సంపేట డిగ్రీ కళాశాలకు ప్రత్యేక అధికారులను కేటాయించి యాజమాన్య నిర్వహణ,కళాశాల పర్యవేక్షణలో భాగంగా ప్రత్యేక అధికారులను నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కళాశాలల్లో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు విధానం అమలు తీరును, అక్టోబర్ నెల హాజరు వివరాల పై సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు కళాశాలల వారీగా అవసరమైన చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్ ,జిల్లా కాలేజియేట్ విద్యా అభివృద్ధి కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ మల్లం నవీన్, మరియు సభ్యులు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ ,సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దళారులు, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు

- జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ , నవంబర్ 7, (జనం సాక్షి) : జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద పొరుగు సేవల ప్రాతిపదికన చేపట్టనున్న అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడీ ఆయా పోస్టులు, వైద్య ఆరోగ్య శాఖ లో భర్తీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల భర్తీ విషయంలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశ చూపే దళారులు, మధ్యవర్తుల మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టులు వైద్య ఆరోగ్య శాఖ లోభర్తీకి సంబంధించి దరఖాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థి వివరాలను సంబంధిత శాఖ అధికారులు నిర్ణీత నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలిస్తారని, అభ్యర్థులు సమర్పించిన విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలు, సంబంధిత అర్హతలను పరిశీలించిన అనం తరం ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగు ణంగా ఎంపిక ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పోస్టుల భర్తీలో ఎలాంటి అవకతవకలకు, సిఫార్సులకు, అక్రమ పద్ధతులకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అభ్యర్థుల అర్హతలు, సమర్పించిన ధ్రువపత్రాలు, వర్తించే నిబంధనల ఆధారంగానే ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని, ఎవరికీ ప్రత్యేక ప్రాధాన్యత, అనధికారికంగా ఉద్యోగం కల్పించే అవకాశం ఉండదని తెలిపారు. ఎంపిక జాబితాలో పేరు వచ్చేలా చేస్తామని చెప్పి, అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, వ్యక్తిగతంగా సంప్రదించి ప్రలోభాలకు గురిచేసినా వారి మాటలు నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు, సేవా ప్రాతిపదికన చేపట్టే పోస్టుల భర్తీలో దళారులు, మధ్యవర్తుల ప్రమేయానికి ఎలాంటి అవకాశం లేదని, అభ్యర్థులు తమ అర్హతలు, సమర్పించిన దరఖాస్తులపై మాత్రమే ఆధారపడాలని, పోస్టుల భర్తీకి సంబంధించి ఏవైనా సందేహాలు, సమాచారం అవసరమైనప్పుడు సంబంధిత మహిళా, శిశు సంక్షేమ శాఖ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను నేరుగా సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అధికారుల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని, సోషల్ మీడియా, ఇతర అనధికారిక మార్గాలలో ప్రచారమయ్యే తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా మహిళలు, చిన్నారులకు అందించే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య తదితర సేవలు మరింత సమర్థవంతంగా అందించడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాల పాత్ర ఎంతో కీలకమని, ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

నకిలీ వైద్యులపై మెడికల్ కౌన్సిల్ కొరడా



వరంగల్ ఈస్ట్, నవంబర్ 07 (జనం సాక్షి) : ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, సరైన వైద్య అర్హతలు లేకుండానే డాక్టర్లుగా చలామణి అవుతూ అల్లోపతి వైద్యం నిర్వహిస్తున్న వారిపై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ కఠిన చర్యలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌కు చెందిన డాక్టర్ కె.యు.ఎన్. విష్ణు, డా అన్వర్ మియా లతో కూడిన తనిఖీ బృందం 2026 ఆగస్టు 5వ తేదీన వరంగల్‌లోని ఉర్సు ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, నాలుగు అక్రమ వైద్య కేంద్రాలను గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించారు.

ఉర్సు జగీర్‌కు చెందిన ఎస్.జయలక్ష్మి క్లినిక్ నిర్వాహకుడు చిట్యాల సిద్దేశ్వర్‌ను, ఉర్సు మెయిన్‌రోడ్‌కు చెందిన అన్విక్ష ఫార్మసీ నిర్వహకుడు గాదె శివశంకర్‌ను, ఉర్సు బొడ్రాయి కరీమాబాద్ రోడ్‌కు చెందిన ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు గడ్డం హరీష్‌ను, ఉర్సు బొడ్రాయికి చెందిన ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ నిర్వహకుడు గడ్డం శ్రీనివాస్‌లపై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ దండెం లాలయ్య కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ ఐ ఆర్ నెంబర్ 832/2026, 06-11-2026న కేసు నమోదు చేశారు. అనధికారిక వైద్య కేంద్రాలు లేదా నకిలీ వైద్యుల గురించి సమాచారం తెలిసినట్లయితే తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నెంబర్ 9154382727 కు ఫిర్యాదు వాట్సాప్ ద్వారా చేయాలని సూచించారు.

రామప్పలో విదేశీయుల సందడి



వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 07(జనంసాక్షి): వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయంను శనివారం అమెరికా,రష్యా దేశస్థులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాగా, వారికి ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ లు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం రామప్ప దేవాలయం చరిత్ర ను, శిల్పకళా వైభవాన్ని టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ వారికి వివరించారు వారి వెంట ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్ టూరిస్ట్ పోలిసులు అరుణ్ కుమార్, శ్రీనివాస్ ,శ్రీకాంత్, భద్రు, దశరథ్ దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
08 నవంబర్ 2026

పీఎంశ్రీ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

- సకాలంలో నాణ్యతతో పనులను పూర్తి చేయించాలి
- పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (జనం సాక్షి) : ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకం కింద మంజూరు చేసిన నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఈ నిధులతో సకాలంలో నాణ్యతతో పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకులాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, ఎం.ఈ.ఓలు, మండల స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్లే గ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, సోక్ పిట్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ తదితర పనుల పురోగతిని పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేశారు. పలు పాఠశాలల్లో చక్కగా పనులు జరిగాయని, మిగతా బడులలో కూడా మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వెచ్చిస్తూ వేగంగా పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలన్నారు. వచ్చే వారం నాటికి అన్ని బడులలో 50 శాతంకు పైగా నిధుల వెచ్చింపు పూర్తి కావాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను ట్రెజరీలో సమర్పించాలని సూచించారు. తాము ట్రెజరీ అధికారులను సంప్రదించి, పూర్తయిన పనులకు సంబంధించిన నిధులు వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శిస్తూ పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఎం.ఎస్.ఓలను, హెచ్.ఎంలకు సూచించారు. సకాలంలో పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని, పనులను వేరే వారికి కేటాయిస్తామని అన్నారు.విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అనుగుణంగానే మౌలిక సదుపాయాల మెరుగుదల, నాణ్యమైన విద్యా బోధన జరిగేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో ముఖ గుర్తింపు విధానం(ఎఫ్.ఆర్.ఎస్) ద్వారానే హాజరు ప్రక్రియ అమలు జరగాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈ.ఈ రవీందర్, మండల ప్రత్యేక అధికారులు, ఎం.ఈ.ఓలు, తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా వివాదంలో ఉన్న రైతుల దారి సమస్యకు పరిష్కారం

- ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి చొరవతో రైతులకు రహదారి సౌకర్యం



మర్రిగూడ, నవంబర్ 7 (జనం సాక్షి) : క్షేత్రస్థాయి పర్యటనలో రైతుల సమస్యను గుర్తించిన ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తక్షణమే స్పందించి పరిష్కారం చూపారు. మర్రిగూడ మండలం సరంపేట గ్రామపంచాయతీ పరిధిలోని సరంపేట తండాలో రెండేళ్లుగా కొనసాగుతున్న దారి వివాదానికి అధికారుల సమన్వయంతో ముగింపు పలికారు. దీంతో సుమారు 14 మంది రైతులకు చెందిన 25 ఎకరాల భూములకు రాకపోకల మార్గం అందుబాటులోకి వచ్చింది. సర్వే నంబర్ 330 పరిధిలోని రైతులకు ఉన్న దారిలో ఇటీవల బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో రైతులు రమావత్ మురళి శ్రీనివాస్‌కు చెందిన పట్టా భూముల మీదుగా వెళ్లాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో భూమి యజమాని అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం కొనసాగుతూ వచ్చింది. మండల పర్యటనలో సమస్యను గుర్తించిన ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇరువర్గాల అభిప్రాయాలను తెలుసుకుని, చండూరు ఆర్డీవో శ్రీదేవి, మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకున్నారు. అధికారుల చొరవతో ఇరువర్గాల మధ్య సమస్య పరిష్కారమై రైతులకు దారి వినియోగం సులభతరమైంది. రెండేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యను గుర్తించి, తక్షణమే స్పందించిన ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- కళ్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



భద్రాచలం, నవంబర్ 7 (జనంసాక్షి) : అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలం పట్టణంలోని రైతు వేదిక వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన 36 చెక్కులతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు స్వయంగా చెక్కులు, రేషన్ కార్డులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, ఎమ్మార్వో రవికుమార్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

13న అదాలత్-కమ్- వర్క్‌షాప్ నిర్వహణ

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 7 (జనం సాక్షి) : పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్), అకౌంట్స్ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13వ తేదీన (శుక్రవారం) కలెక్టరేట్ (ఐడీఓసీ)లో పెన్షన్-జీపీఎఫ్ అదాలత్- కమ్-వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు ప్రారంభ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ కేసుల పరిష్కారం, పెన్షనర్ల సమస్యల పరిశీలన, ఉద్యోగులకు పెన్షన్ ప్రతిపాదనలను సకాలంలో సమర్పించే విధానంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఏసీ బిల్లులు, పెండింగ్ వోచర్లు, ట్రెజరీ తనిఖీ అభ్యంతరాలు, చెల్లించిన చెక్కులకు సంబంధించిన వివరాలు, జీపీఎఫ్ పెండింగ్ అంశాలను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.
జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, శాఖాధిపతులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు), జిల్లా ట్రెజరీ అధికారులు, సబ్ ట్రెజరీ అధికారులు తమ సంబంధిత సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.
పెండింగ్‌లో ఉన్న పెన్షన్ ఫైళ్లు, సర్వీస్ బుక్కులు, జీపీఎఫ్ తుది చెల్లింపు దరఖాస్తులు, సమర్పించాల్సిన వోచర్లు, పెండింగ్ ఏసీ బిల్లుల క్లియరెన్స్ వివరాలు, ట్రెజరీ తనిఖీ అభ్యంతరాలకు సంబంధించిన అనుసరణ నివేదికలు తదితర అవసరమైన రికార్డులన్నింటినీ వెంట తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. తద్వారా సాధ్యమైనంత వరకు సమస్యలను కార్యక్రమంలోనే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్హులైన పెన్షనర్లకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్లు (పీపీఓలు), జీపీఎఫ్ చందాదారులకు జీపీఎఫ్ ఆథరైజేషన్ లేఖలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని పెన్షనర్లకు, ఉద్యోగులకు ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పించాలని, స్థానిక పెన్షనర్ల సంఘాలకు సమాచారం అందించి, సమస్యలు ఉన్న పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ముర్రేడు వాగు ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే కూనంనేని పర్యటన



కొత్తగూడెం, నవంబర్ 7 (జనం సాక్షి) : అధికారులతో కలిసి ముర్రేడు రిటైనింగ్ వాల్ మార్గాలను పరిశీలించి మంజూరైన నిధులతో నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేస్తామని త్వరలోనే రక్షణ గోడ పనుల ప్రారంభిస్తాం అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెప్పారు. ముర్రేడు వాగు వరద ముంపునకు శాశ్వత పరిష్కారంగా రక్షణ గోడ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ముర్రేడు వాగుపై రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 50.50 కోట్ల నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో శనివారం ఆయన సంబంధిత శాఖ అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి వాగు పరివాహక ప్రాంతాల్లో విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. శ్రీనగర్, ప్రశాంతి నగర్, సాయినగర్ తదితర ముంపునకు గురయ్యే లోతట్టు కాలనీలను, వాగు పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు క్షేత్రస్థాయిలో పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పాలకులు ఈ దీర్ఘకాలిక సమస్యను పూర్తిగా విస్మరించడంతో ఏళ్ల తరబడి భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, శ్మశాన వాటికలకు వెళ్లే మార్గాలు సైతం మునిగిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ప్రజల కష్టాలను స్వయంగా చూసి, ముంపు సమస్యకు రక్షణ గోడ నిర్మాణమే పరిష్కారమని భావించి మూడేళ్లుగా నిరంతరం పట్టుబట్టి రూ. 50.50 కోట్ల నిధులను రాబట్టామని వివరించారు. ఎస్టిమేషన్ల ప్రకారం పనుల్లో రాజీ పడకుండా, పటిష్టమైన సాంకేతిక ప్రమాణాలతో రక్షణ గోడ నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. త్వరలోనే పనులకు శ్రీకారం చుట్టి బాధితులకు వరద భయాల నుంచి పూర్తి విముక్తి కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి రాజీలేని రీతిలో నిరంతరం శ్రమిస్తానని ఆయన పునరుద్ఘాటించారు. కూనంనేని వెంట నాయకులు నేరెళ్ళ రమేష్, లగడపాటి రమేష్, చౌదరి, మిరియాల రాము, అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రజలందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్



ఖమ్మం, నవంబర్ 7 (జనం సాక్షి) : ఖమ్మం జిల్లా ప్రజలందరికీ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగులు ప్రసరించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కోరారు.

ఏజెన్సీ ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య దీపావళి జరుపుకోవాలి

- గిరిజనులు, విద్యార్థులు, ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు.
- ఐటీడీఏ పీవో బి రాహుల్.



భద్రాచలం, నవంబర్ 7 (జనంసాక్షి) : సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే పండుగలను ప్రజలందరూ ఐకమత్యంతో జరుపుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆకాంక్షించారు. జాతి, మత, వర్గ విభేదాలకు అతీతంగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే దీపావళి పర్వదినాన్ని ఏజెన్సీ ప్రాంత ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో కోరారు. చీకటిని పారదోలుతూ వెలుగులు నింపే దీపావళి విజయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. నరకాసురుడి సంహారం అనంతరం ప్రజలు ఆనందంతో దీపావళి జరుపుకున్నారని, అలాగే రావణ సంహారం తర్వాత శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నారని వివరించారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ గిరిజన కుటుంబాలు కూడా ఈ పండుగను ప్రత్యేకంగా, ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులతో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఏజెన్సీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ వేళ పిల్లలు టపాసులు, బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో దీపావళి సంతోషాలు, వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

విపత్తుల వేళ ప్రాణాలకు తెగించి సేవలందించిన సిబ్బందికి ఘన సన్మానం



భద్రాచలం, నవంబర్ 7 (జనంసాక్షి) : విపత్తులు సంభవించిన సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేసిన సిబ్బంది సేవలు అభినందనీయమని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అన్నారు. విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ ప్రజలకు అండగా నిలిచిన వారిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గోదావరి వరదలు, భారీ వర్షాలు, శ్రీరామనవమి, ముక్కోటి, గణేశ నిమజ్జనం, దుర్గామాత విగ్రహాల నిమజ్జనం వంటి సందర్భాల్లో ప్రజల భద్రత కోసం నిరంతరం సేవలందించిన వివిధ శాఖల ఫ్రంట్‌లైన్ సిబ్బందిని శనివారం తన కార్యాలయంలో సబ్ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈతగాళ్లు కుమ్మర సత్యనారాయణ, కారుకు ప్రసాద్, పారిశుధ్య కార్మికులు సుడాల కౌసల్య, సామంతుల పుష్ప, ఏఎంసీ కాలనీ సబ్‌సెంటర్ ఆశా కార్యకర్త గొరైముచ్చు రమాదేవి, హోంగార్డు పానుగంటి రమేష్‌తో పాటు అగ్నిమాపక కేంద్ర సిబ్బందిని సన్మానించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో గోదావరి వరదలు ఎప్పుడు, ఏ స్థాయిలో వస్తాయో అంచనా వేయలేని పరిస్థితుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షితంగా కాపాడటంలో వారి సేవలు కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి నిస్వార్థ సేవాభావంతో ప్రతి ఒక్కరూ విధులు నిర్వహిస్తే విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను గణనీయంగా నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ భగవాన్ రెడ్డి, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలి



అల్లాదుర్గం, నవంబర్ 7 (జనంసాక్షి) : దళారులను నమ్మి మోసపోవద్దనీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులు ధాన్యం విక్రయించాలని అల్లాదుర్గం ఏపిఎం రుక్మిణి తెలిపారు. శనివారం మండల పరిధిలోని గడిపెద్దపూర్ లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషా రెడ్డి ,డిసిసి జిల్లా కార్యదర్శి బాలకిషన్, జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ ఉపాధ్యక్షుడు బలరాం, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సాయి బాబా, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అభిలాష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ విట్టల్ రెడ్డి,ఉప సర్పంచ్ నిర్మల శ్రీశైలం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మహాదేవ్ రైస్ మిల్లులో తనిఖీలు

- ప్రభుత్వానికి 12 కోట్ల మేర కుచ్చుటోపి



పెన్‌పహాడ్, నవంబర్ 7 (జనం సాక్షి) : ప్రభుత్వానికి అందించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యాన్ని అప్పగించకుండా ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లు పై సివిల్ సప్లై అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ ఘటన మండలంలోని అనంతరం ఎక్స్ రోడ్ సమీపంలో ఉన్న మహాదేవ్ రైస్ ఇండస్ట్రీస్ లో జరిగింది. అధికారుల వివరాల ప్రకారం సదరూ రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యాన్ని కి సంబంధించి ప్రభుత్వానికి సుమారు 3919.686 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ బియ్యం తిరిగి అప్పగించాల్సి ఉండగా దానిని ప్రభుత్వానికి అందించకుండా మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ధాన్యం విలువ సుమారు 12 కోట్ల వరకు ఉంటుందని అంచనా, ఈ వ్యవహారంపై సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీధర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు మిల్లు యజమానులైన సూర్యాపేటకు చెందిన కేక్కిరేణి నాగయ్య, ఆయన కుమారుడు కెక్కిరేణి శివ సంకీర్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలునాయక్ తెలిపారు.

గంజాయి రవాణా విక్రయం వినియోగంపై కఠిన చర్యలు

- 1500 గ్రాముల గంజాయి స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- ఒడిశా సరిహద్దు నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయించేందుకు యత్నం
- సూర్యాపేట టౌన్ సీఐ వెంకటయ్య



సూర్యాపేట, నవంబర్ 7 (జనంసాక్షి) : గంజాయి అక్రమ రవాణా, వినియోగం, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సూర్యాపేట టౌన్ సీఐ వెంకటయ్య తెలిపారు.శనివారం సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట టూ టౌన్ పోలీసులు 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.మరో ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ రామచంద్ర గౌడ్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం పట్టణంలోని చివ్వెంల రహదారిపై అమ్మ గార్డెన్ సమీపంలో తనిఖీలు నిర్వహించారు.ఈ సమయంలో పోలీసులను గుర్తించిన ఇద్దరు ప్రధాన నిందితులు పరారయ్యారు.గంజాయి తీసుకునేందుకు అక్కడికి వచ్చిన మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న 1500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల విచారణలో ప్రధాన నిందితులైన బొంత అవినాష్, సోమపంగు నాని వర్ధన్ ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చేందుకు వెళ్లినట్లు, అరెస్టయిన నలుగురు వారికి డబ్బులు సమకూర్చినట్లు తెలిపారు.గంజాయిలో కొంత వినియోగించుకుని, మిగిలినది విక్రయించి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వారు ఈ వ్యవహారంలో పాల్గొన్నట్లు గుర్తించారు.రూపాని సందీప్, బొడ్డు భరత్, పులుసు సాయి విశాల్ గౌడ్, శీలం శ్రీకాంత్ లింగయ్య అరెస్టు చేసినట్లు తెలిపారు.పరారీలో ఉన్న ప్రధాన నిందితులు బొంత అవినాష్, సోమపంగు నాని వర్ధన్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు తెలిపారు.ఈ కేసులో నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.గంజాయి వినియోగం యువత ఆరోగ్యాన్ని, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు.గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు, వినియోగం చట్టరీత్యా నేరమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ రామచంద్ర గౌడ్,హెడ్ కానిస్టేబుళ్లు శ్రీరాములు,జి.వీరయ్య, అజ్గర్ అలీ, రామనర్సయ్య, కానిస్టేబుల్ కొండా రమేష్, నవీన్ ను పోలీసు అధికారులు అభినందించారు.

పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా

రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు..

ప్రస్తుత కార్యకలాపాలపై ఆరా

నేరాల నియంత్రణే లక్ష్యంగా

నిరంతర తనిఖీలు

తరచూ నేరాలకు పాల్పడితే

ఉపేక్షించేది లేదు : ఎస్పీ మహేష్ బి.గితే



రాజన్న సిరిసిల్ల బ్యూరో(జనంసాక్షి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పాత నేరస్థులపై జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి వేళల్లో పాత నేరస్థుల వద్దకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా పాత నేరస్థులు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు,ఏం చేస్తున్నారు,వారి ప్రస్తుత కార్యకలాపాలు ఏమిటి, ఎవరితో సంబంధాలు కలిగి ఉన్నారు అనే విషయాలపై పోలీసులు ఆరా తీసి,తిరిగి నేరాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలలో భాగంగా కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...జిల్లాలో గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవరైనా తిరిగి నేరాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్, ఆకస్మిక తనిఖీలు చేపడుతూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు..

గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్..

గోదావరిఖని, జనంసాక్షి :దీపావళి పండుగ నేపథ్యంలో గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో బాణసంచా విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా చట్టపరమైన నిబంధనలు పాటించాలని, జనావాసాలు, ప్రజలు సంచరించే ప్రాంతాల్లో క్రాకర్స్ విక్రయాలకు అనుమతి లేదని ఎవరైనా అమ్మినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గోదావరిఖని ఏసిపి ఎం. రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి పండుగ నేపథ్యంలో తాత్కాలిక, పర్మినెంట్ క్రాకర్స్ షాపులు నిర్వహించే వారు సంబంధిత అధికారుల నుంచి తాత్కాలిక లేదా శాశ్వత లైసెన్స్, అనుమతులు పొందిన వారు మాత్రమే బాణసంచా విక్రయించాలి. ప్రమాద నివారణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.క్రాకర్స్ విక్రయ కేంద్రాల్లో అనుమతులు, భద్రతా ఏర్పాట్లను పోలీసులు తనిఖీ చేస్తారని నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈ తనిఖీల్లో గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణకుమార్ గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రసాదరావు, మంథని సిఐ బుద్దె స్వామి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ల పరిధిలో తనిఖీ లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన ప్రాధాన్యత. దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకునేలా వ్యాపారులు నిబంధనలు పాటించి పోలీస్ శాఖకు సహకరించాలని ఏసీపీ కోరారు.

ఇంటింటా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'

కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి • అధికారులతో సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి): నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆర్థిక తోడ్పాటును అందిస్తూ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తి అయిన గృహాలలో దీపావళి పండుగను పురస్కరించుకుని 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం ఈ కార్యక్రమం అమలు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశమై సూచనలు చేశారు. ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లలో దీపావళి పండుగ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి దివ్వెలు వెలిగించి, ప్రత్యేక సంబురాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు తమ సొంత ఇంటిలో తొలి దీపావళి వేడుకను ఆనందోత్సాహంతో జరుపుకునేలా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబించేలా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి హౌసింగ్ పీ.డీ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, ఎం.ఎస్.ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి, అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ తదితరులు ఉన్నారు.



చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి

- దీపాల కాంతులవలె ప్రతి ఇంటా వెలుగులు నిండాలి
- ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



సూర్యాపేట(జనంసాక్షి): చీకటిని పారద్రోలే వెలుగుల పండుగ దీపావళి అని, దీపాల కాంతులవలె తెలంగాణలోని ప్రతి ఇంటా వెలుగులతో నిండాలని ఆకాంక్షిస్తూ దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరికీ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిని పారద్రోలే వెలుగుల పండుగగా దీపావళి పండుగను జరుపుకుంటామని అన్నారు.నరకాసుర వదతో దీపావళి పండుగ జరిగినట్లు మన తెలంగాణలోనూ చీకట్లు తొలగి మళ్లీ అభివృద్ధితో వెల్లివిరియాలన్నారు.అగ్ని కొలువైన దీపాల వెలుగులు మనలో అజ్ఞానాంధకారాన్ని తొలగించి, చైతన్యాన్ని రగిలించి బంగారు తెలంగాణ సాధనలో నూతనోత్తేజంతో ముందడుగు వేయాలన్నారు.అలాగే బాణసంచా పేల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పూజలకు ప్రత్యేకమైన కార్తీక మాసంలో చేసే పూజలు ఫలించాలని ఆయన ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల చెంతకే ఎమ్మెల్యే బాలు నాయక్..

- సమస్యల పరిష్కారమే లక్ష్యం
- పి.ఏ.పల్లి మండలంలో విస్తృత పర్యటన
- మహిళా సమాఖ్య భవనాల ప్రారంభం, పంచాయతీ భవనాలకు భూమిపూజ..
- ప్రజల సమక్షంలోనే అధికారులకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

పి.ఏ.పల్లి (జనంసాక్షి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా,గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పి.ఏ.పల్లి మండలంలో శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాలను ప్రారంభించడంతో పాటు నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు భూమిపూజ చేసి శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుంటూ,అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చొరవ చూపారు. మండలంలోని అంగడిపేట గ్రామంలో మహిళా సమాఖ్య భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రాంపురం గ్రామ పరిధిలోని నేనావత్ తండాలో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించి రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను అడిగి తెలుసుకొని,వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పిల్లిగుండ్ల తండాలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.13 లక్షల నిధుల మంజూరు విషయమై జిల్లా కలెక్టర్‌తో ప్రజల సమక్షంలోనే ఫోన్ ద్వారా మాట్లాడారు.పనులు త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు .గ్రామంలోని ఇతర సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని అధికారులతో మాట్లాడారు.అనంతరం మాదారిగూడెం గ్రామంలో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించి,నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా రంగారెడ్డి గూడెంస్టేజీ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రజల సమక్షంలోనే ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి ,ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎం హామీ ఇచ్చారు.అనంతరం పిల్లిగుండ్ల తండాలో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించి,నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారత, రైతుల సమస్యల పరిష్కారం,పేదలకు సంక్షేమ పథకాలు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చే ప్రతి సమస్యను అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నెర్మటి సతీష్ రెడ్డి, డిసిసి జిల్లా కార్యదర్శి కుక్కల గోవర్ధన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు వీరబోయిన ఎల్లయ్య యాదవ్,డి సి సి జిల్లా సహాయ కార్యదర్శి మద్దిమడుగు రామస్వామి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అలుగుబెల్లి వెంకటేశ్వర్ రెడ్డి,మాజీ ఎంపీపీలు తేర సత్య నారాయణ రెడ్డి,వంగాల ప్రతాప్ రెడ్డి,సూర్య హాస్పిటల్ ఎండి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పాల్వాయి వెంకట్ రెడ్డి,బోడ్య నాయక్, తూటిపల్లి నగేష్,మావిల్ల లక్ష్మీనారాయణ,సర్పంచులు రమావత్ చిరంజీవి,వంగాల శ్రీనివాస్ రెడ్డి,నేనావత్ అనిత లక్ష్మణ్ నాయక్,ఇస్లావత్ బుజ్జి నాగు నాయక్,రాగం అంజయ్య లతో పాటు ఉపసర్పంచులు,సంబంధిత అధికారులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే కుంభం



వలిగొండలో కోతుల బెడద నివారణకు తక్షణ చర్యలు

వలిగొండ (జనంసాక్షి): మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు శనివారం పలు సమస్యలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వివరించారు గ్రామాలలో నెలకొని ఉన్న సమస్యలను ఓపికగా విని అక్కడికక్కడే కొన్ని సమస్యలను పరిష్కరించారు ముఖ్యంగా అభివృద్ధికి సంబంధించి పలు గ్రామాల నుండి వినతి పత్రాలను సమర్పించారు అందులో భాగంగా మండలంలోని దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లుఎమ్మెల్యేను కలిసి గ్రామానికి కావాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి వివరించడం జరిగింది గ్రామానికి గౌడ సంఘం భవన నిర్మాణానికి ఇంకా అంగన్వాడి భవనం సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా అందుకు సానుకూలంగా స్పందించారు త్వరలో గ్రామానికివాటర్ ప్లాంట్ ను కూడా అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారుఅదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కరమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని అందులో భాగంగా నే భువనగిరి నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్న దశలవారీగా పరిష్కరించడం జరుగుతుందని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు ఇంకా వలిగొండ మండల కేంద్రంలో కోతుల బెడద అత్యధికంగా ఉండి వాటి దాడితో కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే కోతుల నివారణకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ ,మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు ,సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి ,నాయకులు గంగాపురం సతీష్ గౌడ్, బత్తిని లింగయ్య, పలుసం సతీష్ ,కాసుల వెంకన్న,సాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వైద్య సేవలు, మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష



హుజూర్‌నగర్(జనంసాక్షి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కొనసాగుతున్న వైద్య సేవలు, వివిధ విభాగాల పనితీరు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.అనంతరం డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బందితో సమావేశమై ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వసతులు, వైద్య సేవల నిర్వహణ, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై చర్చించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. హాస్పటల్లో జరిగే పని గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ల కొరత గురించి కూడా డి సి హెచ్ ఎస్ వెంకటేశ్వర్లు, డాక్టర్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. త్వరలోనే పరిష్కారం చేస్తామని అన్నారు. ప్రభుత్వం బాలికల పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. రామస్వామి గట్టు సమీపంలో ఉన్న 2160 సింగిల్ బెడ్ రూమ్ ఇండ్లు ను గురించి ఆర్డిఓ ఎమ్మార్వో లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీనివాసులు, ఎమ్మార్వో నాగేందర్, సి సి హెచ్ ఎస్ వెంకటేశ్వర్లు, డాక్టర్స్ నక్క రవి, యోగేందర్, డాక్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్ లోకి దూసుకెళ్లిన వడ్ల లారీ

బోధన్ (జనంసాక్షి): బోధన్ బైపాస్ వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్ల లోడుతో వెళ్తున్న ఓ లారీ బ్రేకులు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న హోటల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో రెండు బైకులు ధ్వంసం అయ్యాయి.




నిద్రమత్తులో నిఘా..!

నేరాలకు అడ్డగా గాంధారి

పనిచేయని సీసీ కెమెరాలు

పోలీసుల వైఫల్యమే కారణమంటూ ఆరోపణలు





గాంధారి(జనంసాక్షి): రోజురోజుకు పెరిగిపోతున్న దొంగతనాలు హత్యలు జరుగుతుండడంతో మండల కేంద్రం భయం గుప్పెట్లో బిక్కు బిక్కు మంటుంది. వివరాల్లోకి వెళితే గాంధారి మండలంలో జరుగుతున్న నేరాలపై గ్రామస్తులు పోలీసులు వైఫల్యం నిఘా వైఫల్యం కారణమే అంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.గాంధారి మండల కేంద్రంలో 20 రోజుల క్రితం ఏటీఎం చోరీ దాదాపు 25 లక్షల పైన డబ్బులతో ఉడాయించిన విషయం తెలిసిందే అయితే ఈ సంఘటన మర్చిపోకముందే నవంబర్ 6 శుక్రవారం అర్ధరాత్రి ఒక యువతిని అతి కిరాతకంగా హత్య చేయడంతో ఒక్కసారిగా మండల కేంద్రంలో ఉలిక్కి పడింది. నేరాల నియంత్రణపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు నిఘా వ్యవస్థ ఎంతవరకు పనిచేస్తోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నేరాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన నిఘా వ్యవస్థ నామమాత్రంగా మారిందా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి

పనిచేయని సీసీ కెమెరాలు

ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానమని భావించే పోలీసులు అలాంటి సీసీ కెమెరాలు పట్టించుకోవడంపై పలు ప్రశ్నలు రేకెత్తున్నాయి. గ్రామస్తులంతా ఏకమై అధిక సంఖ్యలో డబ్బులు అందరూ తల వంతుగా చేయి వేసుకొని మన ఊరి బాగు కోసమని నిఘా నేత్రాలు పెట్టిస్తే కనీసం వాటి పర్యవేక్షణ కూడా కరువైంది.గాంధారి మండల కేంద్రంలో ప్రజలు వ్యాపారస్తులు దాతలు రాజకీయ నేతలు అందరి స్వయం సహకారంతో దాదాపు 45 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. 45 సీసీ కెమెరాలు ఉండడంతో ఏ మూలన ఏం జరిగినా ప్రతి ఒక్కటి సంఘటన ఎక్కడ ఏం జరిగినా పోలీస్ స్టేషన్ కు అనుసంధానం చేసి ఉండేది. అయితే ఇందులో దాదాపు పదికి పైగా కెమెరాలు పనిచేయకపోవడంతో నిఘా నేత్రాలను నిర్లక్ష్యంలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, పోలీసుల నిఘా వ్యవస్థ నేరాల నియంత్రణకు ఎంతవరకు ఉపయోగపడుతున్నా యనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, నేరం జరగకముందే గుర్తించి అడ్డుకునే విధంగా పోలీసు యంత్రాంగం పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొరవడిన నిఘా.....

ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసు శాఖ నేరాల నియంత్రణలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానికులు ఆరోపిస్తున్నారు గస్తీ పెంచడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం, సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

గాంధారి ప్రాంతంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించి, అవసరమైన చోట పోలీసు నిఘాను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలకు భద్రత కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యత. గాంధారిలో నేరాలకు అడ్డుకట్ట పడిన చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?

కూరగాయల మార్కెట్‌లో టపాసుల దుకాణాలకు అనుమతులా..?

తృటిలో తప్పిన పెను ప్రమాదం..

చెత్తకు నిప్పు పెట్టడంతో ఎగిసి పడిన మంటలు

భీంగల్ జనంసాక్షి: భీంగల్ పట్టణంలో దీపావళి పండుగ సందర్భంగా టపాసుల విక్రయాల కోసం మున్సిపల్ అధికారులు కూరగాయల మార్కెట్‌లో ఏకంగా 13 దుకాణాలకు అనుమతులు ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.నిత్యం వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే మార్కెట్.. పక్కనే నివాస గృహాలు.. ఇలాంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే ఈరోజు దుకాణాల పక్కన చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు ఒక్కసారిగా పెద్దఎత్తున ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.అయితే చెత్తకు నిప్పు పెట్టినప్పుడే మంటలు ఈ స్థాయిలో ఎగిసిపడితే.. టపాసుల దుకాణాల వద్ద ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటి? ప్రజల ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు?అసలు కూరగాయల మార్కెట్‌లో 13 దుకాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారు?ప్రజల భద్రత కంటే వ్యాపారాల ఏర్పాటుకే ప్రాధాన్యత ఇచ్చారా? ప్రమాదం జరిగిన తర్వాత స్పందిస్తారా.. ముందే చర్యలు తీసుకుంటారా?మున్సిపల్ ఉన్నతాధికారులు, పోలీస్ శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని, ప్రజల భద్రతకు ముప్పు కలిగించే ఏర్పాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వ అసమర్ధ విధానాలతోనే రైతులకు నష్టం

మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్



హాలియా (జనంసాక్షి): ముఖ్యమంత్రి అసమర్ధ విధానాల వల్ల రాష్ట్రంలోని రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ఆరోపించారు. హాలియాలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగునీరు అందిస్తామని, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఖరీఫ్‌లో వరి సాగు చేశారని తెలిపారు. అయితే, పంట వేసిన తర్వాత ప్రభుత్వం సాగునీటిని సరిగా అందించకపోవడం, రైతులకు అవసరమైన కరెంటు ఇవ్వకపోవడం వల్ల పొలాల్లో పంటలు ఎండిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని నోముల భగత్ కుమార్ డిమాండ్ చేశారు. రబీలో రైతులు ఎలాంటి పంటలు వేయాలో ప్రభుత్వం సూచించడంతో పాటు, యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించడం రైతులకు, వ్యవసాయ కూలీలకు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తుందని విమర్శించారు. క్రాప్ హాలిడే ప్రకటిస్తే రైతులు, వ్యవసాయ కూలీలు జీవనోపాధి కోసం ఎలా ఉంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.నాగార్జునసాగర్ జలాశయంలో నీరు ఉన్నప్పటికీ వర్షాకాలంలో సాగునీరు అందించలేదని, ఇప్పుడు యాసంగి పంటలు వేయవద్దని చెబుతున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, కూలీలు ఏడాది పొడవునా ఎలా జీవించాలో ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. రబీలో వ్యవసాయానికి ఎన్ని గంటల కరెంటు అందిస్తారో కూడా ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని కోరారు.మిల్లర్లు సిండికేట్ ఏర్పాటు చేసి రైతులను నిలువుగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సీజన్ ప్రారంభంలో క్వింటాల్ ధాన్యానికి రూ. 4,500 చెల్లించిన మిల్లర్లు, ప్రస్తుతం క్వింటాల్‌కు రూ. 2,700 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. రైతులకు కనీస గిట్టుబాటు ధర కూడా అందకుండా ఉండటం గురించి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడేళ్ల పాలన హస్తవ్యస్తంగా ఉందని విమర్శించారు. గత శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా పూర్తిగా నెరవేర్చలేదని ఆయన ఆరోపించారు.నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్ పాలనలోనే జరిగిందని, గత మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులకు ఇప్పుడు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, కొత్తగా చేసిన పనులేమీ లేవని విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను కూడా ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయలేకపోతోందని ఆరోపించారు. మున్సిపాలిటీలోని నాలుగో వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్‌కు మున్సిపల్ కమిషనర్ సరైన గుర్తింపు, గౌరవం, నిధులు అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు తప్పుగా వక్రీకరిస్తున్నారని, అసత్య ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు రవి నాయక్ బైరం కృష్ణ చిట్టిపోలు శ్రీనివాసులు వడ్డే సతీష్ రెడ్డి చేగొండి కృష్ణ ఆవులు సైదయ్య పిల్లి వెంకట్ సురభి రాంబాబు పొదిలి శ్రీను మాజీ కౌన్సిలర్ శ్రీను కడమంచి శ్రీను పె రుమళ్ళ రాంబాబు పాల్గొన్నారు

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
8 నవంబర్ 2026

బాధితులకు భరోసా.. నిందితులకు శిక్ష పడేలా చర్యలు

- పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపొందించాలి
- కేసుల దర్యాప్తు, విచారణలో జాప్యానికి తావివ్వొద్దు
- సాక్షుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- కోర్టు డ్యూటీ, లైజనింగ్ అధికారులకు సీపీ అంబర్ కిశోర్ ఝా సూచన



గోదావరిఖని, నవంబర్ 7 (జనంసాక్షి): బాధితులు తమ సమస్యలతో మానసిక వేదన, ఆందోళనలో ఉంటారని, వారితో పోలీసులు అత్యంత సున్నితత్వంతో, గౌరవప్రదంగా వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా కల్పించడం ప్రతి పోలీసు అధికారి బాధ్యతని స్పష్టం చేశారు. శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు చేపట్టి, బలమైన సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో సమర్పించాలని ఆదేశించారు. నాణ్యమైన దర్యాప్తు, సాక్షుల హాజరు, సకాలంలో చార్జిషీట్ల దాఖలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం ద్వారా శిక్షల శాతాన్ని పెంచాలని సూచించారు.కోర్టు సమన్లను సకాలంలో అందజేసి సీసీటీఎన్ఎస్‌లో వివరాలు నమోదు చేయాలని, పెండింగ్ వారెంట్లను త్వరితగతిన అమలు చేయాలని ఆదేశించారు. మూడేళ్లు, అంతకంటే ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న వారెంట్లకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఫిర్యాదుదారులు, బాధితులు, సాక్షులు నిర్ణీత తేదీల్లో కోర్టుకు హాజరయ్యేలా దర్యాప్తు, ప్రాసిక్యూషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. సాక్షుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలక్ట్రానిక్ ఆధారాలతో పాటు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను పకడ్బందీగా సేకరించాలని తెలిపారు. దర్యాప్తు నుంచి న్యాయస్థానంలో విచారణ వరకు ప్రతి ప్రక్రియ నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, విచారణలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కోర్టు విచారణలకు సంబంధిత అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని, సమర్థవంతంగా పనిచేసే వారికి తగిన గుర్తింపు, ప్రోత్సాహకాలు ఉంటాయని పేర్కొన్నారు. పోలీసుల పనితీరు ద్వారా ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం పెంపొందించాలని అన్నారు. అనంతరం పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడటంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులను సీపీ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, వర్టికల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, తాందూర్ సీఐ దేవయ్య, సీసీఆర్‌బీ ఎస్‌ఐలు ఉపేందర్, వినీత, సీసీ సందీప్, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ముందు పార్కు చేసిన వాహనాలే టార్గెట్

- జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాల దొంగతనం
- ప్రత్యేక టీం బృందం తో గుర్తించి నిందితుడిని అరెస్టు చేసిన పెద్దపల్లి పోలీసులు



పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) : జల్సాల కోసం సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గత కొన్ని నెలల నుండి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందు పార్క్ చేసిన బైక్ లను టార్గెట్ చేస్తూ వాటిని దొంగతనం చేస్తున్న నిందితుడిని 8 ద్విచక్ర వాహనాలతో పాటు శనివారం పట్టుకోవడం జరిగిందని పెద్దపెల్లి ఏసిపి జి కృష్ణ వివరాలు వెల్లడించారు. నేరస్థుడు జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ప్రస్తుతం తల్లితో పెద్దపల్లి పట్టణంలో ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడని అతను గతంలో బసంత్ నగర్ లోని సిమెంట్ ఫ్యాక్టరీ నందు లోడింగ్ పని చేసేవాడు, 2025 సంవత్సరంలో అతని హార్ట్‌కు స్టంట్ పడగా అప్పటినుండి ఆ పని మానివేసి కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆ తర్వాత అతని భార్య లక్ష్మికి అతనికి మధ్య మనస్పర్ధలు రాగా నిందితుడు అతని అమ్మ అయిన ఈశ్వరితో కలిసి హనుమాన్ నగర్‌లో కిరాయికి ఉంటున్నాడు. నేరస్తుడు కూలి పని చేయగా వచ్చే డబ్బులు తన అవసరాలకు జల్సాలకు సరిపోనందున సులభంగా డబ్బులు సంపాదించాలని అనుకొని, బైకులు దొంగతనం చేసి వాటన్నింటినీ ఒకేసారి మహారాష్ట్రకు తీసుకువెళ్లి ఎవరికైనా అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని, ఎవరికీ అనుమానం రాదని నిర్ణయించుకున్నాడు.దానికోసం చూస్తున్న క్రమంలో పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఎప్పుడు బైకులు పార్క్ చేసి ఉండడం తను గుర్తించి అక్కడ పార్క్ చేసిన బైకులు దొంగతనం చేయడం సులభమని నిర్ణయించుకొని ఆగస్ట్ నెల నుండి వరసగా బైక్ లను దొంగతనం చేసి తను కిరాయికి ఉంటున్న ఇంటి వద్ద దాచినాడు.వరుసగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బైక్ లు దొంగతనాలు అవుతున్న దృష్ట్యా ,వాటిని నిలువరించేందుకు పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి, ఏసిపి జి .కృష్ణ ఆదేశానుసారం పెద్దపల్లి సిఐ కే.ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో పెద్దపల్లి టౌన్ ఎస్ఐజి రాజశేకర్ సారధ్యంలో ఒక స్పెషల్ టీం ను ఏర్పాటు చెయ్యడం జరిగిందని వారు నిందితుడిని గుర్తించి బంధంపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ వద్ద నిందితుడు తను దొంగలించిన హోండా షైన్ పై వెళ్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. నిందితుడి నుండి మొత్తంగా 8 బైక్‌లను సీజ్ చేశామని నేరస్తుడిని పట్టుకోవడంలో చాకచక్యం గా వ్యవహరించిన పెద్దపల్లి టౌన్ ఎస్ఐజి.రాజశేకర్, హెడ్ కానిస్టేబుల్ ఎం.రమేష్,కానిస్టేబుల్స్ కె.ప్రభాకర్, ఎం.అనిల్ కుమార్ లను ఏసీబీ అభినందించారు.

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి

- కాలువల పూడికతీత, గ్రామపంచాయతీ, మహిళా సంఘాల భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి
- కూలీల సంఖ్య పెంచడంతో పాటు పనుల్లో పారదర్శకత పాటించాలి
- ఓదెల మండలంలో పనులను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఓదెల/పెద్దపల్లి, నవంబర్ 07 (జనంసాక్షి): వీబీజీ రామ్‌జీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం ఓదెల మండలంలోని గోపరపల్లి, హరిపురం గ్రామాల్లో పర్యటించిన ఆయన ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి పథకం అమలు, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లోని సాగునీటి కాలువల పూడికతీత పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కాలువల్లో పూడిక తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా, సాగునీటి సరఫరా మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో స్థానిక అవసరాలను గుర్తించి, అభివృద్ధికి దోహదపడే పనులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.వీబీజీ రామ్‌జీ పథకం నిబంధనల ప్రకారం గ్రామపంచాయతీ కార్యాలయాలు, మహిళా సంఘాల భవనాల నిర్మాణాలను చేపట్టాలని, అసంపూర్తిగా ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

ఉపాధి హామీ పనులకు రోజువారీగా హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని, గ్రామాల్లో అందుబాటులో ఉన్న పనులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కూలీల హాజరు, మస్టర్ రోల్స్, పనుల కొలతలు, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నాణ్యతతో పూర్తి చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఎంపీడీవో అనిల్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


GOVERNMENT OF TELANGANA
ABSTRACT
GENERAL ADMINISTRATION (NRI) DEPARTMENT
G.O.Ms.No.1603
ORDER:

గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.1.60 కోట్ల ఎక్స్‌గ్రేషియా మంజూరి

- ఒక్కో గల్ఫ్ మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు
- కామారెడ్డి జిల్లాలో 15, నిజామాబాద్ జిల్లాలో 17 మందికి సాయం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనం సాక్షి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.5 లక్షల గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా పథకంలో భాగంగా మరో 32 మంది గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు మొత్తం రూ.1.60 కోట్ల ఆర్థిక సహాయం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 3వ తేదీన సాధారణ పరిపాలన (ఎన్ఆర్ఐ) శాఖ జారీ చేసిన జీఓ నెం.1603 ద్వారా ఈ ఆర్థిక సహాయానికి పరిపాలనా అనుమతి లభించింది. ఇందులో కామారెడ్డి జిల్లాకు చెందిన 15 మంది మృతుల కుటుంబాలకు రూ.75 లక్షలు, నిజామాబాద్ జిల్లాకు చెందిన 17 మంది మృతుల కుటుంబాలకు రూ.85 లక్షలు మంజూరు చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.1 కోటి 60 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ఆమోదించింది. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి, తెలంగాణకు చెందిన కార్మికులు బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల్లో మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది.

ఆయుష్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 07(జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమాల అమలులో భాగంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్న ఆయుష్ వైద్యాధికారులు, ఫార్మసిస్ట్, సైకో సోషల్ కౌన్సిలర్, యోగా ప్రొఫెషనల్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాలను విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆయుష్ వైద్యాధికారుల 3 పోస్టులు, ఫార్మసిస్ట్ 1 పోస్టు, సైకో సోషల్ కౌన్సిలర్ 1 పోస్టు, యోగా ప్రొఫెషనల్ 1 పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, మొత్తం 149 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో ఆయుష్ వైద్యాధికారుల పోస్టులకు 115, ఫార్మసిస్ట్ పోస్టుకు 18, సైకో సోషల్ కౌన్సిలర్ పోస్టుకు 6, యోగా ప్రొఫెషనల్ పోస్టుకు 10 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హత ప్రమాణాల ప్రకారం అభ్యర్థుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పోస్టుల వారీగా ప్రొవిజినల్ మెరిట్ జాబితాలను సిద్ధం చేసి విడుదల చేసినట్లు తెలిపారు. ఈ జాబితాలు పెద్దపల్లి జిల్లా అధికారిక వెబ్సైట్ పెద్దపల్లి తెలంగాణ గౌ ఇన్ లో అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి తమ మెరిట్ జాబితాలను పరిశీలించుకోవాలని సూచించారు.విడుదల చేసిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాలపై అభ్యంతరాలు ఏవైనా ఉంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలతో మూడు పని దినాల్లోగా, అనగా నవంబర్ 9,10, 11వ తేదీల్లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. గడువు ముగిసిన తర్వాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబడవని స్పష్టం చేశారు. ఈ నియామక ప్రక్రియకు సంబంధించి ఇతర సందేహాలు, వివరాల కోసం జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ జి.ఎన్ అరుణ 92811 72473 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

శ్రీపాద మార్గు ఫోర్ వే లైన్‌పై భూ సేకరణ

భూసేకరణకు రైతులు సహకరించాలి : మంథని ఆర్డీవో సురేష్



మంథని, నవంబర్ 07, (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా మంథని మండలం మల్లెపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ లక్కాకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో నరేష్ మాట్లాడుతూ.. అంగులూరుకు సంబంధించిన శ్రీపాద మార్గు ఫోర్ వే లైన్ కోసం భూసేకరణ చేపడుతున్నామని తెలిపారు. భూసేకరణ ప్రక్రియ పూర్తిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరుగుతుందని, ఏ రైతుకు అన్యాయం జరగదని స్పష్టం చేశారు. భూమి కోల్పోయే ప్రతి రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన విధంగా న్యాయమైన పరిహారం అందజేస్తామని, రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని కోరారు. భూముల సర్వే, కొలతలు, రికార్డుల పరిశీలన పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించి ఏవైనా సమస్యలు, అనుమానాలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులకు రైతులు సహకరించాలని, ఫోర్ వే లైన్ వల్ల ఈ ప్రాంతానికి మంచి రవాణా సౌకర్యం, అభివృద్ధి కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఆర్ఐ, జిపిఓ సతీష్, భూ సర్వే రాజశేఖర్, ఉప సర్పంచ్ రాజమల్లు, వార్డు సభ్యులు గువ్వల ప్రశాంత్, కొవ్వూరి శైలజ, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కమిషన్ లేనిదే పనిచేయని యూనివర్సిటీ రిజిస్ట్రార్

స్పాట్ అడ్మిషన్ నిర్వహించాలని భిక్షాటన: యేండల ప్రదీప్ విద్యార్థి నాయకుడు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 7 జనం సాక్షి: తెలంగాణ విశ్వవిద్యాలయంలో డబ్బులు వచ్చే పనిలో ముందుండి కమిషన్ల కోసం తాపత్రయపడుతూ విద్యను విద్యార్థులకు దూరం చేస్తున్న రిజిస్ట్రార్ గత నాలుగు రోజుల నుంచి విశ్వవిద్యాలయంలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయాలని వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోని యూనివర్సిటీ యంత్రాంగానికి శనివారం విద్యార్థులు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయంలో గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం కల్పించాలంటూ వినతి పత్రాలు ఇచ్చిన నిమ్మకు నీరెత్తని విధంగా వ్యవహరించడంపై భిక్షాటన చేసి డబ్బులు ఇస్తామని నిరసన వ్యక్తం చేశారు. కొన్ని డిపార్ట్మెంట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించి ఇప్పుడు మిగిలిన డిపార్ట్మెంట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించకపోవడంపై ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కొద్ది రోజుల క్రితమే విశ్వవిద్యాలయంలోని బోధన సిబ్బందికి అందరికి కూడా ప్రమోషన్లు ఇవ్వడం జరిగింది. ఒక్క బోధన సిబ్బంది వెనుక ఏరియర్స్ రూపంలో లక్షల రూపాయలు వారికి ఇవ్వడం జరుగుతుంది. లక్షల రూపాయలు ఇచ్చి విద్యార్థులను విద్యకు దూరం చేయడంపై ఆంతర్యం ఏంటని విద్యార్థి నాయకులు ఎండల ప్రదీప్ ప్రశ్నించారు. అందుకే భిక్షాటన చేసే వారికి ఎన్ని డబ్బులు కావాలన్నా అన్ని ఇస్తామని నిరసన తెలియజేయడం జరిగింది. ఇప్పటికైనా విద్యార్థులకు చదువుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిత్విక్ ,తరుణ్, రాహుల్, ప్రణవ్, వినయ్, అక్షయ్ పాల్గొన్నారు.

అల్లం నారాయణకు మాతృవియోగం

- బుచ్చమ్మ మృతికి ప్రముఖుల ఘన నివాళి
- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి



మంథని, నవంబర్ 07 (జనంసాక్షి): తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, రాజయ్య, వీరన్నల మాతృమూర్తి అల్లం బుచ్చమ్మ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం గాజులపల్లిలో శనివారం నిర్వహించిన నివాళుల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, కళాకారులు, రచయితలు, మేధావులు, అధికారులు, పాత్రికేయులు పాల్గొని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ గంట చక్రపాణి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులు నివాళులర్పించారు. అనంతరం అల్లం నారాయణతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాతృమూర్తిని కోల్పోవడం తీరని లోటని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. మాదన కుమారస్వామి, నగునూరి శేఖర్, ముచ్చకుర్తి కుమార్, పుట్ట రాజన్న, అనంతరెడ్డి, బాలసాని రాజయ్య, గుమ్మడి కొమురయ్య, గాజులపల్లి సర్పంచ్ కారంగుల సుధాకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొండ శంకర్, శంకర్ గౌడ్, ఆకుల కిరణ్, గాండ్ల మల్లేష్, ఎలుకటూరి శంకర్, అరుణ్, శ్రీమన్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్ఓ



కథలాపూర్ నవంబర్ 7 (జనం సాక్షి) : కథలాపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఓ ఎన్ శ్రీనివాస్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా హాస్పిటల్ కు సంబంధించిన వివిధ రకాల వైద్య సేవలను పరీక్షించారు. అవుట్ పేషెంట్ విభాగాన్ని ఇన్ పేషెంట్ విభాగాన్ని ఫార్మసీని మరియు ల్యాబ్ ను అన్ని విభాగాలు మరియు రిజిస్టర్లు తనిఖీ చేశారు. డిప్యూటీ డిఎంఎస్ శ్రీనివాస్ వెంట ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.సింధుజ వెంట ఉండి అన్ని విషయాలు వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. వీటికి సంబంధించిన తగు సూచనలు ఇవ్వడం జరిగింది.టీబి కేసులను తొందరగా గుర్తించి తొందరగా న్యాయం అయినందుకు తగిన మందులు ఇవ్వాల్సిందిగా సూచించడం జరిగినది. అలాగే లెప్రాసిక్ వేస్ట్ అని కూడా గుర్తించి లెప్రసీ వ్యాధి ప్రబలకుంట ప్రజల్లో సరియైన ఆరోగ్య విద్య చేసి వారికి తగిన సూచనలు మందులిచ్చి లెప్రసి విముక్తి కావాలని సూచించడం జరిగినది.డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్ వెంట వైద్యాధికారి డాక్టర్ పి సింధుజ నర్సింగ్ ఆఫీసర్ పి.కావ్య ల్యాబ్ టెక్నీషియన్ చిన్న రాజయ్య మరియు ఆఫీస్ సబార్డినేట్ ఉమర్ పాల్గొన్నారు. అట్లాగే జిల్లా నుంచి వచ్చిన టీబీ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ హరీష్ ఫార్మసీ ఆఫీసర్ గిరిధర్ వెంట ఉన్నారు.

సొంతింట్లో తొలి దీపావళి.. ఇందిరమ్మ కుటుంబాల్లో పండుగ వెలుగులు

- లబ్ధిదారుల ఇళ్లలో పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించాలి
- ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో భాగస్వాములు కావాలి
- మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పోస్టర్ ఆవిష్కరణ
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 07 (జనంసాక్షి) : సొంతింటి కల సాకారమై తమ ఇంట్లో తొలి దీపావళి జరుపుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ వెలుగులు నిండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని లబ్ధిదారుల ఇళ్లలో పండుగ వాతావరణం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఐడీఓసీలోని తన ఛాంబర్‌లో అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతో ప్రజాప్రతినిధులు, అధికారులు మమేకమై దీపావళి వేడుకల్లో పాల్గొనాలని సూచించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగను జరుపుకోవాలని తెలిపారు. సొంతింటి సంతోషాన్ని పండుగ సంబరాలతో పంచుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రతి లబ్ధిదారుడి కుటుంబంలో ఆనందం వెల్లివిరిసేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అమృత హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ విద్యార్థి ఆత్మహత్య

- యాజమాన్యం వేధింపులే కారణమంటూ తోటి విద్యార్థుల ఆందోళన
- కాలేజీ ఎదుట విద్యార్థులు, ఎన్ఎస్‌యూఐ నాయకుల ధర్నా.. అద్దాలు, కిటికీలు ధ్వంసం



ఎస్ఆర్ నగర్, జనం సాక్షి: ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృత హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీకి చెందిన భాను ప్రసాద్ రెడ్డి అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. కాలేజీ యాజమాన్యం, లెక్చరర్ వేధింపుల కారణంగానే తమ స్నేహితుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ శనివారం తోటి విద్యార్థులు, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకులు కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏఐ పోస్టర్ రూపొందించిన విషయమై లెక్చరర్ భాస్కర్ విద్యార్థి భాను ప్రసాద్ రెడ్డి ఫోన్‌ను తీసుకున్నట్లు ఆరోపించారు. సుమారు పది రోజుల క్రితం తీసుకున్న ఫోన్‌ను కాలేజీ ప్రిన్సిపల్‌కు అప్పగించినప్పటికీ తిరిగి ఇవ్వలేదని, ఈ విషయమై విద్యార్థి కుటుంబ సభ్యులు ప్రిన్సిపల్‌ను సంప్రదించినా స్పందన లేకపోయిందని తెలిపారు. ఈ క్రమంలో తోటి విద్యార్థుల ఎదుట అవమానానికి గురైన భాను ప్రసాద్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం తాను నివసిస్తున్న గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనకు కాలేజీ యాజమాన్యమే బాధ్యత వహించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన సందర్భంగా ఆగ్రహానికి గురైన కొందరు ఎన్ఎస్‌యూఐ నాయకులు కాలేజీలోని అద్దాలు, కిటికీలను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై స్పందించిన ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కాలేజీ ప్రిన్సిపల్ చంద్ర మోహన్, లెక్చరర్ భాస్కర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరోవైపు ఉదయం ఎన్ఎస్‌యూఐ నాయకులు చేపట్టిన ఆందోళనలో కాలేజీ అద్దాలు, కిటికీలు ధ్వంసం కావడంతో ఏసీపీ రాఘవేంద్ర రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. భాను ప్రసాద్ రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.



ఏఎస్‌డీడీ జాబితాలోని ఓటర్లకు మరో అవకాశం

నవంబర్ 21లోగా గణన పత్రాలు సమర్పించాలి: అడిషనల్ కలెక్టర్ విక్టర్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) : ఏఎస్‌డీడీ జాబితాలో గుర్తించబడిన ఓటర్లకు తుది ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చుకునేందుకు మరో అవకాశం కల్పించినట్లు అడిషనల్ కలెక్టర్ విక్టర్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు జారీ చేసినప్పటికీ గైర్హాజరైనవారు, నివాసం మారినవారు, మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదైనవారు, డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన వారి పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు చేసుకోలేదన్నారు. సంబంధిత ఓటర్లు ముసాయిదా జాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు. తుది ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చుకునేందుకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు లేదా ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించి అవసరమైన గణన పత్రాలు సమర్పించాలని తెలిపారు. అర్హులైన ఓటర్లు ఈ నెల 21వ తేదీలోగా సంబంధిత బీఎల్ఓలకు పత్రాలు అందజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ విక్టర్ కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కార్యకర్తలపై దాడులు సహించేది లేదు

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, నవంబర్ 7 (జనంసాక్షి) : రాజకీయ కక్షలతో కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులపై బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హెచ్చరించారు. సదాశివపేట మండలం సూరారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కూరాకుల సంతోష్ కుమార్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కాంగ్రెస్‌కు చెందిన గ్రామ సర్పంచ్ దుర్భాషలాడుతూ, చంపేస్తానని బెదిరించినట్లు బాధిత కుటుంబం ఎమ్మెల్యేకు వివరించింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన ఆయన, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో బెదిరింపులు, దౌర్జన్యాలకు తావులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినియోగదారుల వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలి

హైదరాబాద్ సిటీ, నవంబర్ 7 (జనం సాక్షి) : వినియోగదారుల వివాదాలను సుదీర్ఘ న్యాయపో రాటాలకు తావులేకుండా,పరస్పర చర్చలు, అవగా హన,సామరస్యపూర్వక పరిష్కారాల ద్వారా త్వరి తగతిన పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వాన్ని (మీడియేషన్) వినియోగదారుల న్యాయవ్యవస్థ లో అంతర్భాగంగా అభివృద్ధి చేయాలని తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.సామ్ కోషి అన్నారు. సత్వర, సులభ, తక్కువ ఖర్చుతో కూడిన న్యాయాన్ని అందించడంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. శనివారం ఖైరతాబాద్‌లోని ఎరువాక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(టీఎస్‌సీడీఆర్‌సీ), హైదరాబాద్ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'వినియోగ దారుల వివాదాల్లో మధ్యవర్తిత్వం ఆచరణాత్మక, కార్యాచరణ దృక్పథంలో అవగాహన' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ-కామర్స్, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు,ఆన్‌లైన్ సబ్ స్క్రిప్షన్లు, ఆర్థిక లావాదేవీలు,



సాంకేతిక ఆధారిత సేవల విస్తరణతో వినియోగదారుల లావాదేవీల స్వరూపం మారిందని, అదే సమయంలో వివా దాలు కూడా పెరుగుతున్నాయని జస్టిస్ సామ్ కోషి పేర్కొన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం- 2019 ద్వారా ఉత్పత్తుల బాధ్యత, కేంద్ర వినియో గదారుల రక్షణ ప్రాధికార సంస్థ ఏర్పాటు, వినియో గదారుల మధ్యవర్తిత్వానికి చట్టబద్ధమైన వ్యవస్థ వంటి కీలక అంశాలకు ప్రాధాన్యత కల్పించినట్లు వివరించారు. మధ్యవర్తిత్వం కేవలం కేసుల పరిష్కారానికి ప్రత్యామ్నాయ ప్రక్రియ మాత్రమే కాదని, తటస్థ మధ్యవర్తి సహకారంతో ఇరుపక్షాలు పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారాలను అన్వేషించే భాగస్వామ్య విధానమని అన్నారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవరావు, వెబ్ న్యాయ్ సీఈఓ విశ్వం జిందాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సహకారంతో నల్సార్ ద్వారా ఆన్‌లైన్ వివాద పరిష్కార వ్యవస్థను ప్రారంభించే ప్రతిపాదనను వివరించారు. అనంతరం వినియోగదారుల హక్కులు, వివాదాల పరిష్కారానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ రిజిస్ట్రార్ సత్యేంద్ర, హైదరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా వినియోగదారుల కమిషన్ల అధ్యక్షులు, సభ్యులు, న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

పేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలి

నారాయణపేట, నవంబర్ 7 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు మారుతి, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని పిడిఎస్ యు ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ విసి శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో చదువుతున్న విద్యార్థులు డిగ్రీ పూర్తి అయిన తర్వాతపై చదువుల కోసం, మహ బూబ్‌నగర్, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడతా ఉన్నది. హార్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనేక మంది విద్యార్థులు పై చదు వుల కోసం దూరప్రాంత లకు వెళ్లలేక చదువుకు దూరమైతున్న పరిస్థితి ఈ ప్రాంతంలో ఉన్నది.



నారా యణపేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని గత దశాబ్దాలుగా ఉద్యమాలు కొనసా గిస్తున్నప్పటికిని ప్రభుత్వంలో చలనం లేని పరిస్థితి ఉన్నదన్నారు. వెంటనే నారాయణపేట జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నారా యణపేట జిల్లా కేంద్రంలో ఉన్న శ్రీ చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ల్యాబ్ లను నిర్వహించుకోవడం కోసం కావలసిన వస్తువులు కూడా లేకపోవడం సిగ్గుచే టు అని అన్నారు. అంతే కాకుండా టాయిలెట్స్ కూడా సరిగా లేవు అని, బ్లాక్ బోర్డ్, ఫ్యాన్స్, లైబ్రరీ, ఇలా అనేక సమస్యలతో ఆ కాలేజీలో విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి ఉందని అందుకని ఆ సమస్యలను వెంటనే పరిష్కరించుకోవడం కోసం ఆ కాలేజీకి నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఒకవేళ లేనిపక్షంలో యూనివర్సిటీ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి. ఎస్.యు జిల్లా కార్యదర్శి మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి రాజు, జిల్లా నాయకులు సురేష్, నరసింహ పాల్గొన్నారు.

టీకాల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● సిబ్బందికి డిఎంహెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ హెచ్చరిక



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 7 (జనంసాక్షి) : వైద్య సేవల నిర్వహణలో నిర్లక్ష్యం, విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ హస్మత్‌పేట్, బీడీకే అంజయ్యనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా టీకాల పంపిణీ, వైద్య రికార్డుల నిర్వహణ, జాతీయ ఆరోగ్య పథకాల అమలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. టీకాల పంపిణీ జాబితాలు, లబ్ధిదారుల వివరాలు, టీకాల నిల్వ, శీతలీకరణ వ్యవస్థను తనిఖీ చేశారు.

ప్రతి ఏఎన్ఎం, ఆశా కార్యకర్త తమ పరిధిలోని చిన్నారులు, గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. టీకాలు పొందని వారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన కార్యక్రమాల వివరాలను రిజిస్టర్లు, సంబంధిత అంతర్జాల వేదికల్లో సకాలంలో నమోదు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం, రికార్డుల నవీకరణలో జాప్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాల్లోని రికార్డులు, జాతీయ ఆరోగ్య పథకాల అమలు తీరును పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆరోగ్య సేవలు చేరేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించారు.

చంద్రయ్యకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



తాండూరు, నవంబర్ 7 (జనంసాక్షి) : అనారోగ్యంతో బాదపడుతున్న చంద్రయ్యకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభ ప్రద్ పటేల్ పేర్కొన్నారు. తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలం రెడ్డిఘనాపూర్ గ్రామానికి చెందిన మంగళి చంద్రయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభ ప్రద్ పటేల్ శనివారం ఆసుపత్రికి వెళ్లి చంద్రయ్యను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. చంద్రయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అలాగే ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి చంద్రయ్యకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వారి కుటుంబాలకు మనోధైర్యం కల్పించడం మనందరి బాధ్యత అని ఈ సందర్భంగా శుభ ప్రద్ పటేల్ పేర్కొన్నారు.

హకీంపెట్ సిఎం సభను విజయవంతం చేయాలి



నారాయణపేట, నవంబర్ 7 (జనం సాక్షి) : కొడంగల్ నియోజకవర్గం హకీం పేట లో ఈ నెల 9న జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి సమన్వయ కర్త, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కోరారు. శనివారం నారాయణపేట నియోజకవర్గం నుంచి వెళ్ళే రైతుల సమీకరణ, ఏర్పాట్ల గురించి మండల అధ్యక్షుడు కోట్ల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నారాయణపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎమ్మార్ మాట్లాడుతూ ప్రతి మంద లానికి బస్సులు ఏర్పాటు చేశామని, సభకు వచ్చే రైతులకు భోజనాలు ఏర్పా టు చేస్తామని తెలిపారు. ఎల్లుండి జరగబోయే సభకు పెద్ద ఎత్తున హాజరై రైతుల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు.

ఘట్కేసర్‌లో 60 కిలోల గంజాయి పట్టివేత

● రూ.30 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

● ఇద్దరు అరెస్ట్

మేడ్చల్ ఘట్కేసర్, నవంబర్ 7 (జనం సాక్షి) : అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠా గుట్టును ఎస్ఓటీ ఎల్‌బీనగర్ జోన్ పోలీసులు, పోచారం ఐటీ కారిడార్ పోలీసులు సంయుక్తంగా రట్టు చేశారు. ఈ దాడిలో సుమారు రూ.30 లక్షల విలువైన 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ మీదుగా ముంబైకి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఘట్కేసర్ మండలం అన్నోజిగూడ గ్రామ శివారులోని మసాలా కంపెనీ సమీపంలో శనివారం ఉదయం 11.30 గంటల సమయంలో మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో ఉన్న మారుతి సుజుకి కాr4 కారును అడ్డుకున్నారు. కారులో తనిఖీలు నిర్వహించగా వెనుక సీటు వెనుక భాగంలో దాచిన 60 ప్యాకెట్ల గంజాయి బయటపడింది. మొత్తం 60 కిలోల గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన కారును, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో హైదరాబాద్‌లోని బండ్లగూడ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అమెర్ (28), చంద్రాయణగుట్టకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్ ఉద్దీన్ అలియాస్ జిద్దీ (35)లను అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన పూర్ణచంద్ర మహాపాత్ర



గంజాయిని సరఫరా చేయగా, ముంబైలోని ధారావికి చెందిన యాస్మిన్ చంద్ సయ్యద్‌కు సరుకు చేరవేయాల్సి ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వీరిద్దరూ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కిలో గంజాయిని సుమారు రూ.7 వేల చొప్పున కొనుగోలు చేసి, రూ.15 వేల వరకు విక్రయించేందుకు నిందితులు ప్రణాళిక రూపొందించినట్లు విచారణలో వెల్లడైంది. గతంలోనూ సరఫరాదారు రెండుసార్లు గంజాయిని పంపినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న సరఫరాదారు, కొనుగోలుదారుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని, ఈ విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మునిపల్లి, నవంబర్ 7 (జనం సాక్షి) : కరువు పరిస్థితుల నేపథ్యంలో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మల్లారెడ్డిపేట గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో రైతులందరూ పంట నష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. నకిలీ విత్తనాల కారణంగా



నష్టపోయిన రైతులను కూడా ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో దళారులు రైతులను మోసగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇలాంటి వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో విజేందర్ రెడ్డి, బసంతి రామ్ రెడ్డి, లింగం, మొగులయ్య, అశోక్, రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం అక్రమ విక్రయాలు..

● ఇద్దరు మహిళల అరెస్టు

● రెండు ప్రాంతాల్లో ఎక్సైజ్ దాడులు..

● 163 మద్యం బాటిళ్లు స్వాధీనం



అల్వాల్, నవంబరు 7 (జనంసాక్షి) : డిఫెన్స్ క్యాంటీన్ల నుంచి తీసుకొచ్చిన మద్యాన్ని ఇళ్ల వద్ద నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి లోతుకుంట, న్యూ బోయిన్‌పల్లి ప్రాంతాల్లో నిర్వహించిన వేర్వేరు దాడుల్లో మొత్తం 163 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

మల్కాజిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్‌రావు నేతృత్వంలోని బృందం లోతుకుంట సరస్వతీనగర్‌లోని ఓ ఇంటిపై దాడి చేసింది. అక్కడ 96 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నాగప్రసన్నను అరెస్టు చేసింది. ఆమె భర్త రామాంజనేయులు క్యాంటీన్ల నుంచి మద్యం తీసుకొస్తుండగా, నాగప్రసన్న విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

మరో ఘటనలో న్యూ బోయిన్‌పల్లి సౌజన్య కాలనీలో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సీఐ గణపతిరెడ్డి బృందం తనిఖీలు నిర్వహించింది. ముసిమి లెంక (39) ఇంట్లో నిల్వ ఉంచిన 67 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకుంది.రెండు ఘటనల్లో స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.2.11 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద ఆర్‌యూబీ ప్రారంభం



అల్వాల్, నవంబరు 7 (జనంసాక్షి) : జనప్రియ అపార్ట్‌మెంట్స్ సమీపంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి పనులు పూర్తికావడంతో శనివారం వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీంతో అల్వాల్ బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ వాహనదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఆర్‌యూబీ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయడంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చూపిన చొరవ అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మచ్చబొల్లారం డివిజన్ సీనియర్ నాయకులు డోలి రమేష్, అనిల్ కిషోర్ గౌడ్, పవన్‌కుమార్, నర్ల సురేష్, శరణగిరి యాదగిరి గౌడ్, జావేద్, అనిల్, సందీప్ గౌడ్, రేవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిల్స్ డీసీఎం బోల్తా

● 12 మంది బీహార్ కూలీలకు తప్పిన పెను ప్రమాదం

● మంగళపల్లి ఫైర్ స్టేషన్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన వాటర్ బాటిళ్ల వాహనం

● బాటిళ్ల కింద చిక్కుకున్న కూలీలను కాపాడిన స్థానికులు

● డ్రైవర్ సహా నలుగురికి గాయాలు

● గుండెపోటు వచ్చిన వ్యక్తికి స్థానికుల సీపీఆర్

రంగారెడ్డి, నవంబర్ 7 (జనంసాక్షి) : నాగార్జున సాగర్ జాతీయ రహదారిపై ఉన్న మంగళపల్లి ఫైర్ స్టేషన్ సమీపంలో శనివారం భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మినరల్ వాటర్ బాటిళ్లతో నగరం నుండి ఇబ్రహీంపట్నం వైపు వెళ్తున్న టీజీ34టి9155 నెంబర్ గల డీసీఎం వాహనం అతి వేగంతో వచ్చి రోడ్డు మధ్యలోని డివైడర్‌ను బలంగా ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాద సమయంలో డీసీఎం వెనుక భాగంలో లోడు మధ్య 12 మంది బీహార్‌కు చెందిన కూలీలు ప్రయాణిస్తున్నారు. ఒక్కసారిగా వాహనం బోల్తా పడటంతో లోడులోని వాటర్ బాటిళ్లు కూలీలపై పడటంతో వారు వాటి కింద నలిగిపోయి తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్రమాదాన్ని గమనించి అప్రమత్తమైన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. వాటర్ బాటిళ్లను పక్కకు తొలగించి, కింద చిక్కుకున్న కూలీలను బయటకు తీశారు. ప్రమాద సమయంలో తీవ్ర భయాందోళనకు గురై ఒక వ్యక్తి హార్ట్ స్ట్రోక్ (గుండెపోటు)కు గురవ్వగా, స్థానికులు వెంటనే స్పందించి అతనికి సీపీఆర్ అందించి ప్రాణాపాయం నుండి తప్పించారు.

హాస్పిటల్‌కు క్షతగాత్రుల తరలింపు...

ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ముఖేష్, సమర్ సింగ్, శుక్ సింగ్, ముకేష్ కాస్రల్, హేమంత్ సింగ్, సాయికుమార్ ని వెంటనే ఇబ్రహీంపట్నం లిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. లోడులో 12 మంది ఉన్నప్పటికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్..

డీసీఎం బోల్తా పడటంతో వందలాది వాటర్ బాటిళ్లు రోడ్డుపై పడిపోవడంతో సాగర్ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఆదిభట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కాగా, రోడ్డు డివైడర్ మధ్య ఉన్న చెట్లకు నీళ్లు పోస్తున్న ట్రాక్టర్ ను తప్పించే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఆదిభట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రద్దీగా ఉండే ఈ మార్గంలో రహదారి భద్రతా చర్యలు పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
08 నవంబర్ 2026

గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా హైదరాబాద్

'ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ ఎకోసిస్టమ్' బలోపేతంపై ప్రత్యేక దృష్టి



- 'ఆర్థా ఫిన్‌టెక్' కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (జనంసాక్షి) : ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పన, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్ లో పరిశోధన, అభివృద్ధి(ఆర్ అండ్ డీ)కి ప్రోత్సాహం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఆర్థా ఫిన్‌టెక్ హైదరాబాద్ కార్యాలయాన్ని శనివారం హైటెక్ సిటీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఐటీ/ఐటీఈఎస్ రంగంలో హైదరాబాద్ సాధించిన అంతర్జాతీయ గుర్తింపును ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలకూ విస్తరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా పెట్టుబడులకు, ఆవిష్కరణలకు, ఎమర్జింగ్ టెక్నాలజీస్ కు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. గ్లోబల్ కంపెనీలు తమ కార్యకలాపాలను హైదరాబాద్ కు విస్తరించేలా 'ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ ఎకో సిస్టం'ను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. బ్యాంకింగ్-యాజ్-ఏ-సర్వీస్, ఓపెన్ బ్యాంకింగ్ ఏపీఐలు, ఆటోమేటెడ్ ఆన్‌బోర్డింగ్, కేవైసీ/కేవైబీ, ఏఎంఎల్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్ మౌలిక సదుపాయాలు తదితర ఫైనాన్షియల్ టెక్నాలజీ పరిష్కారాలను ఆర్థా ఫిన్ టెక్ అందిస్తోందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో ఆర్థా ఫిన్ టెక్ సీఈఓ మధు బాబు గడిపాటి, ఆర్మిన్ ఒర్డోదరీ, ఇమాన్యుయేల్ సి. ఫెర్నాండెస్ తదితరులు పాల్గొన్నారు.

వేదమ్మ జ్ఞాపకాలకు అక్షరరూపం

ఆమె ప్రేమ, ఆప్యాయతలు.. ఉద్యమ ప్రస్థానానికి స్ఫూర్తి

- 50 వ్యాసాలతో 'ఐదో తరగతి నుంచి అట్టానని వరకు..' పుస్తకావిష్కరణ







గద్వాల నడిగడ్డ, నవంబర్ 7 (జనంసాక్షి) : ఉద్యమ బాటలో నడిచిన వారికి ప్రేమతో అన్నం పెట్టి, ఆప్యాయతతో ఆదరించిన వేదమ్మ జ్ఞాపకాలు అక్షరరూపం దాల్చాయి. ఆమెతో తమకున్న అనుబంధాన్ని, ఆమె సేవలను, ఉద్యమ ప్రస్థానంలో అందించిన స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ పలువురు మిత్రులు, బంధువులు భావోద్వేగంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వేదమ్మ జీవితంలోని అనుభవాలు, జ్ఞాపకాలతో 50 వ్యాసాలు పొందుపరిచిన 'ఐదో తరగతి నుంచి అట్టానని వరకు..' పుస్తకాన్ని ఆవిష్కరించారు. గద్వాలలోని మామార్ట్ పైన శనివారం నిర్వహించిన ఈ సభలో బంధువులు, ప్రజాసంఘాల మిత్రులు మాట్లాడుతూ.. వేదమ్మ ఇంటికి వచ్చే ప్రజాసంఘాల కార్యకర్తలకు ఆప్యాయంగా ఆహారం పెట్టి ఆదరించిన తీరును గుర్తుచేసుకున్నారు. ఆమె పంచిన ప్రేమ, చూపిన ఆదరణ ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. సుగుణ తన ఆచరణతో 20 ఏళ్లపాటు ఉద్యమంలో కొనసాగిన స్ఫూర్తిని ప్రస్తావిస్తూ, సుగుణ జ్ఞాపకాలలో 'నా బిడ్డ గుణమ్మ' పేరుతో రాసిన వ్యాసం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచిందని గుర్తుచేశారు. రెండో విడత కార్యక్రమంలో 50 వ్యాసాలతో రూపొందించిన 'ఐదో తరగతి నుంచి అట్టానని వరకు..' పుస్తకాన్ని జిలేఖ బి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవాచారి వేదమ్మ వ్యక్తిత్వం, ఆమె సేవలను వివరించారు. ఉదయం జరిగిన జ్ఞాపకాల సభకు వేదమ్మ మనవడు అభిరామ్ అధ్యక్షత వహించగా.. రెండో విడత పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని కొండారెడ్డి అధ్యక్షత నిర్వహించారు. వేదమ్మ కుమారుడు కొండారెడ్డి, కుమార్తెలు జ్యోతి, విజయతో పాటు బంధువులు పాల్గొన్నారు. ప్రజాసంఘాల బాధ్యులు సుభాన్, ప్రభాకర్, గోపాల్, ఆంజనేయులు, నాగన్న, సిఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, రేవతి తదితరులు హాజరయ్యారు. సుమారు 250 మంది పాల్గొన్న ఈ సభలో గౌస్ తన పాటలతో సభికులను ఉత్తేజపరిచారు. భోజనాల అనంతరం వేదమ్మ జ్ఞాపకాల పుస్తకాన్ని సభకు హాజరైన వారందరికీ అందించినట్లు సిఎంఎస్ రాష్ట్ర కన్వీనర్ బన్నూరు జ్యోతి, వకీలు బి, కొండారెడ్డి, ఆర్టిస్ట్ విజయ తెలిపారు.



సీఎస్ఆర్ కార్యక్రమాల అమలుపై జాతీయస్థాయి శిక్షణ

రెండు రోజుల సామర్థ్యాభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న సింగరేణి అధికారులు

- సింగరేణి అమలు చేస్తున్న వినూత్న సీఎస్ఆర్ కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు
- సీఎస్ఆర్‌లో ఉన్నత విద్యార్హత సాధించిన డీజీఎం నిమ్మ భాస్కర్‌కు అభినందన
- సన్మానించిన సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి



హైదరాబాద్ (జనంసాక్షి) : బొగ్గు రంగానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థల్లో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల అమలులో మరింత సమర్థతను పెంపొందించడం, ప్రాజెక్టుల రూపకల్పన, నిధుల సద్వినియోగం, పర్యవేక్షణ, మూల్యాంకనం, సామాజిక ప్రభావ అంచనా తదితర అంశాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో కోల్‌కతాలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి సామర్థ్యాభివృద్ధి కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) అధికారులు పాల్గొన్నారు. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసీఏ), కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 4, 5 తేదీలలో "బొగ్గు రంగ సంస్థల కోసం ప్రత్యేక కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) విధానంపై రెండు రోజుల సామర్థ్యాభివృద్ధి శిక్షణ" పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఐసీఏ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ గరిమా దధీచ్ బొగ్గు రంగ సంస్థలకు అనువైన ప్రత్యేక సీఎస్ఆర్ విధానాలు, సామాజిక అవసరాల ఆధారంగా ప్రాజెక్టుల ఎంపిక, ప్రణాళికాబద్ధమైన అమలు, నిధుల సమర్థ వినియోగం, పర్యవేక్షణ, ఫలితాల మూల్యాంకనం, దీర్ఘకాలిక సామాజిక ప్రభావం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సింగరేణి సంస్థ తరఫున హైదరాబాద్ కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఐఈ), పరిపాలనాధికారి శ్రీ నిమ్మ భాస్కర్, సీఎస్ఆర్ విభాగం సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎస్.ఎం.డి. గౌస్ పాషా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రతినిధిగా నిమ్మ భాస్కర్ సంస్థ అమలు చేస్తున్న వివిధ ప్రతిష్ఠాత్మక సామాజిక బాధ్యత కార్యక్రమాలు, వాటి లక్ష్యాలు, అమలు విధానాలు, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, సామాజిక అభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని సమగ్రంగా వివరించారు. సింగరేణి డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీ నిమ్మ భాస్కర్ ఇటీవల ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఐజీఎన్ఓయూ) నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. సీఎస్ఆర్ రంగంలో ప్రత్యేక విద్యార్హత సాధించడంతో పాటు కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో సింగరేణి సామాజిక బాధ్యత కార్యక్రమాలను సమర్థవంతంగా వివరించి, సంస్థకు ప్రశంసలు లభించేలా కృషి చేసిన నిమ్మ భాస్కర్‌ను సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, ఐఏఎస్ అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు. సింగరేణి సంస్థ బొగ్గు గనుల పరిసర ప్రాంతాల ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ విద్య, వైద్యం, తాగునీరు, పర్యావరణ పరిరక్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాల్లో అనేక సీఎస్ఆర్ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇటువంటి జాతీయ స్థాయి సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాల్లో అధికారుల భాగస్వామ్యం ద్వారా ఆధునిక సీఎస్ఆర్ విధానాలు, ఉత్తమ ఆచరణలు, సామాజిక ప్రభావ మూల్యాంకన పద్ధతులపై అవగాహన మరింత పెరుగుతుందని, తద్వారా సింగరేణి సంస్థ చేపట్టే సామాజిక బాధ్యత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, ఫలితాల ఆధారితంగా అమలు చేసేందుకు దోహదపడుతుందని సంస్థ పేర్కొంది.

దీపావళి కానుకగా 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు

కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం ప్రారంభం

హైదరాబాద్ (జనంసాక్షి) : దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు అందించనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఆదివారం నాడు తన నియోజక వర్గమైన కోడంగల్‌లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క పాల్గొన నున్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత కార్మికులు, గీత కార్మికులు తదితర వర్గాల్లోని అర్హులైన వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నారు. కోడంగల్‌లో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి కొంత మంది నూతన లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేస్తారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతి నిధులు, అధికారుల చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేస్తారు. కొత్తగా పింఛన్లు మంజూరైన వారందరికీ ఈ నెల నుంచే పింఛను మొత్తాన్ని అందించనున్నారు.

తెలంగాణ సంస్కృతిలోని వైవిధ్యాన్ని కాపాడాలి

- 'తెలంగాణ దీపావళి' పుస్తకావిష్కరణలో జూలూరు



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ సంస్కృతిలోని వైవిధ్యాన్ని ,వారసత్వాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. ప్రముఖ చరిత్రకారులు డాక్టర్ ధ్యావనపల్లి సత్యనారాయణ రచించిన "తెలంగాణ దీపావళి" ట్రైబల్ రూరల్ అండ్ టౌన్ ట్రెడిషన్స్ అన్న పుస్తకాన్ని శనివారం త్యాగరాయ గానసభలో జూలూరు గౌరీ శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగలోనీ పౌరాణిక విశిష్టత, గిరిజనుల కళా సంపద, గ్రామీణ సంప్రదాయాలు, పట్టణ ప్రజల ఆధునిక వేడుకలను ఈ పుస్తకంలో ధ్యావనపల్లి ఈ తరానికి అర్థమయ్యే విధంగా వివరంగా రాశారని జూలూరు చెప్పారు. ముఖ్య అతిథి ప్రముఖ చరిత్రకారుడు అడపా సత్యనారాయణ మాట్లాడుతూ పుస్తకంలోని నాలుగు అధ్యాయాలలో గ్రామీణ పట్టణ గిరిజన మహానగరాలలో దీపావళి ఎలా జరుపు కుంటారు ఆధారాలతో వివరించారని చెప్పారు. దీపావళి కేవలం పండుగ మాత్రమే కాదని అజ్ఞాన మనే చీకట్లను తొలగించి జ్ఞానమునే వెలుగులను నింపే పండుగ అని తెలిపారు. ప్రముఖ సాహితీ వేత్త సంఘనబట్ల సత్యనారాయణ మాట్లాడుతూ గిరిజనుల, గోండుల సాంప్రదాయాలు గుస్సాడీ దండారి నృత్యాలను ఇందులో వివరించారని పేర్కొ న్నారు. గిరిజనుల కళ వైభవాన్ని సామూహిక జీవన విధానాన్ని, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణను ప్రాముఖ్యతను సవివరంగా చెప్పార న్నారు. సభ ఆధ్యక్షులు త్యాగరాయ గాన సభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రజల దీపావళి సందర్భంగా జరుపుకునే సాంప్రదా యాలు పూజ ఏర్పాట్లను ప్రకృతి సంబంధమైన వస్తువులతో జరిపే అలంకరణను సంప్రదాయ వంటకాలు ప్రతాలు, నోములు ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. పుస్తక రచయిత ప్రముఖ చరిత్రకారులు ధ్యావనపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దీపావళి పండుగకు సంబంధించిన వివిధ కోణాలు ఏ విధంగా విశ్లేషించారు తెలిపారు. దీపావళికి సంబంధించిన గిరిజన గ్రామీణ సమాజ పద్ధతులు ఆచారాలు జానపద సంప్రదాయాలు చరిత్ర లోపలికి వెళ్లి పరిశోధించి నమోదు చేశానని తెలియచెప్పారు. ఈ కార్యక్రమంలో దేశిరాజు శ్యామసుందర రావు స్థపతి , జూమ్మవేని ప్రసాద్ తదితర సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

మాటల్లో కాదు.. చేతల్లో చూపిన సమానత్వం

దళిత నాయకుడి ఇంట్లో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే శంకర్ సహపంక్తి భోజనం





- కులవివక్షకు తావులేని సమాజమే కాంగ్రెస్ లక్ష్యం
- దళితులు బలంగా ఉంటేనే సమాజం బలంగా ఉంటుంది : షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ (జనం సాక్షి) : కులం, మతం, వర్గం అనే తేడాలు లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానమేనని చెప్పడమే కాదు.. ఆ సమానత్వాన్ని చేతల్లో చూపించడం కూడా ముఖ్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చాటిచెప్పారు. అంటరానితనం, కులవివక్ష వంటి సామాజిక రుగ్మతలు ఇంకా అక్కడక్కడా కనిపిస్తున్న తరుణంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండల కేంద్రంలో ఓ దళిత నాయకుడి ఇంట్లో వారు సహపంక్తి భోజనం చేయడం చర్చనీయాంశంగా మారింది.

నందిగామ గ్రామ సర్పంచ్, దళిత కాంగ్రెస్ నాయకుడు కొమ్ము కృష్ణ ఇంటికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేరుకున్నారు. కొమ్ము కృష్ణ దంపతులు స్వయంగా వండిన భోజనాన్ని మంత్రికి, ఎమ్మెల్యేకు ఆప్యాయంగా వడ్డించారు. వారి ఆతిథ్యాన్ని స్వీకరించిన మంత్రి, ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దళితవాడలో దళిత నాయకుడి ఇంట్లో భోజనం చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. సమాజంలో మనుషుల మధ్య కులం, మతం, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా వివక్ష చూపడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, ముఖ్యంగా దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దళితులు బలంగా ఉంటేనే సమాజం బలంగా ఉంటుందని, వారి అభివృద్ధి ద్వారానే సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. కేవలం ఓట్ల కోసం దళితులను ఉపయోగించుకునే వారు కొందరుంటారని, కానీ వారి అభ్యున్నతిని నిజంగా ఆకాంక్షిస్తూ అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370